ను; మఱియు నాసమయముననే సాలబజ్జంగు యుద్యోగస్థులలో, పరాసువార యుద్దేశములను గూర్చి, కలిగిన ఈర్ష్య భేదాభిప్రాయములను వృద్ధి చేయుటకు కూడ నతఁడు చింతించెను. మాన్షియరు బుస్సీ యట్టి తంత్రము లేవియు పారకుండ స్థైర్యముతోడను జాగరూకతతోడను మెలంగెను. ఒకనాఁడు మహారాష్ట్ర శిబిరముపై నతాత్తుగ యుద్ధము సలుప నతఁడు ప్రయత్నము చేసెను. నవంబరు 22 వ తారీఖున చంద్ర గ్రహణకాలమందు, హిందువు లెల్లరు విధ్యుక్త క్రియల నిర్వర్తించుకొనుచుండగ మోగలు సైన్యములు వారిపైఁ బడెను. మహారాష్ట్ర సైన్యమెల్ల వారి ముందు పలాయన మాయెను. విలువగల కొంత కొల్లధనము వారికి దొరకెను. అందు ముఖ్యముగ పీష్వాయొక్క కొన్ని బంగారు పాత్రసామానులుండెను. మహారాష్ట్రులకు జననష్ట మిందు బహుస్వల్పమైనను, ఈ సాహసకృత్యమువలన, బుస్సీ,తాను నిజముగ బుద్ధిసామర్థ్యములు చూపించిన యనేక ముఖ్యవ్యవహారములందు కంటె, నెక్కువగ ప్రతిష్ఠను దేశీయులయందు సంపాదించినటులఁ గనుపడుచున్నది.

మహారాష్ట్రులు అతాత్తుగఁ దాకంబడి నప్పటికిని, మఱునాఁడు వారు తమ సహజతీవ్రంబుతో నెదురుఁదాకిరి. కాని మోగలులుముందుకు సాగిపోయి రంజంగామును కొల్లఁబెట్టి తేలిగాము (దండయిరే)ను నాశనముచేసిరి. చివరకు 27-వ నవంబరున మోగలులు, మహారాష్ట్రులచే నత్యంత ఆత్మ నిశ్చయముతో, దాకఁబడిరి. అప్పుడు కేవలము పరాసుఫిరంగి దళముచే సంపూర్ణ పరాభవమునుండి మోగలులు తప్పింపఁబడిరి. ఈసమయమున మహారాష్ట్రబలములు, రాణోజీ సింధియా యొక్క కుమారులలో నిద్దరగు దత్తాజీ మహాదాజీ యనువారలవలనను, కోనేరు త్రింబకు యేకబూతీ యను వాని వలనను, సాహాయ్యముచేయఁబడి, వెనుక దివానుగ నుండియున్న మహాదాజీపంతు పురంధరే వలన నడుపఁ బడినవి.ఇందు కోనేరుత్రింబకు కొన్ని పరాక్రమ కార్యంబులు చేయుటవలన పరాక్రేయను బిరుదునొందెను. ఆనాఁటినుండి యతఁడు తన గుఱ్ఱము ముందు కాలునకు వెండి గండపెండెరము వేసికొని సవారి చేయుచుండెడివాఁడు. ఆచిహ్నము, మన హిందువులందు రణరంగమున నట్టియాశ్వికుడు చచ్చు

టొండె విజయముచేకొను టొండె గాక తిరిగి వచ్చువాఁడు కాఁడని, తెలియఁ బఱచెను. ఈవిజయముకూడ మొగలుల దాడి నడ్డగింపలేదు. కాని వారు భీమనదీతీరముననున్న కోరిగాము నొద్ద చేరిన తరువాత రాజారఘునాధదాసు, పీష్వానుండి వచ్చినరాయభారముల చేత, సదాశివరావు భావూతో సందర్శనము ను పొందెను. ఇందువలన సమరవిరామ సంధి జరిగెడిదే కాని, ఇంతలో మహారాష్ట్ర యుద్యోగస్థులలో నొకఁడు త్రింబకు కోటను పట్టుకొనఁగా, దానిని పీష్వా తిరిగి యియ్యననివందున సందేశములు విఫలమయ్యెను. సాలబజ్జంగు దానిని తిరిగి పట్టుకొనుటకు పట్టుపట్టెను. మొగలు సైన్యము తమ మందుగుండుసామానును పూర్తిచేసికొనుటకును, క్షేత్ర ఫిరంగులను తెచ్చుకొనుటకును అహమ్మదునగరమునకు మరలిరి. మహారాష్ట్రులు వారిని మార్గమధ్యమున కడు వేధించిరి. ఫిరంగులను రవానా చేయుటకు బాటయందలి కష్టముల యొక్క వృత్తాంతములును, రఘోజీభోంస్లే తూర్పుదిక్కునకు యాత్ర వెడలుచున్నవాఁడను వర్తమానములును, చెవిని బడినతోడనే సాలబజ్జంగు యొక్క తీవ్రంబును అచిరంబు నగు యుత్సాహము చల్లఁబడెను. అతని సైన్యముల యొక్క జీతములు వెనుకఁబడెను. వారు ఘోష పెట్టుచుండిరి. ఇంకను వారి సేవ యవసరమైన యెడల నింకను వారితొందర యెక్కువగును. అనేకమంది
1752 ముఖ్యయుద్యోగస్థులు అసంతుష్టులైయుండిరి. చిట్టచివఱకు బుస్సీనలహా వలన పీష్వాయొక్క రాయభారములతో సమాధానము చేసికొనుటకు నిశ్చయింపఁబడెను. యుద్ధవిశ్రాంతి కుదిరెను. సాలబజ్జంగుయొక్క సైన్యములు హైదరాబాదునకు తిరిగివచ్చెను. కాని విద్రోహచిహ్నము లణగలేదు. దివానగు రఘునాధదాసు, ఏప్రిలు 7-వ తారీఖున బాల్కివద్ద బాకీజీతముల కొఱకై సిపాయిలచే కల్పింపఁబడిన కలహమునందు, చంపఁబడెను.

పశ్చిమమున నీకార్యములు జరుగుచుండ, ననుభవశాలియగు రఘోజీ, తనదేశీయులయందు విఖ్యాతయశుం జేసిన ఘనకార్యంబులతోడ తన దీర్ఘ జీవితంబునకు వన్నె పెట్టుచుండెను. నాఁడు 1750 సం॥ మున తనదేశంబున కల్లోలము కలుగుటవలనను, బెంగాలునందు జయంబుల నొందుటకు తగిన తరుణ

మానవ్వమైనందువలనను, పూనానుండి పీష్వావద్ద సెలవు పుచ్చుకొని బేరారు నకు వచ్చుటకు, తత్తరపడెను. అతనికుమారుఁడగు జానోజీ, వాజరుజంగు సైన్యమునుండి తిరిగివచ్చినతోడనే, కటకమునకు మీరుహబీబునకు సహాయము చేసి బెంగాలునకు దాడి వెడలుటకు పంపఁబడెను. ఆదేశమున నొకసంవత్సరమునుండి మహారాష్ట్ర దండయాత్రలు లేకుండెను. మరల మహారాష్ట్రులు తద్దేశపు ధనధాన్యంబుల గ్రహించుటకు ద్విగుణంపు టాసక్తితో వచ్చుచుండిరి. ఆలివర్దిఖానుడు తప్పించుకొనుమార్గము వేఱొకటిలేక కటకమునుండి ఉత్తరమున బాలసూరువఱకును దేశమును మీరుహబీబున కిచ్చివేసెను. ఇతఁడు పేరునకు మాత్రము బెంగాలు నవాబునకు ప్రతినిధియని చెప్పఁబడుచుండెను కాని నిజముగ రఘోజీభోంస్లే సేవకుఁడుగనుండెను. మీరు హబీబు తనపదవిని చిరకాల మనుభవింపలేదు. వానియొక్క తోడిపరిపాలకుఁడైనజానోజీయొక్క యీర్ష్యవలన నితఁడు రివిన్యూ నపహరించెనను మిషమీద ఖైదునం దుంచఁబడెను. మీరు హబీబీ యవమానమును సహింపలేక తనపై నుంచఁబడిన కావలివారల నతిక్రమించి కొందఱు అనుచరులతో పైకివెడల సాహసించి నఱికివేయఁబడెను. బెంగాలుయొక్కయు బేహారుయొక్కయు చౌతుక్రింద 12 లక్షలు రూపాయలు తనకింక నుగల హక్కులక్రింద రఘోజీ పుచ్చుకొనుట కంగీకరించెను. ఇంత స్వల్పధనముతో రఘోజీ తృప్తిపడుటకు కారణము దక్కనునందు జరుగుచున్న వృత్తాంతములే యైయున్నవి. పీష్వాయు సాలబజ్జంగును యుద్ధసన్నద్ధులైనవెంటనే రఘోజీ గావలగడ, నర్నాలా, మానికుదుర్గ మొదలైన కోటలను పట్టుకొని వాని నాధారము చేసికొనియున్న జిల్లాల నాక్రమించెను. సాలబజ్జంగు బుస్సీసలహావలన పూనాపైపునకు నడచినపు డితఁడు పానిగంగా గోదావరి మధ్యదేశము నాక్రమించుకొనుటయే గాక మొగలుతాణాలను తఱిమివేసి తన స్వంతఠాణాలను స్థాపించెను.

దక్కనునందు తరువాతి వృత్తాంతములను దెలియపఱచుటకుఁ బూర్వము, ఢిల్లీ చక్రవర్తి దర్బారునందు నిజాముల్ముల్కు పెద్దకుమారునియొక్కయు, యప్పటి మహారాష్ట్రుల రాజకార్యములయొక్కయుకథ కొంత విచారింపవల

సియున్నది. గాజీ యుద్దీనుఖాను, తండ్రి చనిపోయినప్పటినుండియు, దక్కనుకు పోవలెనని యనుకొనుచున్నను, ఢిల్లీయందే యంచఁబడుచుండెను. అతఁడు నిజాము రాజ్యమును సంపాదించుకొనుటకు మహారాష్ట్రులతో సందేశములు జరుపుచున్నప్పటినుండియు నతఁడు రాకుండ నచ్చట నేయుంచి వేయఁబడుటకు తమ్ములచే దర్బారునందు లంచములుకూడ నుపయోగింపఁబడినమాట నిజముకావచ్చును. అహమ్మదుషా రాజ్యమునకు వచ్చినతోడనే, అహమదుషా అబ్దాలీ రెండవ
1748 సారి అఫ్గనిస్థానముసుండి దాడివచ్చెనను వార్త దెలియగనే, చక్రవర్తి దర్బారు కంపమునొందసాగెను. లాహోరునకును మూల్తానకును వెనుక వజీరుగ నుండిన కమరుద్దీనుఖాను కుమారుఁడగు మీరుమను గవర్నరుగా నుండెను. ఇతఁడు అబ్దాలీని నాలుగుజిల్లాల రివిన్యూ నిచ్చుటవలన శాంతిపఱచెను. ఈ సమాధానము కుదిరినందువలన ప్రస్తుతము వజీరుగనున్న ఔదునవాబగు సఫ్దరుజంగు తన దేశముపై విజృంభింపనున్న రోహిలాల నణచివేయుటకుఁ దగిన యవకాశము కలిగినవాఁడాయెను. రోహిలాల మూలపురుషుఁడగు నీవఱకు చెప్పఁబడిన ఆలీమహమ్మదు రోహిలా, సఫ్దరుజంగు వజీరుకాక పూర్వము, కొలది కాలము క్రిందటనే, కాలము చేసెను. కావున వారిలో పుట్టిన యంతఃకలహములను సఫ్దరుజంగు వృద్ధిచేయుటకు ప్రయత్నించి యుండెను. అబ్దాలీయొక్క భయమణఁగినతోడనే, సఫ్దరుజంగు రోహిల్ఖండులోనికి దేశమును వశముచేసికొని తన యుద్యోగస్థుఁడగు నేవాలరాయియను నొక కాయస్థుని వారి నాయకునిగా నియమించెను. రోహిలాలు త్వరలో తిరుగఁబాటు చేసినవారై నేవాలురాయి నోడించి చంపివేసిరి. సఫ్దరుజంగు వారిని శిక్షించుట కరిగి యుద్ధమునం దోడిపోయెను. అంతట నతఁడు తనకు సహాయముగ మల్హారిరావు హోల్కారును, జయపాసింధియాను, జాటురాజగు శూరజమల్లును బిలిచెను. ఈ సాహాయ్యముతో నతఁడు రోహిలా దేశమునంతను జయించి, వారిలో ననేకులను కుమానునగములకు తఱిమివేసి, దేశములో చాలభాగమును సింధియాహోల్కారులకు ధనమునకు బదులుగ నిచ్చివేసెను. మహారాష్ట్రీ వ్యవహారము లిట్లు హిందూస్థానమునం దుచ్ఛదశయం దుండగా వారి రాజధాని దక్కను

నందు సాలబజ్జంగు దండయాత్రవలన నుపద్రవమున కాకర మైనట్లు మనము చూచి యుంటిమి. సూరతునకు దండయాత్ర వెడలిన రఘునాథరావువెనుకకు పిలువఁబడెను. మల్హారిరావు హోల్కారు, గాజీయుద్దీను వచ్చినను రాకపోయినను, వెంటనే దక్కనునకు రావలసినదని పీష్వాచే సందేశములు పంపఁబడెను. హోల్కా రప్పుడు కుమాను నగములయొద్ద నున్నవాఁడై యుత్తరము లందగనే బయలుదేరి గంగానదిదాటివచ్చి యచట దక్కనునందు పీష్వా సాలబజ్జంగులకు సంధి జరిగినదనివినినవాఁడై తాను రావలసిన పనియున్నదా యని మరల నాజ్ఞకొఱ కుత్తరము వ్రాసి యచటవేచి యుండెను.

ఈ సమయమున మూఁడవ పర్యాయ అఫ్గనిస్థానపురాజగు అహమదుషా అబ్దాలీ హిందూస్థానముపై దండెత్తివచ్చెను. ఇందుమూలమున వజీరు సప్దరుజంగు ఢిల్లీకి పిలువఁబడెను. కాని యతఁడు రాక పూర్వమే చక్రవర్తి, మూల్తాను లాహోరులతని కిచ్చివేసి, సంధిచేసికొనెను. లేనియెడల వజీరు వానిని తఱిమి వేయుటకుప్రయత్నము చేసియుండెడివాఁడే. అందుకొఱకాతఁడు హోల్కారు సింధియాలను సహాయముకోరి సర్వము నాయత్తము చేసెను. ఆరంభముననే యిట్లు హిందూమహారాష్ట్రులు కలిసి పరదేశీయుఁడగు అహమ్మదుషా అబ్దాలీని తఱిమివేసి యుండినయెడల 1761 సం॥ మున కురుక్షేత్రమున భారతమాత వీర తనూజుల రక్తమనర్గళంబుగ వ్యర్థమై స్రవింపకుండెడిదియే.

మహారాష్ట్రులు క్రొత్తగ జయింపఁబడిన, రోహిలఖండు నుండి వారి ప్రార్థనలవలన లేవవలసివచ్చినందున,నచట 50 లక్షల రూపాయిలు కప్పమునకు పత్రమును పుచ్చుకొని వెడలిరి. సప్దరుజంగు వీరిని అబ్దాలీపై ప్రయోగింపవలెనని యనుకొనెను గాని యచట చక్రవర్తియొక్క యాతురముచే కార్యము మించి పోయెను. వజీరు తన మహారాష్ట్ర స్నేహితుల నెటుల నుపయోగింప వలెనో తెలియఁజాలకుండెను. కాని పీష్వా,సాలబజ్జంగులో మరల తగిన సమయ మాసన్నమగు వఱకును యుద్ధవిశ్రాంతియే పుచ్చుకొనియుండెను కాన, హోల్కారు సింధియాలను మరల రావలసినదని తెలియఁజేయుచు, గాజీ యుద్దీనుతోఁగూడ ఉత్తరప్రత్యుత్తరములు జరుపుచుండెను. కావున నన్నిపక్షములువారిని సంతృప్తి

చేయుటకు, వజీరు గాజీయుద్దీనుడు మహారాష్ట్రస్నేహితులతో దక్షిణ క్షేత్రమెండు తన యదృష్టలక్ష్మిం గనుంగొనుటకు పొమ్మని యానతిచ్చెను.

గాజీయుద్దీనుడు సింధియాహోల్కారులను దక్షిణమునకు వచ్చుచుండ, వానిని పీష్వా బర్హాంపురమునకు పోయి యెదుర్కొనెను. సాలబజ్జంగును, రాజా రఘునాధదాసు చంపఁబడిన తరువాత, తన రాజ్యములో ప్రజారంజకులైన సయ్యదులష్కరుఖానును షానవాజుఖానును రావించి యందు మొదటివానిని ప్రధానమంత్రిగను, రెండవవానిని హైదరాబాదు పరగణాకు సుభేదారుగను చేసెను. సయ్యదులష్కరుఖానుండు, మహారాష్ట్రులతో స్నేహముగనుండి, రహస్యముగ గాజీయుద్దీను పక్షముగనుండెను. ఈ లష్కరుఖానుఁడు, తాను మహారాష్ట్రులపక్షమునకుఁ దిరిగిపోయినట్లు నటించి, యందులో ప్రముఖుల నసేకులను త్రిప్పివేసినదని, సాలబజ్జంగును బుస్సీనికూడ తన వాక్చమత్కారములవలన తృప్తిపఱచెను. ఇతఁడు బయలుదేరి కర్మలా మొద్ద జానోజీనింబాల్కరును కలిసికొని యతనితోడ పీష్వాను దర్శించి తాను గాజీయుద్దీనుపక్షమున నున్నటుల భావమగుపఱచెను. ఇట్లు మొగలు మహారాష్ట్రసైన్యము లన్నియుకూడి ఔరంగబాదునకు వచ్చు సరికి 1,50, 000 అయ్యెను. ఉభయపక్షములవారును ఐర్ష కాలమంతయు పిమ్మట యుద్ధముచేయుటకు సన్నద్ధులగుచుండిరి. సాలబజ్జంగుపక్షమునుండి రాయభారములు ప్రారంభమయ్యెను. ఈ మధ్యకాలములో పీష్వా, గాజియుద్దీనునుండి బేరారునకు పశ్చిమమున తపతీ గోదావరీ మధ్యదేశము సర్వహక్కు భుక్తములతో, తనకును తనయుద్యోగస్థులకును వ్రుచ్చుకొనెను. అన్నిపక్షములవారి హక్కులును స్థిరపఱుపఁబడ వచ్చినంతలో గాజీయుద్దీను ఒకదురదృష్టపుఘడియలో పట్టణమునం దొక విందునకరిగి యచట తన సవతితమ్ముఁడగు నిజామాలీయొక్క తల్లిచే నియ్యఁబడిన విషభోజనంబు గుడిచి వెంటనే మృతినొందెను.

సాలబజ్జంగు నిర్వైరుడై యుండుటవలన తనయన్న మహారాష్ట్రులకిచ్చిన దేశము నియ్యనని చెప్ప మొదలుపెట్టెను. కాని యతఁడదిపఱకు గాజీయుద్దీను యాధిక్యత నొకసారి యంగీకరించినతరువాతను, మహారాష్ట్రు

సైన్యమంతయు కూడకొనియున్నాఁడనియును, బర్హాంపూరు ముఖ్యులందఱును బాలాజీరావు పక్షముననే పోరాడుట వారి స్వార్థమై యున్నందునను బుస్సీయొక్క సలహావలన నతఁడందుల కంగీకరించెను. ఇందుకుఁగాను సాలబజ్జంగు రఘూజీ భోంస్లే సైన్యములు పానిగంగానుదాటి యవతలి కరుగవలెననికోరెను.

సంధి యేర్పడిన తరువాత, మహారాష్ట్ర సైన్యములు తమతమ దేశములు కరిగెను. హోల్కారును, జయపాసింధియాయును, హిందూస్థానమున కరిగిరి. పీష్వా పూనా జేరెను. సయ్యదు లష్కరుఖానుఁడు మరల ప్రధాన
1753 మంత్రిగ నియమింపఁబడెను. సాలబజ్జంగు హైదరాబాదునకు తిరిగి వచ్చెను. బుస్సీమార్గ మధ్యమున శరీరమునం దస్వస్థుఁడై సముద్రతీరమున నారోగ్యమును గోలుకొనుటకు మచిలీ పట్టణమున కరుదెంచెను. ఇతని వ్యాధి కొంచెము దీర్ఘమై యితఁ డచ్చట కొంతకాల మెక్కువగ నుండవలసి వచ్చెను. ఆ సమయములో యూరోపియనుల యెడల నయిష్టుఁడగు సయ్యదులష్కరుఖానుఁడు సాలబజ్జంగును పరాసు సైన్యములను తప్పించి వేయునట్లు చేసెను. కాని బుస్సీ రోగముకుదురగనే మరల ఔరంగబాదున కరిగి యచటనున్న సాలబజ్జంగును మరల మాటలచే వశముచేసికొని సయ్యదులష్కరుఖానును మంత్రి పదవినుండి తప్పింపఁజేసి షానవాజుఖానును ఆ యుద్యోగమునందు నియమింపఁజేసెను. బుస్సీయొక్క సైన్యమును తప్పించుటకు కారణము తగినధనము లేకపోవుట యని చెప్పి యప్పుడు శ్రీకాకుళము, రాజమహేంద్రవరము, ఏలూరు సర్కారులందుకుగా నతనికి సాలబజ్జం గిచ్చెను. దానిని రక్షించుటకు బుస్సీ 150 గురు యూరోపియనులను, 2500 స్వదేశీ సిపాయిలను, నియమించి యా సర్కారులను ముఖ్య దేశముఖుఁడగు విజయ రామరాజునకు మూఁడు కోట్ల రూపాయిలకు గుత్తకిచ్చెను.

పీష్వా తన కియ్యఁబడిన దేశము నాక్రమించుకొనుట అయినతోడనే కర్ణాటకమున దండయాత్ర నలుపుటకు గొప్పసైన్యమును పోగుచేసెను. కోరమండల తీరమున యుద్ధములో మైసూరు సైన్యములు పరాసువారికి మిత్రులుగ నేర్పడిరి. ఈ తరుణము కర్ణాటకమందు బాకీ కప్పమును వసూలు చేసికొనుట

కనుకూలమని యతఁడు తలఁచి గుజరాతు దండయాత్రను ప్రస్తుతము దినికొఱ కాపివేసెను. కాని, తాను స్వయముగ బయలుదేరక మునుపు, తారాబాయితో సమాధానమునకు త్రోవ నేర్పఱుపవలెనని యతఁడు తలఁచెను. అతఁడు ఔరంగాబాదునం దున్నపుడు తారాబాయి అయిదాఱువేలమంది మహారాష్ట్రులు రామూసీల సహాయముతో వాయీ సతారాప్రాంతముల నాక్రమించెను. అంత నొక గొప్పసైన్యము, సతారాను ముట్టడించి, యామె ననశనురాలుగఁ జేసి లోఁబఱచుకొనుటకు పంపఁబడెను. కోట హవల్దారగు ఆనందరావు జాధవుఁడు కోట రక్షించుట అవివేకముని యెంచి రాజా నామె యాధీనమునుండి తప్పించుటకు ప్రయత్నించెను. ఆ సంగతి యామెకు దెలిసినతక్షణ మతని శిరచ్ఛేదమున కాజ్ఞయిచ్చెను. కోట కావలి సైన్యము తమ నాయకునే యట్లు ఘోరముగ నంతము చేసిరి. వెనుకటి హవల్దారుతో సంబంధములేని బాబూరావు జాధవుఁడను మఱియొకఁడు కోట హవల్దారుగ నియమింపఁబడెను. ఇతఁడు సింధఖేడు జాధవుల సంబంధిపుఁడు. పీష్వా, కర్ణాటకమునకు పోవుచు, తనకు లోఁబడినయెడల రాజాయొక్క అంగరక్షణమును, అతని సేవకానిచయముయొక్క యధికారమును ఆమె యాధీనమునం దుంచెదనని, తారాబాయికి వర్తమానమంపెను. కాని బాలాజీరావు సతారాకువచ్చి, తన యధికారము నంగీకరించి, ఏతద్విషయమై యున్న శంకలన్నియు స్వయముగ వచ్చి నిర్వర్తింపకున్న నామె యా ప్రస్తావనలకు చెవియొగ్గకుండెను.

ధనార్జన విషయములో నీ కర్ణాటక దండయాత్ర పీష్వాకు మిక్కిలి లాభకారి యైనది. ప్రతి గ్రామమును కవిన్యా నిచ్చినయెడల వదలి పెట్టఁబడె-
1754 డిది. లేక తద్గ్రామాధకారులు తిరుగఁబాటు చేసినయెడల బాధింపఁబ-
డెడివారు. రొక్కముకంటె సామాన్యముగ పెద్దవర్తకులమీఁద హుండీలను పుచ్చుకొనుచుండెడివారు. ఈ యాత్రలకు ముల్కగిరియని పేరు. కుంతీబిన్నోరు లగ్గలకెక్కి పట్టుకొనఁబడినది. శ్రీరంగపట్టణము దోఁచుకొనఁబడకుండ పీష్వాకు కొంత ధన మియ్యఁబడెను. అంతటినుండి కప్పము క్రమముగ పంపఁబడునని వాగ్దానములు కూడ చేయఁబడెను. బాలాజీరావు తన వీన

తండ్రికుమారుఁడగు చిమ్మాజీభాపుతో జ్యూను నెలలో పూనాకు తిరిగివచ్చెను. తమ్ముఁడగు రఘునాథరావు,వర్షఋతువు సమాప్తమయినతోడనే, దత్తాజీ సింధియాతోడను సుఖరాముబాపూతోడను గుజరాతు దండయాత్రమీఁద నరిగెను.

ఆగుజరాతుదేశమున, వెనుక అభిసింగువిడిచిపోయినతరువాత మోమినుఖానుతో దమ్మాజీ గాయక్వాడు సమానభాగమునకు రాజ్యమేలుచుండెను 1743వ సం॥ము వఱకు నిరాటంకముగ నతఁడు గుజరాతున చౌతును వసూలు చేయుచుండెను. అటుతరువాత దమ్మాజీ 1744వ సం॥ములో సతారాకు వచ్చినపుడు, అతని తమ్ముఁడగు ఖండేరావుగాయక్వాడు, మహారాష్ట్ర యుక్యమునకు వ్యతిరేకముగ,కొన్ని కార్యములఁజేసెను. దమ్మాజీ,తిరిగివచ్చినతోడనే, తనతమ్మునకు బూర్సతుకోటనిచ్చి బరోడాకు తన ప్రతినిధిగా నతని నియమించి సంతుష్టిపఱచెను. దమ్మాజీ తన వివేకవ్యవహారములవలన కుటుంబములోని యెల్లరను సముచితవిధంబుననుంచి గృహకల్లోలము నణచివేయుచుండెను. రాజ్యమేలుటకంటె నిది నిజముగ నెక్కువకష్టమనుటకు సందేహములేదు. దమ్మాజీ గాయక్వాడు భరూచియందు రివిన్యూ * కస్టమ్సు (Customs కరోడ్గిరివసూలు)లో నెప్పుడు భాగమును సంపాదించెనో తెలియదు. కాని 1747వ సం॥లో దమ్మాజీకుమారుఁడగు కేదారజీ సూరతుయొక్క యధికారమునకై తగవులాడుచున్న అనేకపక్షములవారి పోరునందు జోక్యము కలుగఁజేసుకొనుటకు పిలువఁబడెను. ఆ తగవులాట,అతఁడుపోయి తీర్చకముందే,సమాప్తమైనను సూరతురివిన్యూలో మూఁడవవంతు అతఁడుపుచ్చుకొనునటుల దేశమును కొల్లఁబెట్ట నారంభించెను. అటుతరువాత దమ్మాజీ పూనాయందు కారాగారబద్ధుఁడై యున్నపుడు చాలయల్లరులు సూరతునందు జరిగెను. దమ్మాజీ తనస్వేచ్ఛను పొందుట కాతురపడుట కిది యొక ప్రబలకారణము. పీష్వాయు గుజరాతునందంతటను సరియైన యేర్పాటులు చేయవలెనని యుద్దేశించెను. దమ్మాజీ తన విడుదలకొఱకు చేయుచున్న సమాధానవిషయము లాలోచించుటకుఁ బూర్వము బలమైన జా

* కస్టమ్సు అనగా సరుకులమీఁద నెగుమతి దిగుమతులపై వసూలుచేయఁబడు పన్ను (సుంకము).

మానులమీఁద నతని నిర్బంధించియుంచెను. అప్పటి కతఁడు బాకీయున్న రివిన్యూ మొత్తమంతయు 15 లక్షలుగా స్థిరపఱుపఁబడెను. పూనా గవర్న్మెంటువా రింత స్వల్పమొత్తమునకు సంతుష్టిపడుటకు కారణము, దమ్మాజీరామచంద్రబాబాశాస్త్రికిని అతని యజమానుఁడగు సదాశివభావూకును ఒకలక్షరూపాయిలు లంచమిచ్చుటయైయున్నది. అంతియకాక అప్పటికి గాయక్వాడ్ వంశీయులచే గుజరాతునందు కలిగియున్న దేశమునందును, మఱి ముందు జయింపఁబడు దేశమునందును, సగభాగమునకు పీష్వాయతనిరొద్దపత్రమును వ్రాయించి పుచ్చుకొనెను. దమ్మాజీ యందుకు సమ్మతించి యిఁక ముందు యేవిధముగ నతనికి వచ్చు ధనమునందైనను ఖర్చులుపోను తక్కినసొమ్మునకు తగినలెక్కఁ గనుపఱుచుట కొప్పుకొనెను. దమ్మాజీ, 10,000 గుఱ్ఱపు దళమును సిద్ధపఱచి, పీష్వా కవసరమైనపుడు సాహాయ్యము చేయుటకును; సేనాపతియగు దాభరేకు ముతలికుగా గుజరాతు దేశమునకు తనవంతునకుఁగాను రు 5,25,000లు కప్పముగ నిచ్చుటకును; రాజారొుక్క స్వంతఖర్చుక్రింద కొంతసొమ్మును ప్రతిసంవత్సర మిచ్చుటకును; ఈసమాధానముప్రకారము పీష్వా కిచ్చివేయఁబడిన జిల్లాలయందు పీష్వారొుక్క కావలిసైన్యమును స్థాపించుటకు సాయ మొసఁగుటకును; గుజరాతు ద్వీపకల్పమునం దంతటను తమ తమ యధికారములను ప్రతిష్ఠాపించుటకు తాను కూడ తోడ్పడుటకును; సమ్మతించెను. ఈషరతులన్నియు నెఱవేర్చుటకు తగిన సమయ మొదవువఱకును, దమ్మాజీ, యటుతరువాత మునుపటంతదిట్టముగ నిర్బంధింపఁబడకపోయినను, బాలాజీరొుక్క నమ్మకమగు సిబ్బందిచే జాగ్రత్తగ కాచియుంచఁబడుచు వచ్చెను.

ఇండియారొుక్క పశ్చిమభాగమున నప్పటి కింకను గొప్పవర్తకస్థానముగ నెంచఁబడుచువచ్చిన సూరతును, పీష్వా, తనస్వంతమునకు సంపాదింపవలెనని, బాలకోరికతో నుండెను. దమ్మాజీతో నీపై చెప్పఁబడి సమాధానము జరుగుచున్నపుడే నాపట్టణముపై కన్నువేసియుండిన యింగ్లీషువారితో తద్విషయమున పీష్వా రాయభారములు చేయుచుండెను.

1751-వ సం॥మున దానిని వశము చేసికొనుటకే రఘునాధరావు గుజరాతునకు పంపింపఁబడెను. కాని యతని యుద్దేశము సఫలము కాక పూర్వమే రఘునాధరావు తిరిగి దక్కనునకు పిలిపింపఁబడి నటుల నీ వఱకు చూచియున్నాము. మనప్రస్తుత చరిత్ర సమయమునకుఁ దీసికొనివచ్చు నతని రెండవ దండయాత్ర దమ్మాజీతోఁ జేయఁబడిన యేర్పాటుల నన్నిటిని పూర్తిచేయుటకు నిర్వహింపఁబడెను. రఘునాధరావు యొక్క ప్రయాణమునకుఁ బూర్వము కొద్దికాలము క్రిందటనే దమ్మాజీ గాయక్వాడు విముదల చేయఁబడినటుల కనుపడుచున్నది. ఏలనన, నతఁడు తన సైన్యముతోఁగూడ, రఘునాధరావు కప్పములను వసూలుచేయుచు దేశమును జయించుచు గుజరాతునందు ప్రవేశించు నప్పటికి, వచ్చి తోడ్పడెను. వారికి అహమ్మదాబాదు నందు చేరు వఱకు నెదురేమియునులేక నిచటమాత్రము జవాన్మర్దుఖానుతో చాల పెనుగులాట జరిగెను. గుజరాతునకు రాజధానియగు అహమ్మదాబాదు 1755-వ సం॥మున మహారాష్ట్రులకు వశమాయెను. అచటి రివిన్యూను, పీష్వాయును గాయక్వాడును చెరిసగముగ పంచుకొనిరి. బరోడాయందు గాయక్వాడునొద్ద సెలవుఁగైకొని రఘునాధరావు దత్తాజీ సింధియాతోఁగూడ నచటనుండి హిందుస్థానమునకు ప్రయాణమైపోయెను.

మల్హారరావున కేకపుత్రుఁడైన ఖండీరావు హిందుస్థానమున రఘునాధరావును గలిసికొనెను. వారు అజ్మీరును జయించి చక్రవర్తి దేశమునందంతటను ఛౌతుసర్దేశముఖీలు వసూలు చేసిరి. రాజపుత్ర సంస్థానము లన్నియును కప్పము లిచ్చుటకు బలవంత పెట్టఁబడెను. జాటులుఁగూడ యందు కంగీకరించినను తగ్గణమిచ్చుక యెదిరించి, వారిని కొంబీరుకోట ముట్టడియందు విదిలించి కొట్టిరి. అందుఖండేరావు హతుఁడయ్యెను. రఘునాధరావు 1756 సం॥ము వఱకును తిరిగిదక్కనునకు రాలేదు. ఇట్లు మహారాష్ట్రు లాయుధము లమోఘతేజంబున నుత్తరమున ప్రకాశించుచుండ, పూనానుండి కర్ణాటకమునకు మఱియొక దండయాత్ర యేగి బెదనూరునుండి కప్పములం గొనెను. పీష్వా, సైన్యములతోఁ గూడ కృష్ణాతీరమున ఏకూరు వఱకు నేగి యచట మహాదాజీపంతు పురంధ

లేను సేనాపతిగఁ జేసి గోదావరి జన్మస్థానమగు నాసికకు పుష్కర యుత్సవము నవలోకింపవచ్చెను.

బాలాజీ బాజీరావు సహజముగ సోమరిస్వభావము కలవాఁడు. అతఁడు వ్యవహారముల కొఱకు ఏజంట్లపై భారమునుంచి యుండుటవలన మాంద్యమున కలవాటు పడినవాఁ డాయెను. సైనికావ్యవహారము లన్నియు చాలవఱకు రఘునాథరావున కప్పగింత పెట్టఁబడెను. సివిలు వ్యవహారములు చిమ్నాజీ భాపునకు వదలివేయఁబడెను. గ్రామపంచాయితీల పరిపాలనవలన దేశ మరాజకము పాలుగాక యుండెను. దేశమునందు కొంత రక్షణయు కలిగెను. ఈవ్యవస్థకు కారకుఁడు రామచంద్ర బాబాశన్వీ యని చెప్పుదురు. అతని మరణానంతరము సదాశివరావును నతని యుపదేశముల ననుసరించి యభివృద్ధిఁగల్పించెను.

దక్కనులో తూర్పుభాగమున వృత్తాంత విశేషములలో ముఖ్యమైన దెద్దియన, సాలబజ్జంగుతో యుద్ధమైన తరువాత, మార్చి 1753 లో రఘూజీ భాంస్లే పరలోకగతుఁ డయ్యెను. అతఁడు తన బేరారు రాజ్యమును తన కుమారులగు - జానోజీ, సాబాజీ, మూడాజీ, బింబాజీ యను నలుగురకును పంచియిచ్చెను. ఇందు పెద్ద వాండ్రిద్దఱును చిన్నభార్య పుత్రులు. చిన్నవాండ్రిద్దఱును పెద్దభార్య పుత్రులు. వీరిద్దఱు స్వర్గస్థురాలైన సతారా రాణియగు సక్వారుబాయి సిర్కేయొక్క మేనల్లుండ్రు. అయినను రఘూజీ పెత్తనమంతయు జానోజీకిచ్చి, పీష్వాచే సేనాసాహేబు సుభేగానియమింపఁబడునను నిశ్చయములో నుండియుండెను. రఘూజీ తన మృత్యుతల్పము నుండి మహారాష్ట్ర సామ్రాజ్యము నెడల, తమలో పరస్పరము నైకమత్యము మేలని బోధించి, యుసురులు విడిచెను. కాని యెట్టి మంచి నీతియైనను చెవి కెక్కదను సంగతి సామాన్య యనుభవమే కదా! తండ్రి చనిపోయిన నొక్కమాసము లోపలనే జానోజీ తన తమ్ముఁడగు మూడాజీని యుద్ధమున నోడించి లోఁబఱచుకొనెను. ఈ వ్యాపారములవలని కాలహరణముచే నతఁడు పీష్వా కర్ణాటకమునుండి తిరిగి వచ్చువఱకును యుద్యోగహోదాలను స్వీకరింప లేకపోయెను.

జానోజీ పూనా వచ్చుచున్నాఁడను ధైర్యముచేతను, పీష్వా రక్షణముఁ గూర్చి చేయుచున్న బాసల చేతను, తారాబాయి సతారా కావలిసైన్యమును వదలి, రాజాను బాబూరావు జాధవుయొక్క కాపలాక్రిందనుంచి, జానోజీయొక్క కనిష్ఠ సోదరుఁడును, మొహితే వంశమునందు తన బంధువును వివాహము చేసికొని తన పక్షమునకుఁ జేరినవాఁడునగు బింబాజీ భోంస్లేను వెంటతీసికొని, పీష్వాయొక్క రాజధానికి పయనమై వచ్చెను. పూనాయందు తారాబాయి విశేష సన్మానముల నందినదై, పీష్వా జజూరీ దేవాలయమునకు వచ్చి ప్రమాణము చేసినయెడల, నతఁడు పూర్వము చేసిన ప్రస్తావన లన్నిటికిని ఒప్పుకొనెదనని చెప్పెను. పీష్వాయు, బాబూరావు జాధవుని యుద్యోగము నుండి తొలగించిన యెడల నందున కియ్యకొనెద ననెను. తారాబాయి యందుకు చాల యయిష్టము మీఁద నొప్పుకొనెను. తారాబాయి యొక్క పట్టుదల వలన పీష్వాయు పైకి రాజాను విడుదల చేయుమని చెప్పుచు నంతరంగమున తన యభీష్టముప్రకారమే జరిగించు కొనినవాఁ డాయెను.

రామరాజు సామాన్య సామర్థ్యముకూడ లేనివాఁడు. అతఁడు పడినకఠిన కారాగృహవాస మతని మనోధైర్యమును దేహారోగ్యమునుకూడ చెఱచివేసెను.

జానోజీ భోంస్లే, తన తండ్రి యొప్పుకొనిన ప్రకారము రాష్ట్రమున కవసరమైనపుడు 10,000 గుఱ్ఱపు దళమును సిద్ధపఱచుటకును, సంవత్సరమునకు రాజ్యపు ఖర్చులకు 9 లక్షల రూపాయి లిచ్చుటకు నంగీకరించి, విధ్యుక్తముగ సేనా సాహేబు సుభేహోదాను ధరించఁజేయఁబడెను. అతఁ డంత తనచిన్న తమ్ముని వెంటతీసికొని బేరారునకు పోయెను. ఈ బింబాజీయొక్క పూర్వపు సిర్కే సంబంధమును, ప్రస్తుత మొహితే సంబంధమును జూచి పూనా దర్బారునందు సహోత్కారమగు నీర్ష్యాభయంబు ఉదయించెను.

జానోజీ తూర్పునకు ప్రయాణమై పోవుచు, మహారాష్ట్ర దేశమునందే కాక, మొగలు దేశమునందు కూడ ఘాస్దాణాను వసూలుచేయ నారంభించెను. ఇందు వలన సాలబజ్జంగున కసహ్యత కలిగెను. అందు కలిగి యతఁడు నిజాము దేశమును కొల్లఁబెట్టసాగెను. కాని మొగ లుద్యోగస్థుఁ డతనిఁదాకి యతి

ని దివానును ఖైదీగఁ గొనెను. ఇందువలన నతఁడు కొల్లఁబెట్టినధనములో చాల భాగమును తిరిగి యియ్యవలసినవాఁడాయెను.

ఈ భంగపాటు వలనను, యవమానము వలనను, అతఁడు రోషానలదందహ్యమానుఁడై యున్నపుడే, బహుశః శ్రీకాకుళము రాజమహేంద్ర సర్కారుల సుభేదారీ నుండి తొలఁగింపఁబడిన జాఫరల్లీఖానుచే నాహూయమానుండై, యాసర్కారుల లోనికి దండెత్తి వచ్చెను. దక్షిణకవాట యువరాజని బిరుదమును పొంది సాలూరు దగ్గఱ పాచిపెంట జమీందారుగ నున్న వీరప్పరాజు, విజయనగర రాజుచే జమీంధారీనుండి తప్పింపఁబడి యుండుటవలన, ద్వేషము కలవాఁడై మహారాష్ట్రులకు పాచిపెంట ఘాటీమార్గమును జూపించి యుండెను. ఉత్తర సర్కారు లప్పుడే మహారాష్ట్రుల పాదదళితమైనవి. భీముని పట్టణములోని డచ్చివారి ఫ్యాక్టొరీ కొల్లఁబెట్టఁబడినది. విశాఖపట్టణములోని యింగ్లీషువారు జాఫరల్లీతో సఖ్యముగా నుండి ముందతని మహారాష్ట్రులను పిలుచుటకు రేపెట్టినవారగుటవలన, వారి ఫ్యాక్టొరీ వదలి వేయఁబడినది. వారు విజయరామరాజు నోడించి, అనకాపల్లి దగ్గఱ తుమ్మపాలెమునొద్ద నారాజుతోడను మా. మొరాసిన్ అను పరాసు నాయకునితోడను స్వల్ప కలహమును చేసి, గోదావరి నదిని లోతులేని రేవున దాటి చాల కొల్లధనముతో తమస్వదేశమును చేరిరి.

ఢిల్లీయందు వ్యవహారములు, దర్బారు నందలి వైషమ్యములచే, మహారాష్ట్రుల జోక్యము లేకుండ యుండుటలేదు. గాజీయుద్దీను కుమారుఁడగు షిహాబుద్దీను, వజీరగుసఫ్దరుజంగునుండి తన కపటనటనవలన, తన తండ్రియొక్క గాజీ యుద్దీను బిరుదును అమీరుల్‌ఉమ్రావు ఉద్యోగమును పొంది, యది సఫలమైన తరువాత, తన మేనత్త భర్త ఇంతిజాముద్దౌలాకు వజీరు పదవి వచ్చునట్లు ప్రయత్నము చేసి, యంతరంగ కలహమును కల్పించెను. ఈ కలహము ఆరునెలలు ఢిల్లీలోపలను, చుట్టుప్రక్కలను జరిగెను. సఫ్దరుజంగు, ఆ కాలమైన తరువాత, కలహమును మాని లక్నోపట్టణమున తన రాజ్యమునకు పోయెను.

ఈ కలవర సమయములో మీరుషాబుద్దీను మల్హారిరావు హోల్కారును జయపాసింధియాను సాహాయ్యమునకుఁ బిలిచెను. వారు వచ్చునప్పటికి, సఫ్దరుజంగు వెడలి పోయియుండుటవలన, మీరుషాబుద్దీను వారిని జాటురాజగు శూరజమల్లుని, వెనుకటి వజీరునకు సాహాయ్యము చేసినందుకు, శిక్షింపఁ బ్రయోగించెను. జాటురాజా తనకోటలలోనికి శరణ్యముఁ గైకొనెను. షాబుద్దీను తన దురుద్యమమును విడువక చక్రవర్తిని ఫిరంగు లిమ్మనికోరెను. ఇంతిజాముద్దౌలా కూడ తన బంధువు యొక్క యవినీతి స్వభావమును తెలిసినవాఁడై తనకుపకారములు బుద్ధిచాపల్యంబునఁ జేసినను, చక్రవర్తిని ఫిరంగుల నియ్యవలదని, నిరుత్సాహపఱచెను. మీరుషాబుద్దీను డిల్లీకొకయేజెంటు నిందుకొఱకు పంపించెను. అతఁడును చక్రవర్తి ఫిరంగు లిచ్చుట కంగీకరింపనందున రాజధానిచుట్టు ప్రక్కల కొల్లఁబెట్ట నారంభించెను. చక్రవర్తి శూరజమల్లునకు సాహాయ్యము చేయనెంచి, పట్టణము విడిచి మీరుషాబుద్దీనుపైనను మహారాష్ట్రులపైనను యుద్ధమునకు బయలుదేరెను. మల్హారిరావు హోల్కారు, జయపాను షాబుద్దీనును కుట్రవాండ్రఁగఁ దలంచి, వారియాలోచన పుచ్చుకొనకయే స్వయముగఁ బ్రయాణమై చక్రవర్తి సైన్యములన్నియు నజాగ్రత్తగ నున్నపుడు వారిపైఁబడి నిముషములో వానినెల్ల చెదరకొట్టి వారిసామగ్రినంతయును కొల్లఁబెట్టెను. మీరుషాబుద్దీను, ఈజయము వినిన తోడనే, డిల్లీలో హోల్కారును కలిసికొని, చక్రవర్తినుండి వజీరుపనిని తానే పుచ్చుకొనెను. అటుతరువాత నతఁడు చక్రవర్తిని సింహాసన భ్రష్టునిచేసి, జహాందరుషా మనుమఁడైన నొకని ఆలంగీరు II అను బిరుదుతో సింహాసనాసీనుం జేసెను. 1754 సం॥ మేనెలలో దురదృష్టవంతుఁడగు అహమ్మదుషా కారాగారబద్ధుఁడు కాఁబడి నేత్రవిహీనుఁడుగఁ జేయఁబడెను. ఈవిప్లవమైన వెంటనే వజీరు సఫ్దరుజంగు పరలోకగతుఁ డయ్యెను. అతనికుమారుఁడగు షూజా ఉద్దౌలాతండ్రి రాజ్యమున కధిపతియయ్యెను. హిందూస్థానమందు, అరాజకము, ప్రజాపీడ, దోఁపిడి యెక్కువయి యుండెను. ఇక దక్కనునందు మహారాష్ట్రుల చరిత్ర మెట్లుండెనో విచారింతము.

మహారాష్ట్ర రాజధానియందు సివిలు పరిపాలన సదాశివరావు చిమ్నాజీ
చేతులలోనే జరుగుచుండెను. పీష్వా పూనాయందు నొకసంవత్సరమువఱకు స్థిర
ముగ నుండెను. ఆకాలములో కొంకణమునందు ఇంగ్లీషువారి సాయ
1755 ముతో తులాజీ ఆంగ్రియాను సాధించుటకు పీష్వా ప్రయత్నము చేసె
ను. కొంతకాలమునుండి మహారాష్ట్రులును ఇంగ్లీషువారును కలిసి సూరతునందు
స్థిరమైన యేర్పాటులు చేయుటకును, కొంకణమందు తులాజీ ఆంగ్రియా
నావికాదండయాత్రల నణచుటకును ఆలోచనలు చేయుచుండిరి. సూరతునం
దు మొగలు పరిపాలన నీరసమువలన, దమ్మాజీ గాయక్వాడుయొక్క యేజం
ట్లును, ఇంగ్లీషుఫాక్టొరీయును గాక మఱి నలుగు రైదుగు అధికారులు బయలు
దేరిరి. జంజీరాసిద్దీయొక్క యుద్యోగస్థుఁడైన సిద్దీమసావుదు అనువతఁడు, సూ
రతువర్తక రక్షణకొఱకను పేరుమీఁద, సిద్దీనావసైన్యమును కొంత కలవాఁడై
యనేకతగాయిదాలకు కారకుఁడగుచుండెను. ఇంగ్లీషువారును తమనావలలోనికి
గోమాంసము కావలసినవారై యాతీరమున నంతటను గోవృషభంబులు పావన
మైనవిగ నెంచఁబడుటఁబట్టి యొక్క సిద్దీలద్వీపమే యాపదార్థమున కాధార
మగుటచేత, సిద్దీలతో సఖ్యముగ నుండవలసినవారైరి. కావున వారు సిద్దీమసావు
దును సాధింపవలసినవారైరి. మఱియెచ్చోటనుండియైన గోమాంసమువచ్చుటకు
వారు తగినయాధారమును చూచుకొనవలసియుండిరి. వీరియొక్క దృష్టి యిటు
లనుండెను. ఇఁక శంభాజీ ఆంగ్రియా చనిపోయినప్పటికిని, మన్నాజీ పీష్వా
కు విధేయుఁడైయున్నను, తులాజీ ఆంగ్రియా తనదాసీ సోదరుఁడైన శంభాజీ
యొక్క దేశమగు బంకూటు సావంతువాడీ మధ్యభాగము నాక్రమించి పీష్వా
యొక్క యధికారమును ధిక్కరించి, తనయాజ్ఞాపత్రము లేనియెడల నెల్లకొల్ల
బెట్టనారంభించెను. కొల్లాపురరాజును, వాడీ సావంతులు నదియే పద్ధతి నవలం
బించిరి. వీరందఱనుకూడ, నింగ్లీషువారు, కొల్లాపురపురాజుయొక్క కోటనుబట్టి,
మాల్వానులని సామాన్యముగ పిలుచుచుండెడివారు. పీష్వా వీరిని లోఁబఱచు
కొనవలెనని యాలోచించుచుండెను. కావున ఇంగ్లీషువారును మహారాష్ట్రులును

పైఁజెప్పిన రెండు కార్యములందును పరస్పర సాహాయ్యము చేసికొనవలెనని రాయభారములు చేసికొనిరి.

1751 వ సం॥ ములో సూరతునందు వ్యవహారములు సవరణ చేయుటకు రఘునాధరావు పంపఁబడెను. కాని యతఁడు సాలబజ్జంగుతో యుద్ధముకొఱకు వెంటనే వెనుకకు పిలిపింపఁబడెను. ఆంగ్లేయులు తమ యేర్పాటులన్నియు భగ్నమైనవని చింతించి తాము స్వయముగ నాకార్యమును జేసికొనఁ బ్రయత్నించిరి గాని, యది కొనసాగలేదు. 1755 వ సంవత్సరము వఱకును, గుజరాతు ఆక్రమణవలనను, అహమ్మదాబాదు ముట్టడివలనను, కర్ణాటక దండయాత్ర వలనను పైకార్యములకు వీలు కలుగలేదు. 1755 వ సం॥ము యొక్క ఆరంభమున తులాజీ ఆంగ్రియాను సాధించుటకు పీష్వాకు విశ్రాంతికలిగెను. అప్పు డింగ్లీషువారు పిలువఁబడగా మొదట కొంచెము బెట్టుచేసి లాభమగు షరతులనుబుచ్చుకొని యుద్ధసన్నాహులైరి. వారియొక్క నావసైన్య మొక 44 ఫిరంగులయోడ, ఒక 16 ఫిరంగుల చిన్నయోడ, 2 బాంబునావలునై యుండెను. షరతులలో ముఖ్యమైనవి, ఆంగ్రియాయొక్క యోడలను చెరిసగము పంచుకొనుట, బంకూటు ద్వీపము, హిమ్మతుగిరికోటతోడను, మఱి యైదూళ్లును ఇంగ్లీషువారి కిచ్చివేయుటయునై యుండెను.

తులాజీ ఆంగ్రియాయొక్క కోటలలో దృఢమైనవి సువర్ణదుర్గ, విజయదుర్గ(గిరియా). పీష్వాయొక్క మహమ్మదీయ సోదరుఁడైన షంషీరుబహద్దరు భూమిమీఁదనుండి యుద్ధముచేసెను. బంకూటు సువర్ణదుర్గమాత్రము పట్టుపడినవి. కాని మృగశిర ప్రవేశము ముందు పక్షము దినములకే దక్షిణమారుతము వీచుట ప్రారంభమగుటవలన నచట నింక నావయుద్ధముచేయుటకు కాలాతీతంబైనందున నప్పటి కాహవక్రియ లాపివేయవలసివచ్చెను. సువర్ణదుర్గమహారాష్ట్రుల కిచ్చివేయఁబడెను. బంకూటు ఇంగ్లీషువారి కిచ్చివేయఁబడెను. ఇంగ్లీషువారు దీనినికోరినకారణము తాము గోమాంసమునకు సిద్దియే వారికాధారమైయుండకుండుటకని చెప్పఁబడెను. ఇంగ్లీషుకంపెనీవారి ప్రెసిడెంటగు బోర్షియరు షరల వర్షకాల మంతమైనతరువాత అడ్మిరల్ వాట్సనుక్రింద తమకు యోడలు-

రానున్నవనియు నలివచ్చినతరువాత సాహాయ్యము చేసెదననియుఁ జెప్పెను. ఆ గడువు లోపలనే లెఫ్టినెంటు కల్నలు క్లైవు క్రింద యూరపునుండి యొకసోల్జరు పటాలమువచ్చెను. దక్కనులో పరాసు సంస్థాపనలను జూచి యింగ్లండులో నీర్ష్యాభయంబు లుదయించెను. మహారాష్ట్రులతో సఖ్యంబు చేసి యసాహాయ్యమున దక్కనునుండియు, సాలబజ్జంగు సేననుండియు వారిని తఱిమివేయ వలయునను నుద్దేశ మందువలన కలిగెను. బొంబాయి ప్రెసిడెన్సీకంపెనీ కౌన్సిలువారు తులాజీ ఆంగ్రియాను సాధించుటకే సైన్యము నుపయోగింపవలెనని యాలోచించిరి. 1756 ఫిబ్రవరి నెలలో 14 యోడలుతోడను, 800 యూరోపియను సోల్జరుల తోడను 1000 స్వదేశి కాల్బలముతోడను, యాదండయాత్ర చేయఁబడెను.

గతనవంబరునుండియు పీష్వా సైన్యములు ఖండోజీ మంకూరు క్రింద యుద్ధము సలుపుచు నొక్కగిరియా తప్ప తక్కిన తులాజీ ఆంగ్రియాకోట లన్ని
1756 టిని పట్టుకొని యుండెను. గిరియాకు కొంతదూరమున ఇంగ్లీషు నావ సైన్యమును చూడగనే తులాజీ మహారాష్ట్రశిబిరమునకు వచ్చి సంధికొఅకు రాయభారములు చేయుచుండెను. రాబర్టుక్లైవు వానికి సమాధానములు కుదురకుండ చేయఁ బ్రయత్నించెను. అడ్మిరల్ వాట్సను, పెకాకు, హోపు, కల్నలుక్లైవు మొదలగు పదిమంది కమిటీ మెంబరులు బొంబాయి హార్బరు విడుచుటకు పూర్వమే, తమ మిత్రులగు మహారాష్ట్రులకు సంబంధము లేకుండగనే, గిరియాయందు దొరకిన ధనమంతయు పంచుకొనవలెనని యాలోచించుకొనిరి. అందువలనను సంధికుదరనీయక వాట్సను సముద్రముమీఁద నుండియు, క్లైవు భూమిమీద నుండియు ముట్టడివేసిరి. పీష్వాసేనాపతులకు కోటకావలి సైన్యముతో రాయభారములు కలియకుండునటుల క్లైవును వాట్సనును మధ్య యడ్డపైరి. పీష్వాసేనాధిపతియగు రామాజీపంతు సంధిజరుగనున్నదని చెప్పుచున్నను వారు వినక ముట్టడిగావించిరి. రామాజీపంతు రాయభారములు రహస్యముగ జరుగనిచ్చుటకుఁగాను కేప్టన్ అంద్రూబుఖానన్‌కు లంచమును 80,000 వరహాల నాశపెట్టెను. అతఁడెందుచేతనో యందు కియ్యకొనలేదు. ఆకాలములో వంత

మాత్రము నష్టము బహు అయెను గనుక నతనికి గవర్న్మెంటువారు బంగారు పతకమును బహుమానము చేసిరి.

గిరియా, ఫిబ్రేవరి 13 వ తారీఖున వాట్సనునకు వశమాయెను. ఆంగ్రియాయొక్క నావలన్నియు ప్రమాదమున నగ్ని దగ్ధమాయెను. వెనుకఁ జెప్పినట్టుల నే కమిటీ మెంబరు లంచమును వారనుకొనిన ప్రకారము దొరకిన పదిలక్షల ధనమును తాము పంచుకొని మహారాష్ట్రులకందేమియును భాగము లేదనిరి. తులాజీ పట్టుకొనఁబడి పీష్వాయొక్క పర్వతదుర్గములలో రాయగడవద్దను నొకదానియందు ఖైదుచేయఁబడెను. తనతోడి దేశీయులతో పోరాడి వారియధికారము నంగీకరించక విడిపోయిన తులాజీ, తనకును, తనతోడి దేశీయులకును దేశమునకును ముప్పు దెచ్చిన వాఁడాయెను.

బొంబాయి కౌన్సిలు వారును ప్రెసిడెంటును, గిరియాకోటయొక్క కట్టుదిట్టములు చూచి దానిని వదలిపెట్టఁ జాలరైరి. ఆకోటకు బదులుగ బంకూటు నిచ్చెదమని వారు చెప్పఁజొచ్చిరి. ఇందుకొఱకై వారనేక యక్రమమైన యాక్షేపములను కల్పింప నుద్యుక్తులైరి. మహారాష్ట్రులు సమాధానముయొక్క షరతుల నతిక్రమించిరనియు, బంకూటునకు హద్దులేర్పఱుపలేదనియు, తులాజీ ఆంగ్రియాను పట్టి తమ కిచ్చినారు కారనియు, నింతియకాక డచ్చివారి యొద్దనుండి కొన్ని సామానులను కొనుటకు కంట్రాక్టు చేసినారనియు, బొంబాయి కౌన్సిలు ప్రెసిడెంటు వాదించుచు వచ్చెను. ఇందు చివర యాక్షేపము సాహుకాలములో చేసిన సమాధానమునకు సంబంధించియున్నందున నది ప్రస్తుతమసంగతము. తక్కిన యాక్షేపములు మాట దాటి వేయవలయునని చేసినవి కాని వేఱు కావు. కంపెనీవారి ప్రవర్తన యిందు కడు నసహ్యముగ నుండెనని యింగ్లీషు గ్రంథకర్తలే యొప్పుకొనుచున్నారు. ఇంతియకాక ప్రెసిడెంటు, రామాజీపంతు కార్యమునకు ఎటులైన ఆ మార్పునకు ఒప్పుకొనునట్లు చేయవలయునని 5000 రూపాయలు లంచమిచ్చెద ననెను. ఈ చర్చ యిట్లు జరుగుచుండ, పీష్వా సావనూరునందుండెను. అచ్చట కొంతకాలమునుండి జరుగుచున్న యంశములు కొంత విచారించి మరల నీకథ ననుసరింతము.

బుస్సీ సైన్యములో కొంతకాలము ఉద్యోగముచేసిన ముజఫర్ ఖాను అనువాఁడు 1752 సం॥ ములో పీష్వా పక్షమునకు వచ్చి గత సంవత్సరములో మహాదాజీ పంతు యాధిపత్యము క్రింద కర్ణాటకమున కరిగెను. అచట అతని సైన్యభాగమును మస్తరు వేయుటలో కొంత జోక్యము కలుగఁజేసికొని నందున, మహాదాజీపై నెదురు తిరిగి యతఁడు సైన్యముతో శ్రీరంగపట్టణమునకు పోయి యచటనుండి సావనూరు నబాబును కలిసెను. ఆ నవాబు వానిని పట్టి యిచ్చుట కంగీకరించ నందునను, గుత్తి, సుందూరు ఘోరేపురేలు సాహాయ్యమైనందునను, పీష్వా వారి సందడిని లోఁబఱచుకొనుటకై గొప్పసైన్యమును కూర్చెను. జానోజీ భాంస్లే తన 10,000 సైన్యమును జాగ్రత్తచేసెను. షానువాజాఖాను ద్వారా సాలబజ్జంగు బుస్సీలు కూడ సావనూరు నబాబు తక్షణ మణచి వేయఁబడని యెడల నిజాము మహారాష్ట్ర రాజ్యములు రెంటికిని యపాయమని యొప్పింపఁబడి యిందుకు సాహాయ్యము చేయుట కొడఁబఱుపఁ బడిరి. మురారి రావు ఘోరేపురే సావనూరు నబాబునుండి పీష్వాచే విడదీయఁబడెను. ఫిరంగి దళంబులనుండి యగ్ని వర్షము తీవ్రముగ కొంతసేపు కురిపింపఁబడినతోడనే, సావనూరు నబాబు సమాధానమునకు వచ్చెను. అతఁడు తనరాజ్యములో కొంతభాగ మిచ్చివేసి సాలబజ్జంగునకును, పీష్వాకును:లోఁబడిన తోడనే, సమాధానము కుదిరెను. ముజఫర్ ఖాను తరువాత సాలబజ్జంగు సేవయందు రహస్యముగ నుంచఁబడెను. గుత్తి మురారిరావు, తన సైన్యముతోడను, సుందూరు మహారాష్ట్రులతోడను, మేనెలలో గుత్తికి వచ్చి చేరెను.

సావనూరు స్వాధీనమైన తరువాత పీష్వాయొక్కయు షానువాజాఖాను యొక్కయు ప్రోత్సాహమువలన, సాలబజ్జంగు బుస్సీయొక్క సైన్యభాగ మక్కఱలేదని యుత్తరువు చేసెను. బుస్సీ యప్పుడేమియు చేయఁజాలక మచిలీపట్టణమున కరుగ నాజ్ఞాపత్రము లిమ్మని కోరి పుచ్చుకొని యట్లు చేయక హైదరాబాదునకు పోయియుండెను. అచ్చట రామచంద్ర జాధవునియొక్కయు, జానోజీ నింబాల్కరు (రావురంభా) యొక్కయు సఖ్యము చేసికొని

మచిలిపట్టణమునుండి సహాయ సైన్యమును తెప్పించుకొని యుండెను. అటు పిమ్మట సాలబజ్జంగుతో నతనికి మరల సఖ్యము కుదిరెను. బుస్సీ మునుపటివలె యధికార వశమును సంపాదించిన వాఁడాయెను. ముజఫర్ ఖాను బుస్సీ కోరినటుల పరాసువారి వశము చేయఁబడలేదు. కాని యతఁడచ్చట యుద్యోగము నుండి తొలగింపఁబడి పీష్వా నతి వినయంబుగ క్షమార్పణలు కోరి, ఇఁక ముందు సత్ప్రవర్తనమున నుండెదనని వాగ్దానములు చేసినమీఁదట మరల మహారాష్ట్ర సేవయందు, సదాశివరావు భావు సలహాకు వ్యతిరేకముగ పీష్వాచే నుంచఁబడెను.

పీష్వా జూలై 20 వ తారీఖున పూనా వచ్చిచేరెను. అతఁడు సామముగ, గిరియా తత్క్షణ మిచ్చి వేయవలసినదని బొంబాయి ప్రెసిడెంటుకు వ్రాసెను. అతఁడు పోర్చుగీసువారు పోండాను ముట్టడించి యోడిపోయిరనియు వ్రాసెను. పోర్చుగీసువారి ప్రయత్నమును, సదాశివరావు భావూ ఆలోచించుచున్న గోవా విజయమును మాన్పించుటకు, చేసిరని తరువాత తెలియవచ్చుచున్నది. పోండాయందు పోర్చుగీసు సేనల దుష్ప్రవర్తన వలన వారి వైసరాయి రణ నిహతుఁడయ్యెను. మహారాష్ట్రులు వేఱు కారణముల వలన గోవా నుముట్టడించు ఉద్యమమును మానివేసిరి. ప్రెసిడెంటు, మహారాష్ట్రులు గిరియాకు బదులు బంకూటునుతీసికొనినయెడల శత్రువులగు పోర్చుగీసువారికడ్డముగ వారి కుండఁగలఁడని బెల్లింపుమాటలుచెప్పెను. బాలాజీ యందుకు ప్రత్యుత్తరముగ పోర్చుగీసువారివిలత్తణమే సంపూర్ణముగ తజిమివేయఁదలఁచి కొన్నందువలన నడ్డముగ నుండవలసిన యవసర ముండబోదని చమత్కారముగఁ చెప్పెను.

తరువాత వర్షకాలము సమాప్తము అయినతోడనే, బొంబాయి కౌన్సిలు నుండి జాను స్పెన్సరు, తామసు బైఫీల్డు అను నిద్దఱు సభికులు వచ్చి రఘునాథరావు సదాశివరావు పెద్దలైన వారంద ఱుండగనే వివాదము లన్నిటిని పరిష్కారము చేసికొనిరి. గిరియా మహారాష్ట్రులకిచ్చి వేయఁబడెను. మహారాష్ట్ర దేశములో డచ్చివారి వ్యాపార ముండకుండునట్లును, బంకూటు గ్రామముతో కలిపి పది గ్రామములును, బంకూటునదిపై నధికారమును ఈస్టిండియా కంపెనీ

వారి కిచ్చునట్లును, ఇంగ్లీషు వర్తక సామానులపై దేశము లోపల నే శిస్తును విధింపకుండునట్లును పీష్వా యంగీకరించెను.

పట్వర్ధనుల మంత్రియైనపిమ్మట రఘునాథరావు, శకరాంబాపూతో గలిసి హిందూస్థానమున కేగెను. అచ్చట ముల్హారిరావుచే నతఁడు కలిసి
1756 కొనఁబడెను. పీష్వాయొక్క గొప్పసైన్యమును పోగుచేసి కర్ణాటక దండయాత్రను స్వయముగ నడుప నుద్యుక్తుఁడయ్యెను. కాని య
1757 తఁడు తరువాత సంవత్సరము ఫిబ్రెవరిలోఁ గాని కృష్ణానదిని దాటలేదు.

బాలాజీ బాజీరావు బొంబాయి కౌన్సిలుతో న్యాయభారములు చేయుటకు కారణము గిరియాను సంపాదించుటకే యై యున్నది. ఈస్టిండియా కంపెనీపై తనకు రావలసిన యున్ని హక్కుల నతఁడు వదలు కొనినందున, గిరియాలభించిన తోడనే, క్లైవు, వాట్సను మొదలైనవారు కొల్లధనముగఁ గొనిన మొత్తమున కతఁడింకను తనకు హక్కు ఉన్నటుల నే నటించుచుండెను. ఇందును గూర్చి యతఁడు మద్రాసు గవర్నమెంటు ద్వారా బ్రిటిషురాజున కుత్తరము కూడ వ్రాసెను. ఇంగ్లీషువారికిని ఫ్రెంచివారికిని గడచిన మేనెల యందు యూరపులో యుద్ధము ప్రారంభ మగుటకూడ దీనిని ప్రోత్సాహపెట్టి యుండవచ్చును. అంతియకాక కలకత్తాయందు సురాజ డౌలా వ్యవహారము లింకను ననుమాన స్థితి యందుండెను. ఈరాజనీతి బహుశః కొల్లధనము తిరిగి పుచ్చుకొనుటకు సాధ్యమగునని కాదు కాని, కర్ణాటక పైయన్ ఘాటునందు ఇంగ్లీషువారు జోక్యము కలుగఁజేసి కొన్న మహమ్మదాలీ దేశమునందు చౌతు సర్దేశముఖీలు వసూలు చేయుటకై యుండవచ్చును.

అరువది వేల మంది మహారాష్ట్రులు శ్రీరంగపట్టణము ముందు ప్రత్యక్షమై మైసూరు రాష్ట్రమునుండి కప్పము బాకీక్రింద యపరిమిత ధనము నిమ్మని యడిగిరి. వారు రాజధానికి పోవుమార్గమున కృష్ణానదికి దక్షిణమున నున్న మండలికు లందఱును, ఒక్క కడప నబాబు తప్ప, యుచితవిధిని నమ్రులై వారి యధికారమునకు లోఁబడిరి. మైసూరు రాష్ట్రమునకు మంత్రిగానుండి పరిపాలనాధికారము నాక్రమించుకొనిన నంజిరాజు శ్రీరంగపట్టణమునుండి

కొరినధనము నిచ్చుట కశక్తుఁడనని చెప్పెను. అంత సదాశివరావు యాజ్ఞప్రకారము ముజఫర్ ఖానునిచే 30 ఫిరంగులు పట్టణముపై గురిపెట్టఁబడెను. రాయభారములు కొంతకాలము సాంతమయ్యెను. కాని యొక గుండు రంగస్వామి కోవెల శిఖరమునకు తగిలినందునను, ఒక ఫిరంగి ప్రమాదమున బ్రద్దలై దానిని ప్రయోగించుచున్న యనేక జనులను హతము చేసినందునను, అయ్యవి దుశ్శకునములుగా నెంచఁబడెను. అంత సమాధానము కుదిరి, మహారాష్ట్రులు 32 లక్షలు రూపాయిలు పుచ్చుకొనుట కంగీకరించిరి. అయిదులక్షలు తక్షిణము రొక్కముగను సొకలుగను ఇయ్యఁబడెను. తక్కినసొమ్మునకు కొంతదేశము తాకట్టు పెట్టఁబడెను. పీష్వా తరువాత సేరా జిల్లాను పట్టుకొనెను. అటు తరువాత నతఁడు పూనాకు వచ్చెను. బల్వంతరావు మెండ్లీ, మహారాష్ట్రులకు పాజీకాలమునుండియు హక్కు ఉన్నదని చెప్పి బెంగులూరు, హొస్కోటా, కోలారు జిల్లాలను వశపఱుచుకొనుటకు, కొంత సైన్యముతో కర్ణాటకము నంపుంపఁబడెను. ఇతఁడు కడప నబాబుదైన హొస్కోటానుపట్టుకొని ఆర్కాటు నవాబు దగ్గఱనుండి ఖాతు క్రింద రెండు లక్షల రూపాయిల రొక్కమును, రెండున్నర లక్షలకు భూమిని పుచ్చుకొనెను. మద్రాసు గవర్నమెంటు మెంబరులు అనేక కారణములు చెప్పి దానిని మాన్పించవలెనని ప్రయత్నము చేసిరి గాని కొనసాగలేదు. వారు మహారాష్ట్ర సైన్యములను ఉత్తర సర్కారులలో పరాసు జిల్లాలపై దృష్టి మరలింపఁ జూచిరి గాని, బల్వంతరావు పైఁ జెప్పినరీతి కప్పమును పుచ్చుకొనుటయందు సఫలమనోరథుఁడయ్యెను.

మురారిరావు ఘోరేపురే, తనకు వాగ్దానము చేసిన యొక కోట నియ్యలేదని తనదేశీయుల నుండి తిరిగిపోయెను. అతఁడు విశ్వాసముతో నుండునెడల దానినియ్య వలసినదని బాలాజీరావు బల్వంతరావుకు వ్రాసెను. కాని యతడంతలో తన దేశీయులకు విరోధముగ కడప కర్నూలు సావనూరు నవాబులతో కలసి కత్తికట్టెను. వీరందఱును మద్రాసు ప్రెసిడెన్సీకంపెనీ యధికారులను సహాయము కోరిరి. కాని యింత మంచితరుణమును మద్రాసువారు పోగొట్టుకొనువారు కారు గాని యిప్పుడు వారు తగిన స్థితియందు లేకపోయిరి. పై చా

ప్పిన నవాబులకును, మహారాష్ట్రులకును కడపయొద్ద యుద్ధము జరిగెను. అందు బలవంతరావు జయము నొందెను. ఇంతలో మైసూరు గవర్నమెంటు, అప్పుడే ప్రసిద్ధికి వచ్చుచున్న హైదరాలీ సలహావలన, వెనుక వాగ్దానము చేసిన కప్పము నిచ్చుటకు నిరాకరించి, వారి కిచ్చిన దేశమునుండి వారి ఠాణాలను తరిమి వేసెను. పీష్వా పూనాలో గోపాల హరిక్రింద నొకగొప్ప సైన్యమును కూర్చి, యప్పుడు గోదావరికి సమీపమున 10,000 మహారాష్ట్రులతో పని చేయుచు నున్న తన పెద్దకుమారుఁడైన విశ్వాసరావుచే సాహాయ్యము చేయఁబడి, బలవంతరావుతో కూడుకొని మైసూరుపై దాడిచేయుట కుద్దేశించెను. గోపాల హరియొక్క సైన్యము నవంబరునకుఁ బూర్వము కృష్ణానదిని దాటలేక పోయినందు వలనను, మరల సంవత్సరారంభము వఱకు గాని విశ్వాసరావుతో కలిసి కొనలేక పోయినందు వలనను, పీష్వా బలవంతరావును బెదనూరును లోఁబరచు కొనవలయునని యాజ్ఞాపించెను. అత డిట్లానతిచ్చెను. 'సాధ్యమైనంత త్వరితముగ నచటి కరుగవలెను. కావలి సైన్యము రోగగ్రస్తమై యున్నది. రాణాయును, రాణాకుమారుడును కాలమునొంది యున్నారు. గోపాలహరి రాక పూర్వమే యదియంతయు వశముకాఁ గలదు. అటు పిమ్మట నిద్దరును కలిసి చితలు దుర్గ ముట్టడింప వలెను.'

ఈ యుద్యమ మప్పుడు వీలయిన యెడల, బహుశః అది హైదరాలీ యొక్క యాధిక్యత నడ్డగించెడిదే. కాని బలవంతరావు కడపజిల్లాల యందు పోలిగారుల నుండి కప్పములను వసూలు చేయుటయందు ఫిబ్రవరి వరకు నుండవలసి వచ్చెను. మరియు నా తేదికి పూర్వమే హైదరాబాదునందు జరిగిన వృత్తాంతముల వలన బలవంతరావు సైన్యము ఉత్తరమునకు పోవలసి వచ్చెను. పీష్వాయొక్క శ్రద్ధ కంతకు నాకర్షణ యటుకలిగెను.

సాలబజ్జంగు, షానువాజుఖాను సలహావలన, తన సోదరుఁడగు నిజామలీని బీరారునకు గవర్నరుగను, మఱియొక సోదరుఁడగు బసాలజ్జంగును బీజపూరుగవర్నరుగను, నియమించెను. బుస్సీ తన దివానగు హైదరుజంగుతో కూడ, ఉత్తరసర్కారులలో బొబ్బిలి యుద్ధమును చేసిన దండయాత్రపై యేగివమును

మున, సాలబజ్జంగు రామచంద్ర జాధవుని, యతడు వెనుక బుస్సీకి మచిలీపట్టణము నుండి వచ్చుచున్న సహాయసైన్యము నడ్డగింపకుండ నూరకున్నందుకుఁ గాను, శిక్షించి యతని జాగీరులో చాలభాగమును తీసివేసెను. దౌలతాబాదుకోట ఔరంగజేబు కాలమునుండియు వశములోనున్న వంశమువారగు సాదతు ఖాఖారు నుండి తీసికొనఁబడి షానవాజుఖానుయొక్క యాశ్రితుని కొకని కియ్యఁబడెను. ఇక్కడ నొక నాటకుని యూహ కతీతంబైన విచిత్రంబగు కుట్ర జరిగెను. షానవాజుఖాను భటులకుజీతము లియ్యక వారిలో తన యెడల విద్రోహము పుట్టినట్లు నటన చేయించెను. తానుపోయి దౌలతాబాదుకోటలో దాగికొనెను. ఈ కుట్రయొక్క యుద్దేశము, సాలబజ్జంగు యాపదలోనున్న తన వజీరును చూడవచ్చినయెడల, నతనినచ్చట ఖైదుచేసి రాజ్యమును నిజామాలీకిఁగాని, బసాలజ్జంగునకుగాని యిచ్చుటకైయున్నది. షానవాజుఖానుఁడు మహారాష్ట్రులను సాహాయ్యము కోరెను. నిజామాలీ మఱియొక ప్రక్కనుండి తన సోదరుఁడగు బసాలజ్జంగునకు సాహాయ్యము చేయవచ్చుచుండెను. మహారాష్ట్రులువచ్చి దేశమును కొల్లఁబెట్టఁదొడంగిరి. ఈ సమయమున ఐకమత్య మవసరమని డంబముగ నీతులు చెప్పఁబడెను. షానవాజుఖానుఁడు లోఁబడునట్లు నటించెను. అందఱునుకలిసి మహారాష్ట్రులపై పోరాడనభినయించిరి. నిజామాలీ సైన్యముయొక్కయధికారమునంతయు నాక్రమించుకొనెను. తనసోదరునంతపట్టుకు నమ్మకూడదని సాలబజ్జంగునకతని హితులుకొందఱు చెప్పిరి. సాలబజ్జంగు సోదరునిపైతన యసమ్మతమును కనఁబఱచెను. నిజామాలీమొదట యాగ్రహము నభినయించెను కాని వెంటనే సమయముకాదనియోచించి యన్నగారిని మాయమాటలచే శరణాయత్తచిత్తుం జేసికొనెను. సాలబజ్జంగు మరల నతని ముఖ్యప్రధానుంజేసి తండ్రియొక్క 'నిజాములుముల్కు ఆసిఫుజా' అను బిరుదునిచ్చెను. రామచంద్రజాధవుడు, తన యభినందనములర్పింప వచ్చుచుండగ పీష్వాసైన్యము లతని ముట్టడించి యతని సైన్యములను సిందేఖేదునకు తోలివేసెనని వార్తవినవచ్చెను. నిజామాలీ యందుకొఱకై పంపఁబడి, పీష్వాతో లోపాయికారిగా మాటలాడి 25 లక్షల వచ్చు దేశమునిచ్చు మహారాష్ట్రసైన్యములను తఱిమివేసినట్లు నటించెను. పీష్వా

కూడ సంధిచేసికొనినవాఁడవలె నిజామాలీతో ఔరంగబాదువచ్చెను. ఇంతలో బుస్సీ 200 యూరోపియను అశ్వసైన్యముతోడను 500 యూరోపియను కాల్బలముతోడను, 5000 సిపాయిలుతోడను 10 క్షేత్ర ఫిరంగులతోడను రంగమునకు విచ్చేసెను. ఇతఁడు, సాలబజ్జంగును, పీష్వాను, నిజామాలీని దర్శించిన వాఁడై తన దివానగు హైదరుజంగుతో మాటలాడుమని షానువాజుఖానునకుఁ జెప్పెను. ఇందుకు కారణములుకొంత హైదరుజంగునకు గౌరవమొనర్పవ చేయుటకును, కొంత షానువాజుఖానుయొక్క రహస్యములను గ్రహించుటకు నైయున్నది. షానువాజుఖానుఁడు హేతులెంతచెప్పినను వినక చూచాయగ తమకుట్రను, హైదరుజంగునకు వెలిబరచెను. షానువాజుఖానుఁడు ఖైదుచేయఁబడెను, నిజామాలీయొక్క సైన్యములు 8 లక్షలరూపాయలకు లంచము లియ్యఁబడి హైదరుజంగు పక్షమునకు తిరిగిపోయెను. ఇందులో వెనుక బుస్సీ సైన్యమునుండిపోయి నిజామాలీసైన్యముసఁజేరిన ఇబ్రహీముఖాను గర్దియొకఁడు. జాలతాబాదుకోట నాఖిల్లేదారు,లంచము పుచ్చుకొని హైదరుజంగున కిచ్చివేసెను. పీష్వాయీకోటను తన కియ్యవలసినదని బుస్సీని మనస్సు త్రిప్పప్రయత్నించెనుగాని యాతఁడు దాని నియ్యనొడంబడలేదు. హైదరుజంగుయొక్క యుద్యమము,నిజామాలీ స్వేచ్ఛగ నున్నంతకాలమును పూర్తి కాఁజాలదు. నిజామాలీయొక్క కుట్రతనమును, దుష్ట స్వభావమునుఎప్పటికైన భయంకరములే కావున హైదరుజంగువానిని గోలకొండ కోటయందు బంధింపఁదలంచి యతనిని వినయవినయంబులతో హైదరాబాదు గవర్నరుగ నుండుమని బోధించుచుండెను. నిజామాలీయు నాప్రస్తావనము నత్యంతామోదముతోఁ దిలకించి నటులనటించెను. ప్రయాణమునకై సన్నాహములన్నియు చేయఁబడెను. హైదరుజంగు తాను బయలుదేఱుటకు ముందు నిజామాలీదర్శనము చేయనరిగెను. నిజామాలీ తగిన యతిథి సత్కారములఁజేసి గుడారమునం దతని చంపించెను. ఈ వృత్తాంతము గాలి సోకఁగానే పెద్దగంద్రగోళము జరిగెను. కొందఱు యూరోపియను కావలివారియొక్కయు, సిపాయీలయొక్కయు కావలిక్రింద నున్న షానువాజుఖానుఁడు దీనికి కారకుఁడని యనుమానము గలిగి పఠానుసిపాయిలకు సుభేదారుఁడుగ నున్న లక్ష్మన్న

కోపోద్దీప్తుఁడై షానవాజుఖానుఁడున్న గుడారములోనికిఁ బ్రవేశించి యతనిని, అతని కుమారుఁడగు ఇమెనుద్దౌలాను పొడిచి చంపివేసెను. నిజామాలీ యా రాత్రియే బర్హాంపురమునకు పాఱిపోయెను. ఈ సంక్షోభమంతయు మే 11 వ తారీఖున సాంతమాయెను. పీష్వా పూనాకు తిరిగి వచ్చెను. బుస్సీ, సాలబజ్జంగును నిజామాలీపై యుద్ధమునకు పురికొల్పుట కిష్టుఁడు గాక, హైదరాబాదునకుఁ బోవఁబట్టెను. పరాసుగవర్నరు లాలీ, బుస్సీని తత్క్షణము పుదుచ్చేరి రావలసినదని యాజ్ఞ చేసెను. బుస్సీ తమ పరాసువారి కొనగూర్చిన యాధిక్యము నెల్ల వదలుకొని యింటికి కరుగవలసినవాఁడాయెను. దౌలతాబాదులోని పరాసు కావలి సైన్యమును తీసికొని బుస్సీ పుదుచ్చేరి పోవుటయందలి వివేక మేమో యని దేశీయులగు నెల్ల వారివలెనే మహారాష్ట్రులును విస్మయమగ్నులైరి. బాలాజీరావున కిందుకు సంతోషము కూడ కలిగెను. సాలబజ్జంగు తన బలమునకును, రాజ్యమునకును పరాసువారి మీఁద నింతవర కాధారపడియుండుటవలన నధైర్యపడి యుండెను కాని యతఁడు తిరిగినమ్మనను నమానముచే కొంత వేదన యుడిగినవాఁడాయెను. పరాశ్రయుండైన వానికి ప్రమాద మెప్పటికైన తప్పదు గదా!

బుస్సీ దౌలతాబాదు కోటను పట్టుకొనినపుడు పీష్వా నూరతువైపునకు పోయి యుండునప్పుడు బుస్సీయొద్దనుండి దౌలతాబాదు కోటను పుచ్చుకొనవలెనని త్వరితముగ తిరిగి వచ్చెనని చెప్పి యుంటిమి. అందుకు కారణ మేమో తెలియఁబఱచి యుండలేదు. బొంబాయి ప్రెసిడెన్సీలో కంపెనీవారు సూరతునందు తమ వర్తకమును హక్కులను సుస్థిరముగ నేర్పఱచుట కాసక్తి గలవారై యందుకు సాహాయ్యము కొఱకు పీష్వాను చాల దినములనుండి యడుగుచుండిరి. కాని యా సాహాయ్యము వచ్చుటకు వారాశ వదలుకొని స్వయముగఁ గార్యమును చక్కఁబెట్టుకొనవలెనని ప్రయత్నము చేసిరి. వారు స్వయముగ నా కార్యమును చేసికొనుటను విఘాతము చేయనుద్దేశించి పీష్వా ఔరంగబాదునుండి పశ్చిమమునకు కొంతదూరము సాగిపోయి, అటులఁ జేసిన యెడల బొంబాయి పట్టణము జాగ్రత్తయని బెదరుపెట్టెను. ఆ బెదరింపుతో

సూరతు గవర్నరును కౌన్సిలును తాము సిద్ధముచేసిన భూనావ సైన్యము
నన్నిటి నచ్చటకుఁ బంపుటకు తీర్మానించిరి. అంతటితో నప్పటికి వారి సూర
1759 తుపై యుద్యమ మాగిపోయెను. అయినను వారు తరువాత కొన్ని
నెలలకు సూరతుకోటను స్వాధీనము చేసికొనిరి. వర్షాకాల మంతమైన
తరువాత హైదరాలీ యుపదేశమువలన నంజిరాజు మహారాష్ట్రులను తఱిమి
వేసిన జిల్లాలను, మరల జయించుటకు, మొట్టమొదట గోపాలహరి క్రింద
నొక సైన్యమును మైసూరుపైఁ బంపుటకు పీష్వాయొక్క యుద్దేశమై యున్న
ది. గోపాలహరి సేన, పట్టణము నకాత్తుగ ముట్టడించిపట్టుకొని, మహారాష్ట్ర
ఠాణాలను స్థాపించి, బెంగుళూరును ముట్టడించెను. మహారాష్ట్రులు మొట్ట
మొదట, ముందు ప్రసిద్ధిఁ గాంచనున్న హైదరాలీక్రింద నడుపఁబడిన మైసూరు
సైన్యములచే నెదిరింపఁబడెను. ఈ యుద్ధముయొక్క పర్యవసానమేమన;
మైసూరు రాజ్యమువారు, వెనుక నిర్ణయింపఁబడిన 32 లక్షలరూపాయిలను,
సగము రొక్కము బంగారముగను, తక్కిన సగము సాహుకారులపై హుండీ
లుగను, ఇచ్చిన తరువాత, మహారాష్ట్రులు, తాకట్టుగ నుంచఁబడిన జిల్లాలనుం
డి వెలువడిరి. గోపాలహరి చామలచేరికనుమ (వెంకటరమణగిరి) దగ్గఱకు
వచ్చి ఫ్రెంచివారు మద్రాసులో నింగ్లీషువారిని ముట్టడించి యుండగ వారి
ద్దఱియొద్ద నుండియు కప్పమును పుచ్చుకొనఁ బ్రయత్నించెను. వారందుల
కియ్యకొన నందున పరాసువారిపై పగచే తిరుపతి దేవాలయమును స్వాధీనము
చేసికొని యచట రాఁబోవు యుత్సవమునందు దేవుని కియ్యఁబడఁ బోవు కా
నుకలను వసూలుచేయ నుద్యోగించెను. కాని యతని ప్రధానసైన్యము పూనా
కు పిలువఁబడెను. అందువలన నతఁడు తిరుపతి కొండపై నుంచిపోయిన స్వల్ప
కావలి సైన్యములు ఆర్కాటు నబాబు సైన్యములచే తఱిమివేయఁబడెను.

బుస్సీ పుదుచ్చేరికి వెడలిపోయిన తోడనే, నిజామాలీ ధనము సంపా
దించుకొని సైన్యమును గూర్చుకొనుచుండెను. ఫిరంగిదళములో పనిచేసి
యున్న వెనుకఁ జెప్పఁబడిన యుద్యోగస్థుఁడు ఇబ్రహీముఖానుగర్ది యతని
మరలఁగూడెను. బసాలజంగు తన సోదరునిఁ గొట్టవలసినదని జానోజీభోం

స్నేహము కోరెను. జానోజీభోంస్లే యొకసారి గెలిచినను రెండవసారి యోడిపోయినవాఁడై నిజామాలీతో సంధి చేసికొనెను. పీష్వాయు నతని ప్రోత్సాహము చేసెను. ఇంగ్లీషువారును, పరాసువారికి నిజామాలీ శత్రువైన కారణమున నతనితో సఖ్యము చేసికొనిరి. ఇటుల స్నేహములు చేసికొనినవాఁడై నిజామాలీ సైన్యములతో హైదరాబాదు వచ్చినందున, సాలబజంగు అతనికి దివానుపనిని మరల నియ్యవలసినవాఁ డాయెను. బసాలజ్జంగు తన గవర్నమెంటు యొక్క స్థానమగు ఆదోనికి వెడలెను.

పూనా దర్బారునందు ముఖ్యమైన పరిపాలనా వ్యవహారములు సదాశివరావుయొక్క యాధీనమం దుండెను. అతని సహాయ యుద్యోగస్థుఁడగు రామచంద్ర బాబాశెన్వి నాలుగైదు సంవత్సరములక్రింద పరలోకగతుఁడయ్యెను. అతనికి చాల యాస్తిగలదు. అది యంతయు భావూయొక్క యాధీనములో నుంచఁబడెను. భావూయు నందు మూఁడవ భాగము దానధర్మములకు వేఱుగ నుంచి తక్కిన యాస్తిని స్వర్గస్థుఁడైన వాని కుమారునితో పాటు సమానముగ తానును భాగము పంచుకొనెను. సదాశివరావు తొందఱపాటును ధనాశయు కలవాఁడే కాని ధైర్యసాహసములు పుష్కలముగ గలవాఁడు. అతఁడు ప్రవర్తనమున గర్వమును పట్టుదల గలవాఁడే కాని సత్స్వభావమును సామాన్యవివేకమును లేనివాఁడు కాడు. అతఁడు లంచములు పుచ్చుకొనుచుండెడువాఁడు. సదుద్యమమునందు లంచములు పుచ్చుకొని పనిచేయుట తప్పు కాదని యతనియభిప్రాయము.

అతని స్నేహితుఁడగు రామచంద్ర బాబా, తన మృతశయ్యనుండి, పీష్వాభార్యయగు గోపికాబాయి రాస్తియా వలన నుండి, యామె కుమారులు పెద్దవారయిన తోడనే, యసూయా విరోధములు అతనియెడల కలుగఁగలవని, చెప్పిపోయెను. దీనిని సంభవించకుండ నాపివేయుటకు, సదాశివరావు చిమ్మాజీ, పీష్వాయొక్క పెద్ద కుమారుఁడగు విశ్వాసరావును చిన్నవయసునందే రాచకార్యములయందు ప్రవేశించునట్లు చేసెను. అతఁడు తన పెదతండ్రి కుమారుఁడగు పీష్వాయొక్క కుమారులందఱికిని గొప్ప యుద్యోగముల

ను వహించుటకు కావలసిన శిక్షనొసంగుటకు ప్రయత్నము చేసెను. వాఁడు సాధ్యమైనంత చిన్నవయసులో యుద్ధమునందుగాని వ్యవహారమునందుఁగాని ప్రవేశించుట యర్హమని బోధించుచు వచ్చెను. బాలాజీబాజీరావు తన పితృవ్యపుత్రుఁడగు సదాశివరావు నెడల చూపించు ప్రేమ, అతఁడు కొల్లాపురమునకు తిరిగిపోయి నప్పటినుండి, చాలవఱకు చెడిపోయెను. సదాశివరావు యొక్క ప్రవర్తన పరిపాలన యందును, గోపికాబాయి యొక్క పుత్రుల యెడలను, చక్కగ నున్నను, ఆమెయందు రామచంద్రబాబా చెప్పిన ఈర్ష్యాంకురములు వృద్ధియే పొందెను. సదాశివరావుయొక్క శ్రద్ధాసక్తులు, పీష్వాయొక్క మందస్వభావమును ఖండనపాలు చేయుచుండెను కాని, నమ్మక మొకసారి చెడినపిమ్మట పుట్టు నీర్ష్య యటులుండగ, రాజునకును మంత్రికిని భేద ముదయించుట కనేక యవసరములు, స్త్రీయొక్క దుర్బోధలుదాని ప్రజ్వలింపఁ జేయకుండగనే, కల్గుచుండును.

హిందూస్థానము నుండి రఘునాధరావు వచ్చువఱకును, వారి పరస్పరామోదము చెడలేదు. అతఁడువచ్చిన తరువాత దివానగు సదాశివరావు, రఘునాధరావు యొక్క దండయాత్ర యందలి అమితవ్యయమును ఏర్పాటులును రాష్ట్రధనాగారములకు జమ తీసికొని వచ్చుటకు బదులుగ ఖర్చు తెచ్చెనని సహేతుకముగ వాని ఖండించెను. రఘునాధరా వందుకు తగిన ప్రత్యుత్తర మియ్యక, 'ఈపర్యాయము దండయాత్రను నీవు స్వయముగ నడుపుము, అని యాగ్రహముగఁ బలికి సభనుండి లేచిపోయెను. వారి మనస్పర్ధలు కుటుంబమున కంతకు విస్తరించి బహిరంగమాయెను. వారి విరోధములచేత ప్రోత్సాహము నొందిరో, లేక స్వయముగ పగఁదీర్చుకొనవలె ననియో, ఇదివఱకు సాలబజ్జంగు కొలువు నుండి తీసి వేయఁబడి పీష్వాకొలువుఁజొచ్చిన ముజఫర్ ఖాను యొక్క ప్రోద్బలముచే సదాశివరావును హత్య చేయు ప్రయత్నమొకటి చేయఁబడెను.

ముజఫర్ ఖానుఁడు పీష్వా కొలువున నుంచఁబడుటకు సదాశివరావు వెనుక సమ్మతించియుండలేదు. నిజామాలీ, ఇబ్రహీము ఖాను గర్ది యొక్క కొలు

ను (Corps) సాలబజ్జంగును సఖ్యపఱచు కొనుటకుగాను తీసివేయగా, వారిని తక్షణమే సదాశివ రావు తన కొలువునకు తీసికొనెను. ఈ ఇబ్రహీముఖానుఁడు ముజఫర్ ఖానునకు బంధువు. అందువలన నతఁడు తనకు పైగా నియమింపబడు టకు కొలువులోనికి తీసికొనఁబడెనని ముజఫర్ఖానుడుతలంచెను. ముజఫర్ఖానుడు నియమించిన హంతకుడు, సదాశివరావు తన రాజకార్యములఁ దీర్చుకొనుచు, నిప్పుడు బ్రిటిషుసైన్యము కాపురముగ నుంచఁబడిన స్థలమున, నొక దర్బారు గుడారమునందు కూర్చుండి యుండగా, కైదువుతోఁ బొడువఁ బ్రయత్నించెను. ఆహంతకుఁడు తన కార్యమును నెఱవేర్చెడి వాఁడేకాని నాగోజీగుజరు అను నొకచురుకైన సిలేదారుఁడు భావ్రూ వెనుక నిలిచి యుండిన వాఁడైనందున నా హంతకుని చేయిపట్టుకొనెను. ఆ కైదువు మొన సదాశివరావు యొక్క వీపునకు తగిలి చిన్నగాయ మాయెను. ఆహంతకుఁడు బాధింపఁబడిన మీఁద ముజఫర్ఖా నుచే నియమింపఁబడితినని చెప్పెను. వాఁడును బాధింపఁబడిన మీఁదట నా సంగతిని ఒప్పుకొనెను. ఇఁక విచారణేమియు లేక వెంటనే వారిద్దఱును ఉరి శిక్షకు తీసికొనిపోఁబడిరి. ఇందులో గూడియున్న పరభూ యొకడు కొండకోట లలో నొకదానియందు నిర్బంధింపఁబడి మఱి దిక్కులేక నచ్చటనే గతించెను.

సదాశివరావునకును రఘునాధరావునకును జరిగిన వివాదము వలన, నీ పర్యాయము దండయాత్రను సదాశివరావు స్వయముగ నడపునట్లును రఘునాధ రావు సివిలు పరిపాలనను చేయునట్లును ఏర్పాటు జరిగెను. రఘునాధరావు యొక్క హిందూస్థానము దండయాత్రను గూర్చియు, అందువలన కలిగినయుప ద్రవములను గూర్చియు, వాని నెల్ల సవరించుటకు సదాశివరావు ఉత్తరమున కరిగి పానిపట్టు రణమున మహారాష్ట్రుల కెల్ల ముప్పు దెచ్చి పెట్టుటను గూర్చి యు హిందూస్థానమందలి కథనెల్ల సవిస్తరముగ గ్రుచ్చి చెప్పుటకు పూర్వము ప్రస్తుతము దక్కనునందు సదాశివరావు హిందూస్థానమున కేగక ముందుజరి గించిన దండయాత్రను సూక్ష్మముగ విచారించి యటుపైన హిందూస్థానమం దలి గొప్పవిషయములఁ దిలకింతము. సదాశివరావుహిందూస్థాన దండయాత్రకు సైన్యమును కూర్చుచుండగనే అహమ్మదు నగరకోటనాఖిల్లెదా రొక బ్రాహ్మణ

యొజమునకు లంచమును కిచ్చివేసెనని తెలియవచ్చెను. హైదరాబాదుతో
యుద్ధ మిందు వలన తటస్థమయ్యెను. సాలబజ్జంగును నిజామాలీయును ఇందు
కు సంసిద్ధులు కాఁజాలరైరి. వారి సైన్యములకు జీతములు దిగఁబడి యుండెను.
వెనుక జరిగిన అంతఃకలహముల వలనను, కుట్రలవలనను, వారియొక్క రివిన్యూ
ఆదాయ మెల్ల క్షయమై పోయెను అయినను, నిజాముశాహి రాజధానియు,
సాధ్యమగుటకు నెంతయో మోగలుల రక్తమును బలిగా పుచ్చుకొనినదియు
నగు అహమ్మదు నగరమును కొంచెమైన పెనగులాడకుండ నవలివేయుట పౌరు
షము కాదని వారెంచిరి. సాలబజ్జంగుయు నిజామాలీయు, తగిన సన్నాహమేమి
యును లేక భారమైన సామగ్రియు బరువైన ఫిరంగిదళమును ఈడ్చుకొనుచు,
ఏడెనిమిదివేల స్వల్పసైన్యముతో గోదావరి పునకు పోయి యచటనుండి ఔరంగా
గిరి దిక్కునకు పోవుచుండిరి.

పీష్వా చాల సైన్యముతో, మూలబలముగ నెంచి, అహమ్మదు నగరమున
కు స్వయముగ పోయెను. సదాశివ రావు శీఘ్రముఖముగ నడచి, భీమనది
యొడ్డున బహద్దర్ గడను పట్టుకొని మోగలు సరిహద్దులకు పోవునప్పటికి శత్రువు
యొక్క పై చెప్పిన నడక లతనికి తెలియవచ్చెను. అతఁడు వెంటనే సైన్యము
లలో కొంత భాగమును చీల్చి పురోగామిగఁబంపి సాలబజ్జంగు నిజామాలీలతో
స్వల్పకలహమును చేయుచు కాలక్షేపము చేయు నాజ్ఞాపించెను. ఇంతలో సదా
శివరావు యశ్వ సైన్యమును 40,000 గఁ జేసికొని, మరియైదు వేలకాల్బలమును,
ఇబ్రహీముఖాను గర్ది క్రింద తేలికయైన ఫిరంగిదళమును తెప్పించుకొనెను. నిజా
1760 మాలీయు సాల బజ్జంగుయును, తాము చేసిన పొరబాటును తెలిసి
కొనిరి. అప్పుడు చేయునది యేమియును లేకపోయెను. సదాశివరావు
యొక్క ఫిరంగిదళము గుంపులుకూడిన మోగలు సైన్యమును చాలనాశనము చే
సెను. గుంపునుండి విడివచ్చిన వారినెల్ల మహారాష్ట్రులు చావఁగొట్టుచుండిరి.
మోగలుల సైన్యమును పశుగ్రాసమును మహారాష్ట్రులడ్డగించివేసిరి. నిజామాలీ
రాయభారములు చేయఁ బ్రయత్నించెను. కాని సదాశివరావువారిని కోఁబడ
వలసినదనికోరెను. ఆ యవమానమున కా సోదరులలో నెవ్వరును సమ్మతింపఁజాల

రైరి. ఇబ్రహీముఖాను గర్దీ యొక్క దళము మీద తీక్ష్ణముగ నిగాకులై మొగలులు శాకిర్లు, అందులకతని కోరు చెదరిపోయెను. పదునొకండు జెండా లతనివి పట్టుకొనఁబడెను. అతని మనుష్యులు చాలవఱకు హతులైరి. కాని మహారాష్ట్ర సైన్యము కొంత శాకతుజంగు క్రిందనున్న దక్షిణ పక్షమునదాకి 3000 మంది మొగలులను ముక్కముక్కలుగఁ గొట్టివేసిరి.

నిజాముఆలీ నిరాశుఁడై, సదాశివరావు వద్దకు తన ముద్రికను బంపి యతని ఔదార్యమునకు తోచినటుల సంధి చేయవచ్చునని తెలియఁజేసెను. దౌలతాబాదు, శివనేరి, అశీరుఘఢు, బీజపూరు కోటలు మహారాష్ట్రులు తీసికొనిరి. అహమదునగరము కోట మహారాష్ట్రులకు స్థిరపఱుపఁబడెను. బీజపూరు జిల్లాయు బీదరులో కొంతభాగమును ఔరంగాబాదు పట్టణమును హార్సోలు సిత్తారా పరగణాలు తప్ప ఔరంగాబాదు ప్రాంతమంతయును తీసికొనఁబడెను. వీనిమీఁద సంవత్సరమునకు రాఁబడి 62 లక్షలై యున్నది. పీష్వాలయొక్క రాజనీతి ప్రకారము ఇందు 41 లక్షల రూపాయిల దేశము యోధులకు జాగీరులుగా నియ్యఁబడెను. దక్కనులో మొగలురాజ్యమిప్పుడు స్వల్పమైనదాయెను. పీష్వా రాజ్యము బలాధికార సమన్వితంబయ్యెను. అనేక శతాబ్దములనుండి తమదేశమున పారతంత్ర్యులైన హిందువులు స్వతంత్ర తేజంబునఁ బ్రకాశించుచుండిరి. మహారాష్ట్రుల యాధిక్యత, యుదాత్తకార్య ప్రబోధకారణ భూతంబును, కీర్తికరంబునై విలసిల్లుచుండెను. కావేరీ తీరంబున వారి యాధిపత్య మంగీకరింపఁబడెను. వారి యశ్వంబులు సింధునదీ తోయంబులఁ దప్పిఁ దీర్చుకొనుచుండెను. శౌర్యము, సాహసము, భాగ్యము వారిని సామాన్యస్థితి నుండి తలయెత్తునట్లు చేసినవి. కాని యే కాలముననో ప్రమాదమునఁ బుట్టి క్రమక్రమముగ చిత్రవిచిత్ర విధంబులఁ బెరిగిన యా వర్ణభేదభూజము మన యార్యసంఘమెంత పాటుపడి యేకమగుటకుఁ [illegible] వినను, మరల తనవేళ్లను పెంచి దానిఁ బ్రద్దలుచేయుటకు సిద్ధమగుచుండెనుగదా! ఈ వర్ణభేదమే శేకాల యీ మహారాష్ట్రులలో బ్రాహ్మణ క్షత్రియులకు వివాదములు లేవఁ బోయెడివి. ఆ మహారాష్ట్రమున నెప్పుడట్టి భేదములు లేకుండునో యప్పుడే వారును కా

ము జయించిన తోడిహిందువులకు తమ పౌరుష శౌర్యాభిమానంబుల నాసంగయుండెడివారు. అట్లు వీరి విజృంభణమందు హిందూజాతి యొక్క విజృంభణము దేశ మందంతటను కలిగియుండెడిదే. అటుల జరిగినయెడల మనము సామాన్యముగ మహారాష్ట్రుల తోడిహిందువులగు నితర దేశభాగ వాసుల యెడఁ జూపించిన క్రూరదౌర్జన్యములను కంటఁజూడకుండెడి వారమేగదా! మహారాష్ట్రులు తమ జాత్యేతరుల యెడల నెట్టి దుర్నీతిఁగలవారైనను, తమలోతాము నీతిదయానురాగ విషయంబులందు అనుపమానులని విదేశచరిత్ర కారులు కూడ మెచ్చుకొనుచున్నారు. కావున వారి క్రూరత్వమునకు కారణము వారు హిందువులందఱియెడలను ఏకజాతీయ సానుభూతిని కలిగియుండక పోవుటయే యైయున్నది. ఇందుకు మూలకారణము వారు పూర్వసిద్ధమైవచ్చిన వర్ణభేదమును పాటించుటయే యైయున్నది. కావున వారిలో, నీశ్వరుఁడు సహజముగ మానవకోటికి ప్రసాదించు దయావివేకాదిగుణంబులు లేకుండుటవలన నీదురవస్థకలుగలేదు. పూర్వాచారంబుల యెడలనున్న మూఢగౌరవముచే దానినతిక్రమింపలేకపోవు సామాన్యలోపంబుచేతనే యింతకథపుట్టె. మన అఖండ భారత జననియొక్క ముఖమండలమును వారు పూర్ణముగ దర్శింపఁజాలక నొకప్రక్కనే జూచినవారగుటచే నిట్లుసంభవించినది. అందువలననే వారికి పూర్ణమోక్షంబుకలుగలేదు, అందువలననే వారు శీఘ్రకాలంబులో మరల నాశనంబునకు మార్గము పట్టిరి. ఎంతతపంబో యంతఫలంబే కలుగునుకదా! వారప్పుడే భారత మాతయొక్క ముఖమండలంబును సంపూర్ణముగ దర్శించియుండినయెడల నేఁక నెన్నటికిని పరుల కజేయంబైన హిందూరాజ్యం బేర్పడి మహీమండలంబున నీపాటికి సర్వకళాశోభితంబై, మహామహిమాఢ్యమై, నగంబులలోనెల్ల శుభ్ర తుషార కిరీటినియైన నాహిమవన్నగంబుపగిది, దేశంబులలోనెల్ల నుచ్ఛంబుగ మనదేశ ముండకుండెడిదియే?.

బాలాజీరావు తనపితృవ్యపుత్రుండగు సదాశివరావుయొక్క బాహువీర్యసంపత్తుచే జయంబునుపొంది యత్యంత సంతుష్టాంతరంగుండయ్యెను. కాని విచారంబులు శీఘ్రముగనేవచ్చికలిసెను. ఆదేసమయమున హిందుస్థానమునుండి దుప

జయంబుల వార్తలు వినవచ్చెను. రఘునాధరావు దండయాత్ర కాదిక్కున కలిగినప్పటినుండి యచ్చటచర్యలను గమనింతము.

అఖండరాజ్య పదవీచ్యుతమైన డిల్లీ దర్బారునందు 1754 వ సం॥ మున మీరుషాబుద్దీనుచే జరుపఁబడిన విప్లవమువలన హిందూస్థానమందు నల్లరి మఱింత వృద్ధియయ్యెను. ముల్తానులాహోరులకు గవర్నరుగనుండిన మీరుమనూ, అహమ్మదుషా అబ్దాలీని మొదటయెదిరించినను, తరువాత నతనికిలోఁబడి యతని రాజ్యము క్రిందనే సామంతుడుగ పరిపాలనను జేయుచుండెను.* మీరుమనూ చనిపోయిన తరువాత నతని కుమారుఁ డింకను బాలుఁడైనను, ఆఫ్గను రాజుచే నాతనిభార్య సంరక్షణక్రింద గవర్నరుగ నుంచఁబడెను. కాని యాబాలుఁడుకూడ కొద్దిరోజులలో చనిపోయెను. దేశమరాజకముగ నుండెను. సిక్కులు ప్రబలుచుండిరి. మీరుమనూభార్య కొన్నిదినములు తన యుద్యోగస్థుఁడగు నొకనిచే ఖైదునందుంచఁబడి తరువాత నతనితో సగభాగమునకు రాజ్యమును పొందియుండుట కొప్పుకొనివిడుదలచేయఁబడెను. ఈ మెయొక్క కూఁతురొకతె మీరుషాబుద్దీనుకు ప్రధానముచేయఁబడెను. ఇత్తరి ముల్తాను లాహోరులను మరల డిల్లీ రాజ్యమునకు కలుపుకొనుటకు తరుణమని యతఁడు తలంచెను. దీనికొఱకు మొట్టమొదట అహమదుషా అబ్దాలీయొక్క దండయాత్రకు కారకుఁడైన ద్రోహియగు అదీనా బేగు నతఁడు సఖ్యముచేసికొని యాదేశములను వశముచేసికొని మీరుమనూ భార్యను డిల్లీకికొనిపోయి యాస్థానమున అదీనా బేగును గవర్నరుగా నియమించెను. దూరదృష్టిలేని యావజీరుమీరుషాబుద్దీను, అహమదుషా అబ్దాలీ మరలరాకుండ నడ్డగించుటకు, తగిన కట్టుదిట్టములు చేసియుండలేదు.

ఈచర్యలకు అహమదుషా అబ్దాలీ క్రోధైకధురీణుఁడై నాలుగవ పర్యాయము గొప్పసైన్యముతో అట్టకునుదాటి లాహోరు ముల్తానులను మరల విశ్రుంఖలంబుగ నాక్రమించుకొని, డిల్లీకభిముఖుండై నడచివచ్చెను. మీరుషాబుద్దీను నమ్రుఁడై యతని పాదములపై బ్రాలెను. అహమదుషా ఔదార్యభావంబు నభినయించుచు నతని క్షమించెను. కాని డిల్లీమాత్రము కొల్లఁబెట్టఁబడెను. అ

దిక్కుమాలిన ప్రజలు మరల బాధింపఁబడిరి. అచ్చటి స్త్రీలు మానభంగంబునొందిరి. మధురాపట్టణముకూడ పట్టియవస్థకే పాల్పడెను. అగ్రాకోట యవస్థపట్టకుండ, పాపస్ఫూర్తిచే సాగ్నను శిబిరమునందు దుష్టజాడ్యంబులు విజృంభింప, అమీరు తన జయంబులను చాలించి సైన్యములతో కాబూలునకు మరలు నట్లు చేయుటవలన, రక్షింపఁబడెను. అతఁడు ఢిల్లీనుండి 1757వ సంవత్సరారంభమున వెడలక పూర్వము తనకుమారుఁడగు తైమూరుషాను పంజాబున కంతకును పైన రాయిగ నంపెను. రోహిల్లానాయకుఁడగు నజీబుద్దౌలా అనువాఁడు చక్రవర్తి దర్బారునందు అమీరుల్‌ఉమ్రావు స్థానమునకు నియమింపఁబడెను.

నజీబుద్దౌలా, అబ్దాలీ రాక పూర్వము, మీరుషాబుద్దీను కిష్టుఁడుగ నుండెను. కాని అబ్దాలీ వెనుకకు మరలినతోడనే మీరుషాబుద్దీను తనకు వైరిగ నజీబుద్దౌలా గొప్పస్థితి యందుంచఁబడినందుకు రోషము నొందినవాఁడై యతని పదభ్రష్టునిఁ జేసెను. చక్రవర్తి ఆలంగీరు, నజీబుద్దౌలాతోఁ గూడుకొని ఢిల్లీని తన వశము నందుంచుకొనెను. వారిరువురును పరస్పర రక్షకులై యున్నందువలన వారిని లోఁబఱుచుకొనవలయునని మీరుషాబుద్దీను నిశ్చయించెను. దీని కొఱకు రఘునాథరావు 1756వ సంవత్సరాంతమున మాల్వాకు వచ్చినతోడనే మీరుషాబుద్దీను అతనితో సఖ్యము చేసికొని యతని సాహాయ్యమున ఢిల్లీని చక్రవర్తిని స్వాధీనము చేసికొనెను. నజీబుద్దౌలాకూడ అతని చేతులలో ఖైదీగఁ బడెను వాఁడే కాని, మల్హారరావు హోల్కరు మహారాష్ట్ర ప్రముఖులలో నెవ్వరికంటెను రోహిలాల యెడల నెక్కువ స్నేహము కలవాఁడగుట వలన, నతనిని కోటనుండి పాఱిపోయి ఢిల్లీకి ఈశాన్యమూల 70 మైళ్ల దూరమున నున్న యతని దేశమునకు తప్పించుకొని పోవుటకు సాయము చేసెను.

*రఘోబా రాజధాని దగ్గఱ కొన్ని దినములు శిబిరముండి యటుపిమ్మట నొక మహాజయంబున కాహ్వానంబు చేయఁబడెను. అజయము నిశ్చయముగ

---

*రఘోబా యని రఘునాథరావునకే వాడుకపేరు. ఆపేరుతో నిక ముందు తఱచుగ నతఁడు పిలువఁబడుచుండును

నత్యంత పరాక్రమవంతమైన దైనను, అదియే మహారాష్ట్రుల విధ్వంసకరమగు నడ్డగించిన నాశన యుద్ధమునకు ప్రథమ కారణము. మహారాష్ట్రులకు వచ్చిన మూఁడవ గొప్ప యాపదగ నీ రాఁబోవు పానిపటు యుద్ధము పరిగణింపఁ బడును.

అహమదుషా అబ్దాలీ, తన కుమారుఁడగు తైమూరును పంజాబునకు వైసరాయిగ నియమింపక పూర్వము, ఖానుజహాను అనునతని మంత్రిగ నిచ్చెను. అతఁడును దేశముయొక్క యుపాధులనెల్ల నెఱిఁగి యున్నవాఁడనీ అదీనా బేగును గూర్చి వినినవాఁడై యతని సాహాయ్యమును కోరివడసి దూరపు జిల్లాలను వాని పరిపాలనకిచ్చి యందువలన లాభమును పొందినవాఁడాయెను. అదీనా బేగు లాహోరునకు పిలువఁబడెను కాని ఖాను జహానుయొక్క దురాలోచనల ననుమానించి యందుకు నిరాకరించి పర్వతములలోనికిఁ జనెను. కావున నతఁడు విద్రోహుఁడుగ నెంచఁబడెను, కాని యతఁడు తనపైనఁ బంపఁబడిన సైన్యములను, సిక్కుల సహాయమున నెదిరించి నిలచెను. అంతేకాక నతఁడు మహారాష్ట్రుల నాదేశములోని కాహ్వానము చేసెను. అప్పటికి డిల్లీయందున్న రఘోబా హర్షంబున నా ప్రస్తావన నవలంబించి ప్రయాణమై సర్హిందుయొక్క అబ్దాలీ గవర్నరు నశ్రమంబున నోడించి 1758 సం॥ ము మే నెలలో విజయాదిత్యుండై లాహోరు పట్టణంబున వెలుంగుచుఁ బ్రవేశించెను. అతఁడు అదీనా బేగును మూల్తాను లాహోరులకు సర్ సుభేదారునిగ నియమించెను. సింధియా చుట్టమైన సాబాజీయను నతనికి కొంత సైన్యమిచ్చి వానితో అదీనా బేగును సహాయము చేయుటకేర్పాటు చేసెను. రఘునాధరావంతట పూనాకు తిరిగి వచ్చెను; కాని యీ దండయాత్రయందును మఱియతని జీవితమందట్టి వాని యందనేకమందును వ్యయ మమితంబైనమాట ప్రసిద్ధమే. ఇంత గొప్పజయములు చేకూరినను నొక్క కాసైన రివిన్యూ ధనాగారంబునకు వచ్చిచేరలేదు. సుమారు 80 లక్షలకు మించిన వ్యయము లెక్కకు వచ్చెను. ఇందనుకఁ జెప్పఁబడినరీతి నీ సందర్భమునన్ సదాశివరావు యొక్క విమర్శనా ప్రసంగంబు అతని గృహకృత్య సంబంధమైన ఈర్ష్యలకు హేతువయ్యెను.

రఘోబా హిందూస్థానమును విడుచుటకు పూర్వము మల్హారిరావు హోల్కారును దత్తాజీ సింధియాను మాల్వాలో నుంచెను. జయపా సింధియాయొక్క కుమారుఁడైన జంకోజీ, రాజపుత్ర రాష్ట్రములనుండి కప్పమును వసూలు చేయుటకును, అవసరమైన యెడల లాహోరులోని సైన్యములకు సాహాయ్యము చేయుటకును, కొంత సైన్యముతో ఢిల్లీయందుండెను.

ప్రతాపవంతుఁడగు బాజీరావు క్రింద ప్రసిద్ధిఁగాంచిన రాణోజీ సింధియాకు జయపా, దత్తాజీ, జ్యోతీబాయను ముగ్గురు పుత్రులుకలరు. తుకాజీ మహాదాజీ యను మఱియిద్దరు దాసీ సంతానము కలరు. రాణోజీ సింధియా సాహూ తరువాత కొద్దికాలమునకే పరలోకగతుఁడయ్యెను. అతని కుమారులు దత్తాజీయు, మహాదాజీయును, పీష్వాతో సైన్యములను సామాన్యముగ నడుపుచుండిరి. జయపా సింధియా హిందూస్థానము నందుండుచు వచ్చెను. ఒక్క తుకాజీ తప్ప తక్కిన యన్నదమ్ములందఱును తండ్రి తరువాత బ్రతికి యుండిరి.

జాదూపుర (జోధపురము) రాజగు అభిసింగునకు రామసింగు బిజ్జిసింగు అని యిద్దరు కుమారులుండిరి. వారిద్దరును తండ్రి తదనంతరము తగవులాడుచు, అందు రామసింగు అనువాఁడు పీష్వాను సహాయ్యము కోరెను. పీష్వావారి వ్యవహారములను తీర్చుటకు జయపాను పంపెను. జయపా నాగూరులో బిజ్జిసింగును
1759 ముట్టడించి యతని లోఁబరచుకొనుట కుద్యుక్తుఁడయ్యెను. కాని బిజ్జిసింగు, తన తండ్రి వెనుక పీలాజీ గాయక్వాడును గూర్చి చేసిన దుర్మార్గపు ఉదహారణము నేర్పై కొని యిద్దఱు హంతకులను జాగీరిచ్చెద నని యాశపెట్టి జయపాపై నియోగించెను. వారును కూలి వేషములను ధరించుకొని జయపాయొద్దకు వచ్చియుండి తరుణము జూచుకొని యతని చంపివేసిరి. ఆ హంతకులలోఁ నొకఁడు తప్పించుకొని పాఱిపోయెను. జయపాయొక్క సైన్యము వెనుకకు తగ్గెను. కాని రఘోబా తరువాత నాదండయాత్రయొక్క యుద్దేశమును నెరవేర్చి ఆజ్మీరును పట్టుకొని జాదూపుర రాజ్యముపై కప్పమును విధించెను.

రాణోజీ యొక్క తక్కిన ముగ్గురు కుమారులందును దత్తాజీ, జయాజీలు పరాక్రమ వంతులై ప్రసిద్ధిఁగాంచి యున్నారు. వారు మొట్టమొదట 1751 సం॥ మలో పాలబజ్జంగు పఠానువారలపై యుద్ధములో పేరుఁబొందిరి. వారిద్దరు నిప్పుడు హిందూస్థానములలో నుంచఁబడిరి. రఘునాథరావు మరలిన కొద్దికాలములోనే నిరంతరకలహకారకుండగు నజీబు మీరుషా బుద్ధిచే దత్తాజీ ప్రేరేపితుఁడై రోహిలాల దేశమును లోఁబఱచుకొన గొప్పసైన్యముతో బయలుదేరెను. ఆహా ప్రక్రియలు ముందు నజీబుద్దౌలాపై సలుపఁబడెను. అతఁడును వారిధాటి కోర్వఁజాలక గంగానదీకూలంబునకు పాఱిపోయి యచట షుజావుద్దౌలాచే తోడ్పడఁబడు వఱకును దాగికొనియుండెను. షుజావుద్దౌలా తన తండ్రితో సమానమైన యీర్ష్యయే రోహిలాలయెడల కలిగియున్నను, ప్రస్తుతము వారితో నైకమత్యమే తనకు క్షేమమని యాలోచించెను. షుజావుద్దౌలా వచ్చినతోడనే బొందిలిఖండుయొక్క సుభేదారుడైన గోవిందపంతు బొందిలీ, రోహిలా దేశమునంతను తన సైన్యముతో నాశనముచేయుటకు దత్తాజీచే ననుజ్ఞాతుఁడయ్యెను. అతఁడు తత్క్షణమే దూయాబునందును, గంగకు తూర్పునను ధ్వంసము చేసి రోహిలాప్రముఖుల నందఱను కుమాయుగంబులందు శరణుఁజొచ్చునటులఁజేసెను. షుజావుద్దౌలా గోవింద పంతుపై దాడి వెడలి దగ్గఱకు వచ్చిన తోడనే తన సైన్యములో కొంతభాగమును విడఁదీసి యతనిపైఁబంపెను. విస్తారము గోసాయీలతో కూడిన యాసైన్యము గోవిందపంతులు మక్కుచెడఁగొట్టి యతని సైన్యము చెదరి నదిని దాటి పాఱిపోవు నట్లుఁదరిమెను. అనేకులు జల సమాధినిఁబొందిరి.

ఈవృత్తాంతము జరిగిన పిదప దత్తాజీతో రాయభారములు జరిగింపఁబడెను. అతఁడును, గోవిందపంతు ఓడిపోయినందుకు భయపడి కాక, అహమ్మదుషా అబ్దాలీ తిరిగి యైదవసారి గోలుపోయిన ముల్తానులాహోరులను పట్టుకొనుటకును, తన క్రోధము తీర్చుకొనుటకును వచ్చుచున్నాఁడను వార్త నెఱింగి, సమాధానమున కొడంబడెను. రోహిలా లాతురతతో నహమదుషా అబ్దాలీ కొఱకెదురు చూచుచు, నతనితో రాయభారములు చేయుచున్నను, దత్తాజీతో సమాధాన

మనుగూర్చి దృఢనిశ్చయములు తెల్పి, యందుకు ప్రమాణము చేయుటకేమియు సంకోచింపలేదు. షుజావుద్దౌలాకూడ నట్టిబాసలనే చేసియుండెను. అతఁడు మహారాష్ట్రులయెడల నెంత ద్వేషము కలవాఁడో అహమదుషా అబ్దాలీయెడలను అంతద్వేషము కలవాఁడై వారిరువురి యాక్రమణలనుగూడ నతిడసహ్యముగఁ జూచుచుండినందున నతని బాసలప్పటికి కొంతయదార్థములుగనుండెను.

ఒకపక్షమునమహారాష్ట్రులకును, రెండవపక్షమున రోహిలాలకును జౌడు నవాబునకును వృత్తాంతము లిట్లుజరుగుచుండ, మీరుసాబుద్దీను, చక్రవర్తికిని అహమదుషాఅబ్దాలీకిని రహస్యముగ నుత్తరప్రత్యుత్తరములు జరుగుచున్నవని కనుఁగొని అలంగీరు II కు, తన బంధువగు ఇంతిజాముద్దౌలతోకూడ మరణదండననువిధించెను. అతఁడంతట ఔరంగజేబు యొక్క చిన్నకుమారుఁడగుఖాను బఖ్షు పుత్రుని షాజహాను బిరుదున సింహాసనాసీనుం జేసెను. మీరుసాబుద్దీనిట్టి ఘోరకృత్యములఁ జేసి మహారాష్ట్రులకును అబ్దాలీకిని జరుగఁబోవు యుద్ధమునందు జయాపజయంబులను జూచుటకు జాటురాజగు శూరజమల్లుయొక్క యపాత్ర దాక్షిణ్యము వలన నతని కోటలలో శరణుజొచ్చియుండెను.

లాహోరులోని మహారాష్ట్రియుద్యోగస్థుఁడగుసాబాజీ, సింధియాహోల్కారులు సాయముఁజేయ రాకపూర్వమే, అబ్దాలీవలన తఱిమి వేయఁబడెను. అహమ్మదుషా, రోహిలాల సమాగమం బనుకూలంబగుటకును, భోజన గ్రాసాది సామగ్రు లందుబాటున కనువగుటకును, యమునానదిని తన ప్రధాన సైన్యముతో దాటెను. అదియే సమయమున నతని పురోగమసైన్యభాగము ముందుకు నడుచుచుండెను. దానిని దత్తాజీ ప్రధానసైన్యముగా భ్రమపడి స్వల్పకలహంబు చేయుచు వెనుకకు తగ్గుచువచ్చెను. దత్తాజీకి వెనుకనున్న హోల్కారుకూడ నదియే విధముగ వెనుకకు తగ్గెను. వారి రెండుసైన్యములును కలిసి 30,000 కూడ లేక కొంచెమెచ్చు తక్కువగ సమానముగ భాగింపఁబడియుండెను. హోల్కారు శూరజమల్లుతో సాహాయ్యమునకు మాటలాడుచుండెను. జాటురాజందుకు వాగ్దానము చేసెనుగాని మహారాష్ట్రు లంత నీరసముగ నున్నంతవఱకు రణరంగమును త్రొక్క నంగీకరింపలేదు.



ముల్హారిరావు హోల్కారు. 404

ఈ విధమున యమునాయొక్క పశ్చిమతటము వెంబడిని, వారో క్రమక్రమముగ వెనుకకు తగ్గఁజొచ్చిరి; కాని వారియొక్క దౌర్జన్యములు రయితు వర్గంబు నెల్ల విరోధులఁజేసెను. మఱియు వారు శత్రుగమనంబులను దెలిసికొనుట యందు మామూలునకు భిన్నముగ కడు పేదలై యుండిరి. అబ్దాలీయొక్క సేనాముఖము వారియొక్క దృష్టిని ముందట నాకర్షించుచుండ, అహమదుషా, నజీబుద్దౌలాయొక్క దేశభూస్థితిగతిని గూర్చిన జ్ఞానముచేతను, చుఱుకుదనముచేతను సాహాయ్యమును పొందినవాఁడై, ఢిల్లీ దగ్గఱ యమునానది నకాత్తుగ దాటి దత్తాజీసింధియా యొక్క సైన్యమును పార్శ్వమునఁ దగులుకొని యాకస్మిక యుద్ధముఁ జేసెను. దత్తాజీ సైన్యమున మూఁడవ వంతైనఁ దప్పించుకొనలేక పోయెను. తప్పించుకొనిన వారిలో మహాదాజీ సింధియాయు నతని యన్నజాయపా యొక్క కుమారుఁడగు జంకోజీయు నుండిరి. దత్తాజీయును జూతేబాయు వీరశయనము నొందిరి.

ఈయాపదను వినినంతట హోల్కారు ఇంకను శీఘ్రముగ ఆగ్రావఱకును పలాయనంబాయెను. అచ్చట యూపిరివుచ్చుటకు నిలిచి సింహావలోకనంబుచేసి అహమదుఖాను బంగషు సైన్యరక్షణముతో అబ్దాలీశిబిరమునకు విస్తారము సామగ్రులుపోవుచున్నవని వార్తనెఱింగి యాదిక్కునకేగెను. యమునానదినిదాటి యా సామగ్రులను కొంతవఱకుపట్టుకొని, కొంతవఱకు నాశనము చేసి యటుపిమ్మట యమునకుతూర్పునను చంబలునదికి దక్షిణముననున్న సికంద్రావఱకును వెనుకకుతగ్గి యచట సురక్షితముగ నున్నాననుకొనెను. యుద్ధములో నెప్పుడును వర్తమానము ముఖ్యము. అదిలేనిచో నెట్టియోధుఁడును భంగపడును. మహారాష్ట్రీ లీపర్యాయ మెన్నడునులేనిది శీఘ్రవర్తమానయుతులుగాక యోటమిపై నోటమిని పొందియుండిరి. అందుమీఁద నటుల హోల్కారు సికంద్రాయందుండగా ఆఫ్గను సైన్యము కొంత ప్రధానసైన్యమునుండి విడిపడి యపరిమితప్రయాణములు చేసివచ్చి యతనిఁగలిసికొని చాల జననాశంబుతో నతనినోడించెను.

ఈ యాపదలయొక్క వృత్తాంతములు మంజీరాయొద్దున నప్పుడు శిబిర మున్న పీష్వాకుఁ దెలియవచ్చెను. ఈవఱకుచెప్పినరీతి నతఁడప్పుడు నిజామాలీపై జయమునుపొందినవాఁడై దక్కనులో చాలదేశమును నూతనముగ సంపాదించి యుండెను. సదాశివరావు, రణదేవి తనకప్పుడే యనుగ్రహించినవిజయంబుచే నుత్సాహభరితుఁడై, పీష్వాకుమారుడగు విశ్వాసరావునుకూడ వెంటఁదీసికొని పోవుటకును, మహమ్మదీయులను సింధునదినిదాటునట్లు తఱుమఁగొట్టి, మహారాష్ట్రులయొక్క పోయినకీర్తిని మరల సంపాదించుటకును, పీష్వాయనుజ్ఞను కోరివడసెను. భావూయొక్కసహజమగు పరుషస్వభావము, అతఁ డనుభవించిన కుటుంబ యిార్ష్యలవలనను అందుచేఁ గలిగిన కుట్రలవలనను మఱింత వృద్ధియయ్యెను. కడచినరణరంగమందు కలిగిన యనన్యసామాన్యంబగు నదృష్టమువలన నతనిగర్వ మెక్కువయ్యెను. అనుభవములేని సేనాపతియం దపాయకరంబగు సంగ్రామోత్సాహ మతనిమనంబు నావేశించెను. సులభంబుగలభించిన జయంబతనికి మూర్ఖధైర్యమునిచ్చెను. కొన్ని యపజయముల నెన్నడైన పొందియుండినయెడల నతనికి జాగ్రత్తబుద్ధులు వొడమి శ్రేయంబయ్యెడిదే. సదాశివరావును, అతని యన్నకుమారుఁడగు విశ్వాసరావును, వెంటనంటివచ్చిన సైన్యము సుమారు 20,000 నికరమైన గుఱ్ఱపుదళంబును, ఇబ్రహీంఖానుగర్దీయొక్క సైన్యము (సాలబజ్జంగు నిజామాలీలతో నతఁడు యుద్ధముచేసినతరువాత రెట్టింపు చేయఁబడినదైన ఫిరంగిదళమును సుశిక్షితమైన కాల్బలమును) 10,000 వరకును ఉండెను. రణరంగమున కాయత్తపడిన నే మహారాష్ట్రసైన్యంబుకంటెను నీసైన్యంబు శిబిరాసనశయ్యాదిసామానుల యాడంబరమున పరిపూర్ణకళాశోభితంబై నెగడుచుండెను. ఈశిబిరసామానులను రఘునాధరావు వెనుకటి వ్యయముతో కూడుకొనిన దండయాత్రయందు హిందూస్థానమునుండి తీసికొనివచ్చెను. అది యంతయు దండయాత్రయం దలంకారమున చాలభాగ ముపయోగింపఁబడెను. ఉన్నతములును విశాలములునైన గుడారములు పట్టుపుట్టంబులతోడ నంచులు దిద్దఁబడి, కనకమయ కలశంబులతోడను, భూషణంబులతోడనుశిఖరంబుల నలంకరింపఁబడి దూరమునకు మనోహరంబుగ చూపట్టునటుల నమర్పఁ

బడెను. వివిధ చిత్రవర్ణవర్ణితంబులైన పటాప్రాకారంబులు, దీర్ఘంబులై ముఖ్యయుద్యోగస్థుల ప్రతిగుడారకూటంబును జుట్టి వెలిసియుండెను. లెక్కలేని యేనుంగులును, అనేక రకరకముల భాస్వత్పతాకంబులును, అధికవైభవంబున నలంకృతంబులైన తురంగరాజంబులును, చూపఱు కధికైశ్వర్యలక్షణం బొసంగు సర్వవిధసవాహంబులతోడను, నానాదిక్కులనుండి భావూశిబిరంబునకుఁ జేరుకొనెను. బంగారువలువలు ఉద్యోగస్థుల దుస్తులై చెలంగెను. ఎల్ల వారును తమవేషముల యాడంబరమందు నొకరినొకరు మించఁ బ్రయత్నించుచున్నట్లుండెను. మొగలులు తమ యుచ్ఛదశయందుఁజూపిన వైభవంబును మీరు తిరస్కరించుచు నేఁడు యుద్ధరంగమునకు బయలుదేరిరి.

భావూయొక్క స్వంతసైన్యమందు, ముఖ్యయుద్యోగస్థు లెవ్వరనిన; బల్వంతరావు గణపతిమండలే, బాజీరావుయొక్క మహమ్మదీయభార్యపుత్రుఁడగు షంషీరు బహద్దర్, రాజాబహద్దర్ నారూశంకర్, (కొంకణ గవర్నరు) విఠలశివదేవు (పించూర్కారు), త్రింబకు సదాశివ (పురంధరే) ఇంకను ననేక మహారాష్ట్రప్రముఖులు.

బాలాజీబాజీరావుతో గొప్పసైన్య మింకను నిలువయుండెను. కాని సదాశివరావు ఢిల్లీపట్టణమునకై పోవుచుండగఁ ద్రోవలో కలిసికొనవలయునని మహారాష్ట్ర సేనాపతు లందఱకును ఆజ్ఞలు పంపఁబడెను. ఆప్రకార మతఁడు చంబలునదినిదాటక పూర్వమే, ముల్హారిరావు హోల్కారు, జంకోజీసింధియా, దమ్మాజీ గాయక్వాడు, జస్వంతరావుపవారు, అప్పాజీరావు అథ్వాలీ, అంతాజీ మంకేశ్వరు, గోవిందపంతు బొందిలీ, మఱియు ననేక ముఖ్యడిసేనాపతులువచ్చి కలిసికొనిరి. రాజపుత్రముఖ్యు లనేకులు తమ యశ్వదళంబులను బంపిరి. అనేకపిండారీలు, ఎల్లతరగతుల నశిక్షితులగుభటులు, యామహాసమూహంబునం గూడిరి. హిందువుల జాతీయయుద్ధముగ నది పరిగణింపఁబడెను. శూరజమల్లు, హోల్కారుచే ప్రేరితుఁడై, 30,000 జనంబులతో నా మహావాహినిని వచ్చి కలిసికొనెను.

అనుభవశాలియగు శూరజమల్లు, భావూక్రింద నున్న దుర్భరంబగు నీజన సమూహము, భారమైన ఫిరంగిదళంబును దగిలించుకొని, దానికి సంబంధించిన కాల్బలంబు యొక్క నడకల కనుకూలమగు మెల్లినడకలను నడుచుకొనుచు నుండుట యుద్ధమునకు సంకటంబని తత్క్షణమే గ్రహించెను. కావున వారి కుటుంబములను భారమగు శిబిరపు సామానులను గ్వాలియరులోఁగాని జాన్సీలో గాని లేక తనకోటలయొక్క రక్షణక్రిందఁగాని యుక్తముగ నుంచి, మహారాష్ట్ర యశ్వదళంబును తనయొక్క బలంబును అబ్దాలీయొక్క భోజనాదిసంభారముల నడ్డగించి యతఁడు పలాయనం బగునటుల నవలీలగఁ జేయవచ్చునని శూరజమల్లు ప్రస్తావించెను. హోల్కారును ఇందు కామోదించెను. కాని రామచంద్ర శెన్వియొక్క వైరి యైనందువలన హోల్కారునెడల సదాశివభా వసహ్యా భావము కలవాఁడాయెను. హోల్కారునకును జాటులకును గల సంబంధము వలన నతఁడు శూరజమల్లునెడలకూడ నయిష్టుఁడయ్యెను. ఫిరంగులతో యురోపీయనులు చేసిన యద్భుత చర్యలు దేశమునందు పలుమాఱు వినవయ్యెను. సదాశివరావు పరాసుశిక్షయొక్కయు ఫిరంగిదళముయొక్కయు ప్రతాపమును స్వయముగఁ జూచినవాఁడాయెను. ఇబ్రహీముఖానుచే యూరపియను పద్ధతిని శిక్షింపఁబడిన సైన్యమువలన నాయన యెక్కువ లాభములను పొందెను. అందువలన నాతఁడు తనకు నిజముగ జయమునిచ్చు నొక్క యుపదేశమును మూర్ఖముగ నిందించివేసెను. సైన్యము డిల్లీకిసాగిపోయెను. అచ్చట కోటకు ఫిరంగులెక్కపెట్టి అనతికాలంబున దాని పట్టుకొనిరి. ఈజయము పిమ్మట భావూ, విశ్వాసరావును చక్రవర్తి సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి, షుజావుద్దౌలాను వజీరుగఁ జేయుటకు ప్రస్తావించెనుగాని పలువుర కసమ్మతముగ నుండినందున నట్లు చేయలేదు.

యమునానది యప్పటికే దాటనశక్యముగ నున్నందున సదాశివరావు తన సైన్యమునంతను డిల్లీయందే నిల్పెను. అచ్చట నతని యసంఖ్యాకులగు అనుచరులు సమీపముననున్న ఖాద్యములనెల్ల సొంతము చేయుచుండిరి. భోజనపదార్థములెల్ల దొరకుట కష్టమయ్యెను. మొట్టమొదట భావూకు ధనము తక్కువగు

నేమోయని భయము కలుగఁజొచ్చెను. అయినను ఈవిషయములో నతఁడు తక్కినవానిలో కంటె జాగ్రత్తగనే యుండెను. అతఁడు దక్కనునుండి తనతో రెండుకోట్లరూపాయిలను తెచ్చెను. హోల్కారు, సింధియా, గోవిందపంతు బొందిలేయును, రాజపుత్రులును మఱి మూఁడుకోట్ల రూపాయిలనిచ్చిరి. కాని యింకను ధనము తక్కువగునేమోయని సదాశివరావు చక్రవర్తియొక్క దర్బారుమందిరముయొక్క వెండిబంగారు నగలనెల్ల తీసికొని సింహాసనమును చెరిపించి యందుండి 17 లక్షలు రూపాయిలవరకు సమకూర్చెను.

ఈచర్య యసభ్యమనియు, రాజనీతి విరుద్ధమనియు, హోల్కారును, శూరజమల్లుకూడ వ్యతిరేకముగ గట్టిగ వాదించిరి. కాని సదాశివరావు వారి యాక్షేపములను సరకుగొన లేదు. అందుమీఁద శూరజమల్లు వెగటుపడి తన సైన్యముతో గూడ విచ్చుమొగ్గిపోయెను. రాజపుత్రులును మహమ్మదీయ శిబిరములోని తమమిత్రులు కొందఱి సలహావలన రణవిముఖులైరి. దేశమంతటను కలిగిన యీమహాపద సమయంబున స్వబలవైరంబుపుట్టి హిందువులకు సంపూర్ణముగ రానున్న స్వతంత్రలక్ష్మి మరల దూరంబయ్యెను. వివిధ జాతుల వారగు హిందువు లఖ్యైక కార్యనిరతులై పనిచేయుచున్నపుడు సదాశివరావు వారి యభిప్రాయములను గౌరవించక తనకును దేశమునకును ముప్పు దీసికొనివచ్చెను. అట్టి గొప్ప తరుణమున తమ స్వగౌరవమును పాటించి వెనుకకు తిరిగిన రాజపుత్ర జాటులెంతయు నవివేకమును జూపిన వారైరి. వీరందఱును కలిసి దేశమాత నుద్ధరింప రైరికదా!

ఇంతలో అహమదుషా అబ్దాలీ, గంగాతీరమున అనూపషహరు కెదురుగ శిబిరము నేర్పాటుచేసికొనినవాఁడై. నజీబుద్దౌలాద్వారా షుజావుద్దౌలా కూడ మునల్మానులతో కలిసి హిందువులపై ధ్వజమెత్తుటకు ప్రోత్సాహము చేయఁబడెను. కాని షుజావుద్దౌలా తక్కిన మహమ్మదీయు లందఱికంటెను మహారాష్ట్రులయెడల తక్కువవైరము కలవాఁడైనందున సదాశివరావు అతనిని తన వైపునకుఁ ద్రిప్పుకొన వలెనని రహస్యముగ ప్రయత్నములు చేయుచు మహారాష్ట్రులకును అబ్దాలీకిని చాల నెలలవఱకును జరిగిన రాయభారములం

డతని గుడ్డెవ త్రిగఁ గూడఁబెట్టెను. షుజావుద్దౌలా తనతో జరిగిన రహస్య వ్యవహారములను, బహిరంగవ్యవహారములను తన మిత్రుల యెదుటఁ బెట్టుచు వారి సలహాప్రకారము చేయుచున్న వాఁడయ్యెను.

వర్షకాలము కొంచెము తగ్గగానే, సదాశివరావు రెండవ షాఆలము కుమారుఁడైన మీరుజవామబఖ్తును సింహాసనాసీనుం జేసి షుజావుద్దౌలాను వజీరుగ ప్రకటించెను. అతఁడు రాజాబహద్దర్ నారోశంకరుని కొంత సైన్యముతో కోటయం దుంచి స్వయముగ కుంజపురమున కేగి యచ్చట దృఢబల సంరక్షితంబగు కోటను పట్టుకొనెను. అహమదుషా దానిని రక్షించవలెనని చాల యుద్దేశపడెను కాని, యమునానది యంతవఱకును దాటశక్యముగ లేదు గావున, నతఁడు నదీ తీరమునకు తన శిబిరమును చేర్చి, భావూతో నింకను రాయభారములతో కాలక్షేపము చేయుచు చిట్టచివఱకు డిల్లీకి పైన 20 మైళ్ల దూరములో నొక రేవును కనుఁగొని దాటివచ్చెను. భావూ వర్తమానమును పూర్ణముగ విశ్వసింపక మునుపే అబ్దాలీ సైన్యములు చాలవఱకు నదిని దాటివచ్చెను. ఆ మఱునాఁడు అక్టోబరు 26-వ తారీఖున నుభయపక్షముల వారి యొక్క యుం పురోగమ భాగములకు తీవ్రయుద్ధము జరిగెను. ఉభయులును జయమును పొందితిమని యనుకొనిరి. మహారాష్ట్రులు మఱునటి దినమున పోరాడనుద్దేశించిరి. కాని హోల్కా రింకను వానర యుద్ధము నవలంబించి శత్రువుల భోజన సంభారములను కొట్ట వాతురపడుచుండెను. ఇబ్రహీముఖాను తీక్ష్ణముగ నట్టి పద్ధతిని గర్హించెను. తనను తన సైన్యమును శత్రువుల నాశనమున కది యొప్పగించినట్లగునని, యతఁడు చెప్పి, యట్టి యుపదేశము నవలంబించిన మొదటి యశ్వబలంబుపై తన ఫిరంగులు త్రిప్పి కాల్చెదనని మూర్ఖముగ వాదించెను. ఈ యంతఃకలహములు కొంత కష్టముతో నవరింపఁబడెను. ఇవి జరుగు చున్న కాలములో మహారాష్ట్రులు స్వల్ప కలహములను చేయుచు పానిపట్టువఱకు వెనుకకు తగ్గిరి. అచ్చట సదాశివ రావు, ఇబ్రహీముఖాను సలహా ననుసరించి రణభూమిని స్థాపించుకొని యుండెను. అచ్చట నతఁడు 50 అడుగుల వెడల్పును, 12 అడుగుల లోతు నగు కందకము త్రవ్వించి తన శిబిరము చుట్టును పాని పట్టు చుట్టు

ను పెద్ద గట్టుచేయించి మధ్య నందులేర్పఱచి యందు ఫిరంగు లెక్కించెను. అహమేదుషా తన మిత్రులతో నదే విధముగ శిబిరముండి పెద్దపెద్ద చెట్లను కొట్టి సైన్యముచుట్టు నడ్డముగ వేసికొనెను.

మహమ్మదీయుల సైన్యము 41,800 అశ్వదళంబును, 38,000 పదాతులును మఱియు 70 క్షేత్రపుఫిరంగులు నుండెను. ఇది యెన్నిక బలము. కాని యశిక్షితులగు ననుచరు లింక నంత మంది కూడుకొనిరి. మహారాష్ట్రులు బలంబులు, 55,000 అశ్వంబులును, 15,000 కాల్బలంబును మఱియు 200 క్షేత్రపు ఫిరంగులు నై యుండెను. వీరుఁ గాక పిండారీలును తక్కిన యనుచరులును కలిసి యందఱును 200, 000 కు పైన నుండిరి.

సైన్యములు తమ స్థానంబు నాక్రమించుకొనిన పిదప సదాశివరావు గోవిందపంతుబొందిలేను శత్రువుయొక్క భోజన సంభారము లందుబాటు కాకుండ నడ్డగింప నియోగించెను. అతఁడందు కొంతవఱకు జయమును బొందిన వాఁడాయెను కాని యొకసారి యొకవేయిమందితో మాత్రమే, యొక మామిడి తోపునం దజాగ్రత్తగ నుండగా, అతీఖానుఁ డతని పైఁబడి యతనిఁ జంపి అబ్దాలీ రాజున కతని శిరస్సుఁగొనిపోయి కానుకగా నర్పించెను. గోవింద పంతుయొక్క మరణమునకు పూర్వము సంధి పొసగునట్లు కనుపడెను కాని సదాశివరావు, గోవిందపంతు తనసైన్యమున కాహారపదార్థముల కొఱకు పోయెనని స్పష్టముగఁ జెప్పినందున నొండొరులు దోషారోపణంబులు చేసి కొనుట వలన ద్వేషము హెచ్చి రాయభారము లాగిపోయెను. గోవిందపంతు చనిపోయిన పిమ్మట మఱియొక దురదృష్టము సంప్రాప్తమయ్యెను. కొంత యశ్వబలము ఢిల్లీనుండి ధనసంచుల నొక్కొక రొకటి చొప్పున దీసికొనివచ్చుచు, రాత్రివేళ అఫ్గను శిబిరమే తమ శిబిరమని పొరపాటు బడి యందు ప్రవేశించి వారిచే హతులై యా ధనమునంతయు పోఁగొట్టుకొనిరి. రాజపుత్రులును భూరజమల్లును రణవిముఖులైనను తమ సోదరసానుభూతిచే నింకను ధనసాహాయ్యము మహారాష్ట్రులకు చేయుచుండిరి. కాని యెంత ధనమైనను చాలక పోయెను. వేదన యెక్కువయ్యెను. ఇబ్రహీముఖానుయొక్క భటులు బాకీ

జీతములకై ఘోషపెట్ట నారంభించిరి. కేవలము జీతములపై నభిమానము కల వా రిట్లు చేయుట సహజమే కదా! అంతట హోల్కారు తమ యశ్వదళంబుతో యుద్ధంబు చేయవలయుననియు, గార్దీలను (శిక్షితులైన కాల్బలము) శిబిరమును రక్షించుటకు వదలి వేయవలయు ననియు సదాశివ రావుకు బోధించెను. భావూయును తన మొదటి యుద్దేశమును మార్చుకొనుట అవమాన మని యనుకొనక యుత్తమ భావముతో నట్టి యుపదేశము నంగీకరించెను

నవంబరు 29-వ తారీఖున అబ్దాలీ శిబిరము యొక్క యెడమ పార్శ్వమున నతని వజీరగు షావలీఖానున్న యెడ సంకుల సమర ముపక్రమింపఁ బడెను. మహారాష్ట్రులు 15000 వఱకుఁ జొరఁబడి యెదురైన వానినెల్ల తీక్ష్ణంబుగఁ దాకి కొట్టిరి. అఫ్గనులు కొంత దెబ్బ తూదుకొనినను పికాపికలై చెదరి 2000 వఱకు హతమైరి. చివరకు శిబిరముయొక్క యన్నిప్రక్కలనుండియు అఫ్గనువజీరు ప్రోది చేయఁబడి నందున మహారాష్ట్రులు 1000 జన నష్టముతో వెనుకకు తగ్గిరి.ఆ సమయమున హోల్కారు మహారాష్ట్ర సైన్యమును రక్షించెను. ప్రతిదినమును నిరంతరమును స్వల్ప యుద్ధములు జరుగుచు, నందు మహారాష్ట్రయశ్వసైనికులు విడివిడిగ తమశత్రువులను హతము గావించుచున్నను,డిసెంబరు 23-వ తారీఖు వఱకును విశేషమైనయుద్ధమేమియు జరుగలేదు. ఆనాఁడు షావలీఖాను కొందఱు అశ్వసైనికులతో మసీదుకు పోవుచుండగ, సదాశివరావు, విశ్వాసరావు, హోల్కారు, బల్వంతరావుగణపతిమండలే ఇంకను ననేక సేనాపతులు తమసైన్యములతో ముట్టడించిరి.నజీబుద్దౌలాయు నింక ననేకయుద్యోగస్థులు నతనికిఁదోడ్పడవచ్చిరి. తీవ్రసంగ్రామంబు జరిగెను. నజీబుద్దౌలా తక్కినవారికంటె యెక్కువచొరవచేసితనరోహిలాలతో రణఘుడ(Trenches) దగ్గరకు వచ్చినంతట, సదాశివరావు యొద్ద దివానుగనుండి పనిచేయుచున్న బల్వంతరావు, అను సాహసానుభవంబులుకల యుద్యోగస్థుఁడు తీక్ష్ణంబుగ నతనిఁదాఁకెను. 3000 రోహిలాలు రణరంగమునఁ గూలిరి. నజీబుద్దౌలాయు ఖైదిగ పట్టుకొనఁబడు నవస్థలోఁ జిక్కెను. కాని బల్వంతరావు సాయంకాల సమయంబున జయయుతుఁడైన క్షణంబున ప్రమాద వశంబున గుండుదెబ్బ

తగిలి వీరశయనంబున నొరిగెను. అతని మరణంబునకు భావూ చింతాక్రాంత మనస్కుఁడై తనమిత్రుని కళేబరంబును తీసికొని తనరణఘుడలోనికి నరుగుటకై యాలోచించెను. ప్రతిదినంబును సమరక్రియలు జరుగుచునే యుండెను. గోపిలాలును షుజావుద్దౌలాయు నిశ్చయ సంగ్రామంబునకు తొందరపెట్టి పర్యవసానంబును త్వరితముగఁ బడయ మనస్ఫూర్తిగఁ బ్రయత్నము చేసిరి. కాని అహమదుషా స్థిరమనస్కుఁడై యట్టిదాని నంగీకరింపక, మానవస్వభావంబును యుద్ధశాస్త్రంబు నెఱింగిన సేనాపతివలె ప్రవర్తించెను. మహారాష్ట్రుల వేదనతో పోల్చి చూచిన, యల్పకష్టములుగ నున్న తమయిబ్బందులచే, నుదయించిన తమ శిబిరంబులోని యసహనంబు వానికి శత్రువులయొక్క దురవస్థను స్పష్టము చేసెను. ఒకదినమాలస్యమైన కొలదిని తనజయ మెక్కువ నిశ్చయమని యతఁడూహించెను. మహారాష్ట్రులు క్షుద్బాధితు లగుచుండిరి. వారనేక దినములనుండి యలవాటుపడిన భోగములవలన కష్టముల సహింపఁజాలకుండిరి. వారు చేరుకొన్న దురవస్థనుగూర్చి చింతించుట కతఁడవకాశమునిచ్చెను. ఇఁక నిశ్చయసంగ్రామమును దాటవేయుటకు వీలులేదని సదాశివరావు గ్రహించుకొనెను. అతఁడింకను రాయభారములు నలుపుచున్నను ఇఁక నట్టి యాశ లేదని యాతఁడు మనస్సునఁ దిలకించెను. అతని అనుచరులలో నొకపెద్దగుంపు క్షుద్బాధ కోర్వలేక ప్రాణమందు లక్ష్యములేనివారై రాత్రివేళ యాహారార్థము రణఘడనుదాటి బయలు వెడలిరి. తత్క్షణమే వారు కనుఁగొనఁబడి పగవారగు నాఫ్ఘనులచేఁ జుట్టుకొనఁబడి నరికివేయఁబడిరి. మహారాష్ట్రులు అనవసర దుఃఖమునకిట్లు పాల్పడుటకంటె కృపాణధరులై యస్త్రిమరణంబు నొందుట మేలని తలంచిరి. యోధులందఱును నీయుద్దేశముతో భావూనుసమీపించి యతనియాజ్ఞ వడసిరి. భావూయును తన సహజధీరస్వభావంబుతో సభతీర్చి ప్రముఖులందఱకును యుద్ధతాంబూలములు పంచిపెట్టించెను. సైనికులందఱును యుద్ధసన్నద్ధులగుట కాజ్ఞాపింపఁబడిరి. నిలువ యున్న ధాన్యపదార్థంబులు పంచిపెట్టఁబడి యారాత్రి వీరస్వర్గంబునకు పోవుటకుముందు పూర్ణభోజనంబు నారగించుటకు సైల వొసంగఁబడెను. జనేవరి 7వతారీఖు ఉదయము నుదయభానుండు రక్తవర్ణంబులో గానుపించుట కాక

1671 ‘ గంట పూర్వము మహారాష్ట్ర సైన్యములు తమరణఘడస్థుదాటి బయలు వెడలెను. వారి చిన్నఫిరంగులును, తిరుగుడు * ఫిరంగులును,శతఘ్నులును ఒంటెలపై నెక్కింపఁబడెను. ఇబ్రహీముఖాను గర్దీయొక్క ఫిరంగుల రక్షణ క్రింద వారి అవాయిలు ముందుసాగి నడచెను. అటుతరువాత దమ్మాజీ గాయక్వాడు యొక్క యశ్వదళమును, తరువాత విఠలశివదేవుఁడు, సదాశివరావు భావూ, విశ్వాసరావు, జస్వంతరావు పవారు, షంషేర్ బహద్దరు, మల్హారిరావు హోల్కారు, జంకోజీసింధియా,ఒకరి తరువాత నొకరుగా నడచిరి.

ఈవరుసను వారు వీరావేశంబున భువి రాజ్యమునైన, దివి రాజ్యమునైన వారాఁడు గైకొనవలెనను నిశ్చయంబున నిదానంబుగ అబ్దాలీ శిబిరము వైపునకు నడచిరి. వారి శిరోవేష్టనంబుల చివరలు వ్రేలాడ వేయఁబడెను. చేతులును ముఖములును పసపార్చి వారు రణయజ్ఞంబున వ్రేల్వఁబడు నింధనంబులఁ బోలె నొప్పియుండిరి. సదాశివరావు తనభార్యను ఇంకను ప్రముఖుల కుటుంబములను హోల్కారున కొప్పగించెను. మల్హారిరావు హోల్కారు, వెనుక నజీబుద్దౌలా ప్రాణముఁ గాపాడినందున, నతఁ డిప్పుడు అహామదుషాపై పలుకుబడి కలిగి యుండుటవలన, వాతఁడొక్కడే యాతని దయకు పాత్రుఁడగునని తలంపఁబడెను. సదాశివరావు తానుబయులువెడలక పూర్వము తమ రాయభారములకు మధ్యవర్తిగ నియమించుకొనిన షుజావుద్దౌలాయొక్క కార్యకర్త యగు కాశీపంతున కొకలేఖనంపెను. ‘క్రోధపాత్రమిప్పుడు పూర్ణభరితమైయున్నది. ఇఁకనొక బిందుమాత్రంబైనను పట్టఁజాలదు. ఏమైన చేయఁగలిగినయెడల తత్క్షణమే కావలయును.’ అని యందు వ్రాయఁబడియుండెను. ఈలేఖ యందునప్పటికి షుజావుద్దౌలాయొక్క చారులు మహారాష్ట్రులు బయలువెడలివచ్చుచున్నారని, వచ్చి తెలియఁజేసిరి. వెంటనే యతఁడు అఫ్ఘనురాజునొద్ద కేగునప్పటికి అతఁడు తన గుఱ్ఱమునకు జీనువేయించి సిద్ధముగ గుడారము

* ఒక నిలువుగ నుండు ఇనుపకమ్మి కడ్డముగ నమర్పఁబడి యన్ని వైపులకును త్రిప్పుటకు వీలయిన ఫిరంగి.

యొక్క ద్వారముయొద్ద నిలువఁబెట్టి యుంచుకొని లోపల నిద్రఁబోవుచుండెను. ఘోషయి లేపించునంతట నతఁడు లేచి 'వార్తలేమి' యని యడిగి వృత్తాంతముల నన్నిటిని తెలిసికొని యశ్వారూఢుఁడై శ్రేణులనుదాటి యొకపైకి బయకరిగి యథార్థమును తెలిసికొనెను. అప్పటికి మహారాష్ట్రులు, వారు బయలుదెడలివచ్చిన వరుసనే, బారులుఁదీర్చుకొని వ్యూహములను పన్నుకొనుచుండిరి. వామపార్శ్వమున ఇబ్రహీముఖాను గర్దీయును దక్షిణపార్శ్వమున జంకోజీ సింధియాయు తమతమ సేనలతో నిలువఁబడిరి. ఫిరంగిదళము తమశ్రేణుల ముందఱ నేర్పాటుచేయఁబడెను. కొన్నిఫిరంగి ధ్వానంబులు వారు సన్నద్ధులైరని తెలియపరచెను. రణదుందుభి యను ఢక్కంబును మ్రోగుచుండెను. దీనిని అఫ్గనురాజు, గుఱ్ఱముమీఁద పరిషియను కల్లేకాను త్రాగుచు నప్పుడు దాన్ని అనుచరుని కిచ్చినవాఁడై, యత్యంత మనస్థైర్యముతో షుజావుద్దౌలాతో విూఖారుని వర్తమానము సత్యమే, యనెను. అటుతరువాత నతఁడు తన సైన్యమువ్యూహమున నిలుచుట కాజ్ఞయిచ్చెను. ఫిరంగిదళము మహారాష్ట్రుల వలెనే ముందు తీర్చెను. అతని వజీరగు షావలీఖానుఁడు అఫ్గనులతోడ మధ్యనుంచఁబడెను. అచటనుండి దక్షిణపార్శ్వమున అహమదుఖాను బంగషు, హాఫీజా రేహమంతు, దూండేఖాను, రోహిలాలు, ఉమ్మర్ బేగు, బెర్ఖూరుదారుఖాను బారుగట్టిరి. వజీరునకు వామపార్శ్వమున ఔదు నవాబగు షుజావుద్దౌలా, రోహిలాయగు నజీబుద్దౌలా నిలచిరి. ఈవరుసను ఫిరంగి ప్రయోగంబులతో నిరుగెడలను యుద్ధమారంభమాయెను. శ్రేణులు క్రమక్రమముగ సమీపించెను. ఇబ్రహీముఖాను గర్ది, దమ్మాజీగాయక్వాడు సహాయముతో, మహమ్మదీయుల దక్షిణ పక్షముగ నున్న రోహిలాలపై స్థిరంబుగఁ గదిసెను. అతఁడు తన వామపక్షమున ఉమ్మర బేగు బెర్ఖూరుదారుయొక్క తాకిడుల నాచుకొనుటకు తనసైన్యములో రెండు పటాలములను కుడివైపునుండి ఋయిమూలగ తిరిగి పోవునట్లు చేసెను. మహారాష్ట్రులయొక్క దక్షిణపార్శ్వమున జంకోజీ సింధియా తక్షణమే షాపసందుఖానును, నజీబుద్దౌలాను దాకెను. అఫ్గనులలో బాఖరున వచ్చుశ్రేణి ముందుకు వచ్చినకొలదిని వెనుక పెద్దపెద్ద గట్లు వరుసగ పోసుకొని వచ్చున క్లేశా

టు చేయఁబడెను. దీనియొక్క యుద్దేశము, మహారాష్ట్రులు శౌర్యాతిరేకంబున త్రోసికొనివచ్చి తన సైన్యములను చెదరఁగొట్టిన యెడల ప్రతికట్టునొద్దను చెదరిపోయిన శ్రేణులు మరల కూడుకొనుట కవకాశము కలుగుటకని అఫ్గను రాజు తలంచి యుండవచ్చును.

సదాశివరావు, తన యన్నకుమారునితోడను, యశ్వంతరావు పవారు తోడను అఫ్గను వజీరున కెదురుగ మధ్య నిలువఁబడెను. మహారాష్ట్ర జాతీయ కేతనంబగు భగ్వాజెండా సేనాముఖమునం దుంచఁబడెను. ఇంకను మరాఠా జరీపతాకములు రణరంగమున నాడుచుండెను. అహ్మదుషా మహమ్మదీయ సైన్యమునకు వెనుక భాగమున కొంత దూరములో నుండెను. ప్రతిపక్షుల ఇరువురి సైన్యములును ఫిరంగి దళముల నతిశయించి నడచినపుడు మహారాష్ట్రుల యుత్సాహ వాదంబులు 'హరహరమహాదేవు! హరహరమహాదేవు!', అని స్పష్టముగ వినవచ్చెను. యుద్ధమంతటను శీఘ్రముగ తీక్ష్ణమై ప్రబలెను. మధ్య భాగమున తీవ్రముగఁ దాకి మహారాష్ట్రబలములు విసరికొట్టెను. ఆదెబ్బ తాగ లేక వజీరు సైన్యములు వెనుకకుఁ ద్రెళ్లెను. అందువలన మహారాష్ట్రులు వారి శ్రేణులు బద్దలుకొట్టి విజృంభించిరి. ఇరుపక్షములను రౌతులు నేలఁగూలిరి. కోలాహలం బెక్కువై ధూళియెత్తి యా సంకుల సమరంబున సైన్యములను గప్పి యుండ వారు చేతులుచేతులు కలిసి మారణయుద్ధమొనర్చుచున్నపుడు నింగి యెల్ల మాఱు మ్రోగుచున్న హరహరమహాదేవు!అనియు అల్లా!దీను!అను వీరాలాపంబులు పలుఁ తప్ప వేఱువిధమున హిందువనియు మహమ్మదీయుఁ డనియు తెలియఁజాలకుండెను.వజీరు షా వలీఖానుడు తన పూర్ణకవచముతో కూడ వాహన భ్రష్టుఁడై క్రింద కురికెను. అతనితోడ మహావీరు లనేకులు పాదచారులై పోయు చుండిరి: కానియాఫ్గను లనేకులు బలిముడిగి త్రోవచేసి వెన్నిచ్చిపారిరి. 'నా మిత్రులారా, మనదేశము బహుదూరముననున్నది.మీ రెచ్చటకు పఱుగిడెదరు?' అని అఫ్గనువజీరు కేకలువేసెను. కాని యతనినుడువు లాలింపక యనేకులరిగిరి. కొంత సేపటఁడు తెగిన సేనాశ్రేణుల శేషభాగముచే రక్షింపఁబడెను. ఇబ్రహీము ఖాను గర్ది, తన సేనలో సగభాగము నష్టమైనను, తాను గాయపడినను, జయము

నొందెను. 6000 రోహిలాలు హతులైగాని గాయపడికాని రణభూమినొరగిరి. కాని మహమ్మదీయ సైన్యముయొక్క యెడమపార్శ్వ మింకను చెదరలేదు.

యుద్ధముయొక్క యీయవస్థ రెండుఘాములకు అహమదుషాకు తెలియపఱుపఁబడెను. గొప్ప సేనాపతి కర్హమైన మనఃస్థైర్యము నతఁడప్పుడు కూడఁ దీసికొని తనస్వంతసిబ్బందిలో ముఖ్యమైనభాగమును కొంతను శిబిరమునకు రమ్మని పిలిచి యుద్ధమునుండి పాఱివచ్చిన ప్రతియొక్కయుద్ధపాణియగుభటుని బయటకు తోలివేయవలసినదిగా నాజ్ఞయిచ్చెను. ఈయాజ్ఞ తక్షణమే నెఱవేర్పఁబడెను. కుడిపార్శ్వమును సాహాయ్యముచేయుటకు వెంటనే సైన్యభాగము లంపఁబడెను. వజీరు, 10,000 మందిభటులతో మహారాష్ట్ర సైన్యమధ్యమునకు గుఱ్ఱములను నిండుసవారితో విసురున తిరిగితిరిగి కొట్టవలసినదిగా, నాజ్ఞాపింపఁబడెను. షాఘసందుఖానుడును నజీబుద్దౌలాయు మహారాష్ట్రులప్రక్కను దాకుచువజీరునకు సాయముచేసిరి. ఆ తాకుడు లన్నిటికిని తిరిగి సరియైన జవాబులియ్యఁబడెను. మహారాష్ట్రు లావిలయదినంబున నకుంఠ శౌర్యముతో పోరాడిరి. మల్హారిరావొక్కఁడుతప్ప యెవ్వరు నిందు దోషారోపణ కర్హులుకారు. అతని దేశీయులలో నతనిశౌర్యమునుగూర్చి శంకించు వారెవ్వరునులేరు. కాని అతఁడు తననాయకుని రక్షించుటకు తనయావత్బలము నుపయోగింపలేదు. కొందరాతనికి ద్రోహబుద్ధినికూడ నారోపించుటకు సంశయింపరు. మధ్యాహ్నము రెండు గంటలకాలమునకు విశ్వాసరావు గాఢమైనదెబ్బతగిలి వీరశయనమునొందెను. దానినిజూచినతోడనే సదాశివరావు తనయేనుగునుండిదిగి, హోల్కారునకు తాను చేసినటుల చేయవలసినదని కబురుపంపి, ప్రసిద్ధికెక్కిన యవనతురంగరాజము నెక్కి యా దారుణసంగ్రామాభ్యంతరమునకరిగి యంతర్ధానమయ్యెను. హోల్కారు తరువాతచెప్పినటుల, నతఁడట్టి కబురునే పంపియుండినయెడల, నదియే యుత్పాతంబునకు కారణంబయ్యెను. హోల్కారు రణమునుండి వెడలిపోయెను. దమ్మాజీ గాయక్వాడువెంటనే యూదారిపట్టెను. ఒక్కనిమిషములో మహారాష్ట్రబలము విరిసిపోయెను. 'పలాయనమును కలవరమును సం

ప్రాప్తమయ్యెను. వేలకొలది యాచకోతకోయఁబడిరి. అనేకులు తమరణభూమిలో యూపిరిసలుపక ప్రాణములువిడిచిరి.

పుడమి యెల్ల హిందువుల రక్తప్లుతమయ్యెను. ఆనాఁడు దేశమాత అత్యంత శోకతప్తయై కన్నుల రక్తబిందువులు గార్చుచు పశ్చిమ దిక్తటంబు నెల్ల తడిపెనో యన సాయంకాలంబున నస్తమయంబు తోఁచె. స్త్రీలు పురుషులు, బాలురు బిలబిలలాడుచు దిక్కులేక పానిపట్టు గ్రామమునందు దిరుగుచుండిరి. ఆ, రాత్రి వారందఱు నచ్చట ముట్టడింపఁబడిరి. మనుష్యులను పీకుకొని తిను రక్కసులకైన కొంత దయారసంబు కలుగక మానదు. కాని యాఫ్గను లట్టి దానినిఁ జూపరైరి. వారికిని మానవజాతికిని శాశ్వతముగ నవమానకరంబగు రీతిని మఱునాఁడు ఉదయమున నా దురదృష్టవంతులగు జనుల నే విచారమును లేక తమ శిబిరములో పంచుకొనిరి. స్త్రీలను పిల్లలను బానిసలగా వారుగైకొనిరి. పురుషులను శ్రేణులుగ నిలువఁబెట్టి తలలు నరకుచు చిత్రవధలఁ జేయుచు నానందించు చుండిరి. నాఁడు త్రేతాయుగమున పరశురాముడు

* సదాశివరావు యొద్ద హుస్సేనుఖానుడను నొక అఫ్గను డుద్యోగములో నుండెను. యుద్ధ సమయమున నతఁడు తనరాజగు అబ్దాలీతో పోరాడుటకిచ్చగింపక సెలవు పుచ్చుకొని తన దేశీయులతో కలిసెను. అతనియొద్ద కార్యకర్తగనున్న నారూ భగవంతుడను బ్రాహ్మణుడు నరకుటకు నిలువఁబెట్టఁబడిన వారిలో నొకఁడు. శత్రుకరవాల తేజంబు కంఠములపై నుండి విసురనబోవుటకు ముందు ఆ హిందువులకు కొన్ని యటుకులును కాసిని మంచి నీళ్లను పోయఁబడుచుండెను. బిహిష్టీ (నీళ్లుపోయువాడు) వచ్చి నీళ్లుపోయుచుండగ నా కార్యకర్తను చూచి మన బ్రాహ్మణుడు చంపఁబడఁ బోవుచున్నాడని హుస్సేనుఖానుకు పోయిచెప్పెను. హుస్సేనుఖాను ఆ బ్రాహ్మణుని తాను బానిసగ తీసికొందునని అబ్దాలీ నడిగి సెలవు పుచ్చుకొని వానిని మృత్యువాతనుండి తప్పించెను. తరువాత నతఁడు నారూభగవంతునకు 5 మొహిరీ లిచ్చి యచ్చటినుండి 20 క్రోసుల దూరమునకు పోవుచున్న తన స్నేహితుని సైన్యభాగమొకదానితో జాగ్రతగఁ బంపెను. అతడు మొహిరీలు తన వెంటనున్న అఫ్గ

క్షత్రియ వీరులనెల్ల దండించి హిందూదేశమునకు ముప్పు తెచ్చి వారి తలలతో స్వర్గమునకు మెట్లు కట్టితినని యెట్లు సంతసించెనో యటులనే కరకు మహమ్మదీయులును పరాజితులైన హిందువులయొక్క తలలను దయమాలి ప్రోగుచేసి గొప్ప ఈశ్వరప్రియమగు కార్యమును చేసితిమని సంతసించిరి. విశ్వాసరావు యొక్క దేహ మొకచోట పడియుండగ అబ్దాలీ వానిని చూచుటకు తెప్పించెను. ఆఫ్గను లందఱును దానిని చూచుటకు కుతూహలముతో గుంపులుగా కూడి వచ్చి 'నాస్తికుల రాజుయొక్క కళేబరమిది. దీని నెండబెట్టి లోపల యెత్తుపెట్టి మన కాబూలునకు తీసికొని పోదము' అని కేకలు పెట్టిరి. ఆహా! ఈశ్వరజ్ఞానముచే నిండి నిబిడీకృతమైన వేదవేదాంగములను పొందిన వారయ్యు మహమ్మదీయులకు నాస్తికులవలె హిందువులు గాన్పించి యుండిరి. ఔను! తమకీశ్వరప్రసాదముచే లభించిన జ్ఞానము నితరుల కుపదేశింపక తామే దానితో కులుకుచుండి నందువలన ఈశ్వరునిచేతనే మఱియొక విధమున వారు శిక్షింపఁబడుట యందు ధర్మమే యున్నది. బ్రాహ్మణులు క్షత్రియుల నడచియు, క్షత్రియులు వైశ్యులనడచియు, వైశ్యులు శూద్రుల నడచియు, శూద్రులు మాలమాదిగల నడచియు, వీరందఱును కలసి మానవసృష్టియం దుదయించిన తక్కిన వారినందఱిని మ్లేచ్ఛులుగ నీచముగఁ జూచియు, తమ జ్ఞానతేజంబును భూమియందు ప్రకాశింపఁజేయక హిందువులు చివరకు పరదేశీయుల సానుభూతిని పోఁగొట్టుకొనినందువలన నింత హాని వాటిల్లుటయం దాశ్చర్యమే మున్నది? మహమ్మదీయ మతము ప్రపంచమున విస్తరించిన విధముననే హిందూమతమును విస్త

నులకు తెలియకుండునట్లు నోటిలో పెట్టుకొని దాచియుంచెను. ఆ ఆఫ్గనులలో [illegible]డు మాత్రము ఆసంగతిని కనిపెట్టి యుండెను. తరువాత తక్కిన యాఫ్గనులందఱు నతని విడిచి దూరముగ పోయిన తరువాత మొహిరీలను చూచిన ఆఫ్గను డతని వెంటఁబడి 'ఓ బ్రాహ్మను! ఓ బ్రాహ్మను!' అని పిలచి నోటిలో నున్న దచ్చట పెట్టుమని బెదరించెను. బ్రాహ్మణుడు వాని నతని కిచ్చివేసి ప్రాణమును రక్షించుకొని తనదేశమును చేరెను. ఆఫ్గనుల దౌర్జన్య[illegible] గూర్చి యతడు తరువాత చెప్పుచుండెడివాడు.

రింపఁ జేయఁబడినయెడల సాటిలేని యవలక్షణబీకు లీమతమునకు కలిగియుండరా? అప్పు డింతద్వేషము వీరియెడల కలుగఁగలదా? ఇన్ని ఘోరానుభవము లెన్ని కలిగిన తరువాత మనకు బుద్ధివచ్చునో తెలియకున్నది.

విశ్వాసరావుయొక్క దేహమునకు హిందూ ధర్మప్రకారము పరలోకక్రియలు జరుప నిచ్చుటకు హిందువుల కియ్యవలసినదని, షుజావుద్దౌలాయు రోహిలాలును మనసుకరిగి, అహమదుషా అబ్దాలీకి బోధించి, యట్లు చేయించిరి. షుజావుద్దౌలా గాయపడిన జంకోజీసింధియాను, ఇబ్రహీముఖాను గర్దీని కూడ రక్షింపఁ బ్రయత్నించెను. కాని రోహిలా నాయకుఁడగు నజీబుద్దౌలా సింధియా నామమునకు నిశ్చల కాఠిన్యమును వహించియుండెను. ఇబ్రహీముఖానుయొక్క యపరాధము హిందువు పక్షమునఁ జేరి యాస్తికులగు మహమ్మదీయులతో పోరాడుట యై యుండెను. వారిద్దరును మరణ దండన విధింపఁబడిరి. ఒకచోట భావూయొక్క మొండెము కనుపడెను. అతనియొక్క శిరస్సు కనుపడలేదు గాని యా మొండె మతనిదై యుండుటకు సందేహములేదు. జస్వంతరావు పవారు వీరశయనము నొందెను. బాజీరావు యొక్క మహమ్మదీయ పుత్రుడగు షంషీరు బహద్దరు రణరంగమున గాయపడి తప్పించుకొనెను. కాని విరోధులగు ప్రజలచే నరకఁబడిన వారిలో నతఁడొకఁ డయ్యెను. విఠల శివదేవుడును, దమ్మాజీ గాయక్వాడును, నారూ శంకరుడును, ముల్హారిరావు హోల్కారును, డిల్లీలో కావలి సైన్యములో కొంతయును తప్పించుకొని స్వదేశమును చేరిరి. యుద్ధజనులలో నాలుగవ వంతు మాత్రమే తప్పించుకొనెను. అనుచరులలో కూడ నంతే భాగము తప్పించుకొనిరి. రెండులక్షలు మహారాష్ట్రులు దాదాపుగ నీ దండయాత్రయందు హతులైరి.

శూరజమల్లు, తనదేశమునకు పారి వచ్చిన హతశేషులగు జనుల కత్యంతాదరము చేసెను. తాను తగిన సహాయము చేయక తిరిగి వచ్చినందు కతడెంతయు మనోవ్యథం బొందెను. ఆ సమయమున జాటులు చూపించిన ప్రేమానురాగంబుల కిప్పటికిని మహారాష్ట్రులు కృతజ్ఞతా గౌరవంబులతో వారిని దలంచుకొందురు.

సదాశివరావు రణఘడయందు చిక్కఁబడి యున్న కాలములో, నతని యవస్థనుఁ గూర్చి యెప్పటి వార్త లప్పుడు పీష్వాకు తెలియవచ్చుచుండెను. నవంబరు నెలలో నతఁడు అహమదునగరమునకు వచ్చెను. అచ్చట నుండి యతఁడు గోదావరీ తీరంబునకు వచ్చెను. డిసెంబరు నెలలో వార్త లింకను భయంకరము లయ్యెను. జానోజీ భాంస్లే 10,000 భటులతో నతని కలిసికొనెను. సైన్యమంతయు హిందూస్థానమునకుఁ బ్రయాణమయ్యెను. జనేవరి మధ్యలో నర్మదానదిని దాటుచుండగ సాహూకారుల యొక్క యొక కోసిదు (ఉత్తరములను తెచ్చువాడు) పానిపట్టునుండి ఔరంగబాదునకు తొమ్మిది దినములలో జేరుటకు నియోగింపఁబడినవాఁడై, పీష్వా సైన్యమును కలిసికొని మహారాష్ట్రులోడిపోయిరని తెలియపరచెను. అతనిచేతి కియ్యఁబడిన యుత్తరమును తీసికొని చదువగా నందు – 'రెండు ముత్యములు కరిగిపోయినవి, 27 మొహిరీలు నష్టమై పోయినవి, ఇక వెండి రాగి యొక్క మొత్తము లెక్కింప శక్యము కాదు.' అని వ్రాయఁబడెను. ఈ మాటల నుండి సదాశివ విశ్వాసరావులయొక్కయు, ఉద్యోగస్థులయొక్కయు సైన్యముయొక్కయు గతులు తెలియనయ్యెను.

సైన్యమునుండి తిరిగి వచ్చిన కొందఱు జనులనుండి ఈవృత్తాంతము ధృవపర్చఁబడి నిస్సంశయమయ్యెను. మొట్టమొదటనింటికిఁ జేరినవారిలో బాబూరావు యొక్క అన్నకొడుకగు బాలాజీజనార్దనుడొకడు. ఇతఁడే తరువాత నానాఫడ్నవీసు అని ప్రసిద్ధికెక్కినవాఁడు. ఇతనియొక్క తల్లి ఆఫ్గనులవలన చెఱపట్టుకొనఁబడెను. ఇతని యొక్క భార్యయు, దురదృష్టవంతుడగు భావూయొక్క భార్యయగు పార్వతీబాయియు తప్పించుకొనిరి. మహారాష్ట్రుల యాక్రందన ధ్వనులు చెప్పనలవిగాదు. మహారాష్ట్రమంతయు దుఃఖమేఘం బావరించెను. పీష్వా విషాదసాగరమున మునింగెను. అతడు మెల్లమెల్లగ కాళ్లు తడబడుచు నోటమాటలేక పూనాకు పోయెను. అతని మతిచెడి పోయెను. దేహమస్వస్థతలోపడి యీవిచారమువలననే తీసికొనుచు మనోవ్యధచే జానుమాసాంతమునకు పూనాపట్టణమునకు దక్షిణపుదిక్కున పార్వతీదేవాలయపుకొండ

పైన *నతఁడు కట్టించిన భవనమునం దతఁడు కాలధర్మమునొందెను.

పానిపట్టు యొక్క యపజయమైన కొద్దికాలమునకే పీష్వా యొక్క మరణమును తటస్థించి నందువలన దేశముపై నావరించిన్న దుఃఖమేఘము మరింత దట్టమయ్యెను. బాలాజీబాజీరావు తమకు పూర్వమున దేశమునందు జరిగిన యేర్పాటులవలన లాభములను బొంది యదృష్టవంతులైన రాజులలో నొకడు. అయినను బాలాజీరావు మంచిరాజకీయ బుద్ధిసూక్ష్మత కలవాఁడును, నాగరికభావాభినయంబులు కలవాఁడును, ప్రౌఢవాక్చాతుర్య ధుర్యుండునై యుండెను. ఆకాలమున రాజ్యము నాపదఁ బొరయకుండ తనకు హానికలుగకుండ దండోపాయము విస్తార ముపయోగింపకుండ యవసరమైన రాజతంత్రంబులను కుట్రలను ప్రయోగించుటయందితఁడు తన సామర్థ్యమును జూపెను. ఈ లోప మొక్క మహారాష్ట్రబ్రాహ్మణులయందే యున్నట్లు గ్రాంటుడఫ్ తరుచుగ తన మహారాష్ట్రచరిత్రయందు చెప్పుచుండును. ఆకాలపు మరాహాష్ట్రులయందును, మహమ్మదీయుఁడగు నిజామాలీయందును, రాజపుత్రులగు అభిసింగు మొదలైన వారియందును, డిల్లీలో యనేక మహమ్మదీయులయందును, పరాసువారగు డూప్లే బుస్సీలయందును, ఇంగ్లీషువారగు క్లైవు మొదలైనవారియందును స్పష్టముగనున్నది. దేశమప్పు డున్న స్థితియం దెట్టివారికైన దుర్బుద్ధులు పుట్టుచుండెను. రాబర్టుక్లైవు వారన్ హేస్టింగ్సు మొదలైనవారు హిందూదేశమున తమ సంఘమును గానక యెప్పుడైన తమదేశమునకుపోయినయెడల నచ్చటి ప్రజాశక్తికి కుత్తరవాదుల మగుదుమని భయముండినందున గాని లేనియెడల నిప్పుడు వారుచేసిన దుర్మార్గముల కంటె నెక్కుడు చేసెడు వారని చెప్పుటకు సందేహములేదు. వారను హేస్టింగ్సు తన పక్షమున వాదించుకొనునపుడు "తానట్టి స్థితిగతులలో నంత స్వల్పధనములో తృప్తినొందితి నని తనకే యాశ్చర్యముగ నున్నదని చెప్పుకొనెను. అట్టి వారే బాలాజీరావు స్థితిలో నున్న యెడ

* ఈపార్వతీ దేవాలయమున్న కొండమీద పీష్వా పూర్వపుభవనము యొక్క శిథిలము లిప్పటికినియున్నవి. ఆదేవాలయము యొక్క డాబా పైకెక్కి చూచిన పట్టణమంతయు కనఁబడును.



పార్వతీ దేవాలయము (పూనా.)

ం పేఱుగ చెప్పనక్కఱలేదు. ఇఁక నిండియాలోఁకూడ రాజుల నిరంకుశ వృత్తి నణఁగించుటకు ప్రజాశక్తియేయున్నయెడల బాలాజీరావు మొదలైన వారనేకులు మహాసన్మార్గమున మెలఁగియుండెడివా రనుటకు సంశయములేదు. బాలాజీరావు సుక్వారుభాయి యెడల చేసిన యపరాధమును గూర్చి యీవఱకే విచారణచేయఁబడినది. బాలాజీరావు యొక్క సంసారిక ప్రవర్తన విషయేచ్ఛలతోఁ గూడుకొని యున్నది. అతఁడు కొంచెము సోమరియు, స్త్రీలోలుండైనను, సామాన్యముగ నౌదార్యవంతుడును, దాన ధర్మపరుండును, బంధువుల యెడలను ఆశ్రితుల యెడలను దయావంతుడును, బలత్కార దౌర్జన్యములకును ప్రజాపీడనకును విముఖుండునై యుండును.

సాహూ యొక్క మరణమునకు పూర్వము, సివిలు వ్యవహారములో మార్పేమియు జరుగులేదు. కాని పీష్వాచే స్వయముగ పరిపాలింపఁబడిన దేశభాగము బాలాజీ విశ్వనాధుని కాలము నుండియు నభివృద్ధిలో నుండెను. జిల్లాలయొక్క రివిన్యూగుత్తకియ్యఁబడు దుష్టపద్ధతి తీసి వేయఁబడుటయే యిందుకు ముఖ్యకారణము. ప్రతి చిన్న ప్రముఖుఁడును గ్రామస్థులనుండి ధనధాన్యములను బలాత్కరించి తీసికొనకుండ రక్షించుకొనుటకు ప్రజలకు ప్రోత్సాహము చేయఁబడెను. బాలాజీరావు కొన్నికొన్ని జిల్లాల కధికారులుగ స్థిరమైన మామ్లితుదారులను, సుభేదారులను నియమించెను. అతఁడు దూరదేశములందు సర్సుభేదారులనుంచి వారి క్రింద ననేక మామ్లితదారుల నుంచెను. కృష్ణాగోదావరీ మధ్యదేశమందు మొదట సర్సుభేదారుఁడెవ్వఁడును లేఁడు. విస్తారము పంటయు రక్షణయు కలిగిన నీ మధ్యజిల్లాలు మహారాష్ట్ర పరిపాలనలో పీష్వాయొక్కబంధువులును, ఆశ్రితులును, సభికులునైన వారికియ్యఁబడి యుండెను. వారు పోలీసు అధికారమును, సివిలు క్రిమినలు రివిన్యూ యధికారములును, మరణ దండనాధికారములును పూర్ణముగ కలిగియుండిరి. వారు క్రమమైన లెక్కలను సర్కారునకు చూపింప వలసిన వారయ్యును, ఎప్పుడును దాటవేయుచునే యుండిరి. వారు సామాన్యముగ తమ ప్రతినిధులకు వ్యవహార మంతయు నొప్పగించి, తాము దర్బారునందు కాని రణరంగమునందు కాని పీష్వా

ననుసరించి యుండెడివారు. వారి జిల్లాలు సాధారణముగ నక్రమముగ వ్యవహరింపఁబడుచుండెడివి. ప్రధానస్థానమున కవసరములు కలిగినపుడు వారు పశువు యుపధులు వారి దేశమున కనురూపముగ నుండక బహు తక్కువగ నుండెడివి.

సదాశివరావుయొక్క స్నేహితుఁడగు రామచంద్ర బాబాశణ్వీవలననే యీయుత్తమ పద్ధతి యారంభము చేయఁబడినది. అతని మరణానంతరము సదాశివరావు భావూ అతని యుపదేశముల ననుసరించి యింకను బాగుచేసెను. రివిన్యూ వసూలు చేయువారిని వశములోనికి తీసికొని వచ్చు ప్రయోజనమును బాలాజీరావు వెఱింగును. కాని యట్టి పనిని తాను నిర్వహించుటకు తగినంత శ్రమపడుశక్తి యతనికి లేక పోయెను. కాని తన పితృవ్య పుత్రుఁడగు సదాశివరావు యొక్క చర్యల నతఁడామోదించుచుండెను. అదృష్ట వశమున సదాశివరావునకు వల్లభ మాండువగుణి యను తగిన మనుష్యుఁడు దొరకెను. అట్టి మామ్లితుదారులకును, సుభేదారులకును అధికారిగ నతఁడు సర్ సుభేదారుగ నియమింపఁబడెను. చాల ధిక్కారమునుపొంది, అపఖ్యాతి బొల్పడిన తరువాతను, ఒక సందర్భమున దండోపాయము కూడ నుపయోగింపవలసిన యవసరము కలిగిన తరువాతను, వారిలో నొకరిద్దఱను ఉద్యోగమునుండి తొలఁగించిన పిమ్మటను వారు లెక్కలుచూపించున ట్లతఁడు చేయఁ గలిగెను. ఒకడిపార్టుమెంటులో నిది గొప్ప సంస్కారము. కాని తక్కినవియు నశ్రద్ధచేయఁ బడలేదు. బాఁ కృష్ణ గాడ్గీలు అను గౌరవనీయుఁడగు శాస్త్రి పూనా న్యాయాధీశుఁడుగ నియమింపఁబడెను. శిబిరముల యందు కొంత వఱకు శ్రద్ధగా నియమింపఁబడుచు వచ్చిన పోలీసు (రక్షకభటులు) మంచి వృద్ధిలోనికి తేఁబడెను. సదాశివరావు లంచగొండి యైనను రాచకార్యములయం దెక్కువ యాసక్తితో పని చేయుచుండెడివాఁడు. సివిలు పరిపాలనయందు గొప్ప సంస్కారములను చేయుటకు మహారాష్ట్రులకు తగిన విశ్రాంతి లేకపోవుచు వచ్చెనను విషయమును చదువరులే చూచి యుందురు. వారు కొంచెము పద్ధతుల నేర్పఱుచుటకు ప్రయత్నపడిన తోడనే, యే యంతః కలహమో, ఏవిదేశయుద్ధమో వచ్చి, వారిశ్రద్ధ నాకర్షించు

చుండెడిది. బాలాజీబాజీరావు యొక్క పరిపాలనక్రింద పంచాయితీలును, సివిలున్యాయసభలును, వృద్ధిఁగాంచ మొదలుపెట్టెను. రాజశక్తివాని తీర్మానముల నంత పరీక్షించి యాదరింపక పోయినను జనసంఘముయొక్క తీర్మానముల నెప్పుడు నడ్డగించెడిదికాదు. బాలాజీరావు పరిపాలనయందు మహారాష్ట్ర రాజ్యము సంపూర్ణ విజృంభణము నొందెను. ఆకాలము నుండియే పేరుపొందిన బ్రాహ్మణకుటుంబము లనేకము లారంభ మాయెను. మొత్తము మీఁద ప్రజల యొక్క స్థితి యాకాలములోనే యభివృద్ధిలో నుండెను. మహారాష్ట్ర రయితు వర్గము తా మనుభవింప నారంభించిన దొడ్డ స్థితిని గ్రహించుకొనియే యప్పటి నుండి నానాసాహెబు పీష్వా బాలాజీరావు యొక్క పరిపాలన కాలమును దీవించుచు వచ్చిరి.

ప్రకరణము. 17.

పీష్వా మాధవరావు బలాలు.

1761-1772

సెప్టెంబరు మాసాంతమున స్వర్గీయ బాలాజీరావు యొక్క రెండవ కుమా
రుఁడగు మాధవరావు, తన పదునేడవ సంవత్సరములోనే పినతండ్రితోఁగూడ
1761 సతారాకరిగి, యచట నామమాత్రపు రాజుగానున్న రామరాజునొద్ద
పీష్వాయొక్క హోదాను లాంఛనమునకుఁ బడసెను. మహాపట్టుదలగల
తారాబాయి వెనుక వర్ణించినతీరుననే, ఆమె తరువాత డిసెంబరులో 86 యేండ్ల
వయసున చనిపోవు వఱకును, రాజును ఖైదునందుంచెను. ఆమె జీవితకాలములో
కడపటి క్షణము వరకును, బాలాజీరావు యెడలను, సదాశివరావు యెడలను
మహార్ష కోపమును విడువక, వారియొక్క యాపదలను మరణమును విని సంత
సించువఱకును జీవింపఁగలిగితినని చెప్పి ప్రాణములు విడిచెను. ఆమె మరణా
నంతరము రాజు యొక్క యవస్థ బాగుచేయఁబడెను. అతఁడు సతారాలో
విడి ఖైదునం దుంచఁబడెను. అటుపిమ్మట మఱికొంత కాలమునకు అతనికి చాల
గ్రామములలో నున్న పటేలు రాఁబడులను, ఇందుపూరు దేశముఖుఁడుగ నత
నికిరావలసిన వారసు హక్కులను, వసూలు చేసికొనుటకు ఏజంట్ల నేర్పాటు చేసి
కొనుటకు మాధవరా వాజ్ఞనిచ్చెను.

బాలాజీరావు మరణవార్తను, సాలబజ్జంగు నిజామాలీలు బీదరులో నుండగా వినిరి. నిజామాలీ పేరునకు మంత్రిగానున్నను రాజ్యముయొక్క యధికారములన్నియు చాలవఱకప్పుడే యాక్రమించుకొనెను. తా నదివఱకు పోఁగొట్టుకొన్న జిల్లాలను మహారాష్ట్రులయొద్దనుండి మరల లాగుకొనుట



పీష్వామాధవరావు. I.

కిదియే సమర్థ్యమని యతఁ డాలోచించి, యనేకవంకలమీఁద నౌరంగబాదునకు గొప్ప సైన్యమును పోగుచేయుచుండెను.

రఘునాథరావు సహజముగ నధికారాపేక్ష కలవాఁడై, తన యన్న కుమారుని చిన్నతనమందు తన యభీష్టమును నెఱవేర్చుకొను నవకాశంబుఁ జూచి యపరిమిత సంతోషమున నుండెను. నిజామాలీ యొక్క సన్నాహములవలన మొగలులతో వైరంబు పొసగునను సంశయంబు వొడమినతోడనే బొంబాయి ప్రెసిడెన్సీకిని కొంకను సుభేదారుఁడగు రామాజీ పంతునకును అప్పుడున్న తగాదాలను రఘునాథరావు పరిష్కారము చేయుటకు తలంచెను.

అనేక సంవత్సరములనుండి మహారాష్ట్రులు చతుర్విధోపాయంబుల వశము చేసికొనఁ బ్రయత్నించిన జంజీరా ద్వీపమును, తాము రక్షించిపెట్టెదమని సిద్దీతో మంత్రాంగము చేసి యీస్టిండియా కంపెనీవారు తమ బావుటా నచ్చట నిలువఁబెట్టిరి. దేశమును చల్లఁగ నాక్రమించుకొను శక్తియు, ఆక్రమించుకొనినదానిని చక్కఁగా వశమునం దుంచుకొను శక్తియు, నేకారణముచేతనైన నేమి యింగ్లీషువారికి కలిగి యున్నట్టుల మహారాష్ట్రులకు లేదు. వారికిట్టి శక్తి స్వదేశమగు నింగ్లాండునుండి కలిగిన కారణమొకటి యుండి యా నుండి కలిగిన కారణము మఱియొకటి. ఇంగ్లాండునందు, క్రమక్రమముగ ప్రజాశక్తి వర్ణభేదంబు లేకుండ విజృంభించుటయే ముఖ్యకారణము. ఇండియాయందు వారి స్వదేశమునుండి యనేకవేల మైళ్లదూరమునకు విడివడివచ్చి, పూర్తిగ మతాచార నాగరిక విషయములందు భేదము కల యనేక జాతి వర్ణములవారితో కలసి వర్తింప వలసిన యవసరమున, తమ వర్తకాదులను రక్షించుకొనుటకు కావలసిన లాభనష్ట విచారణాసక్తివలన, జాగ్రత్తవివేకములను కృషిచేసి నేర్చుకొనఁ జేసిన ప్రయత్నములచే కలిగిన దని చెప్పవచ్చును. మహారాష్ట్రు లిట్టి యవసరములను పొడగాంచక దమ రాజ్యార్జనయందున నట్టి నియమములను గమనించినవారు కారైరి. కావుననే దీర్ఘకాలములో మహారాష్ట్రులకు వారి యుద్యమమునందు జయము కలుగలేదు. ఇంగ్లీషువారు దేశము నంతను సంపాదింప వలెనని మొట్టమొదట యూహింపక పోయినను

వని తలంపుగా క్రమక్రమముగ హిందూరాజ్యలక్ష్మి వారి నాశ్రయించెను. రాజ్యము దగ్గఱకు సమీపించుచున్న కొలదిని వారియొక్క యదృష్టము తేటపడుచు వచ్చి యందుకుఁ జేయవలసిన విధానము లింకను వారి మనసునకు ప్రస్ఫుటంబగుచు వచ్చెను. మహారాష్ట్రుల నాశ్రయింప వచ్చిన చంచల రాజ్యలక్ష్మి వారిలో నున్న లోపములను గాంచి మరల తన క్రేగంటిచూపు నెట్లు ఇంగ్లీషు వారిపై ప్రసరింపఁ జేయుచున్నదో మనము చూడఁబోవు కాలమాసన్నమగుట వలననే యీధర్మము కొంచె ముపోద్ఘాతముగ వర్ణింపఁ బడినది. కొంకను సుభేదారుఁడగు రామాజీపంతు జింజీరాను వశము చేసికొన వలెనని ముట్టడించి యుండెను. రఘునాథరా వట్టి సమయములో నిజామాలీ తనపై వచ్చుచున్నాడుకదా యని, ఇంగ్లీషువారు కొందఱు భటులతోడను ఫిరంగులతోడను సాహాయ్యము చేయుదురని యాశపడి, వారితో వివాదములను సద్దుబాటు చేసికొనుటకొప్పుకొని యోడలను పట్టుకొనకుండుట, పాఱిపోయి వచ్చిన భటులను పట్టి యిచ్చుట, సిద్దీనుండి తీసికొనిన దేశమును తిఱిగి యిచ్చుట మొదలైన సాంశములను గూర్చి సంధి చేసికొనెను. కాని దేశమును సంపాదించుకొన వలెనను నిచ్ఛ యింగ్లీషువారికి కలిగి యుండెను. సాలసెట్టి బేసీనులు వారి కున్నయెడల బొంబాయి హార్బరునకు రక్షణగా నుండుననియు వాని నెటులైన సంపాదించుకొన వలయుననియు నిరువది సంవత్సరముల నుండి యాలోచనలో నుండెను. ఒకటిన్నర లక్షలరూపాయిలు రివిన్యూ వచ్చు దేశమును జంబూశ్వరము దగ్గఱ రఘునాథరా విచ్చెద నన్నను మఱి యనేకలాభముల నిచ్చెద నన్నను సాలసెట్టి ద్వీపము లేనందున వారు ఒప్పుకొనరైరి. మహారాష్ట్రులయొక్క యవస్థ యెక్కువైన కొలదిని కంపెనీవారి బెట్టు ఎక్కువగుచు వచ్చెను. కౌన్సిలు ప్రెసిడెంటు, ఈ సమయములో సాలసెట్టి చేతులో పడఁగలదని పూర్ణ విశ్వాసముతో నెదురుచూచు చుండెను.

సముద్రపు వైపునుండి కంపెనీవారు తమయొక్క స్థానమును బలపఱచుకొనఁ జూచుచుండిరి. నిజామలీయు, మొగలు అధికారమును దక్కనునదు ప్రబలఁ జేసికొనుట కింత మంచి తరుణ ముండఁబోదు. పానిపట్టు యుద్ధ

ము వలన మహారాష్ట్రుల ధనమనబలంబులు ప్రస్తుతము గీడ్పడియుండెను. అంతియకాక యీ యపజయమును గూర్చి పరస్పర దోషారోపణలచే వారొకరినొకరు నిందించుకొనుచు వచ్చిరి. మహారాష్ట్ర సిలేదారులు కేవల మాయాపద బ్రాహ్మణుల దుష్ప్రవర్తన వలన కలిగినదని యాక్షేపింపఁ దొడంగిరి. దేశస్థ బ్రాహ్మణు లది నిశ్చయమే యనియు తమ కొంకణసోదరుల వ్యవహారలోపము చేతనే కలిగిన దనియు సిద్ధాంతము సేయ నుంకించిరి. ప్రతిరాజ్యము నందును ఆపత్కాలమున జనించు కక్షభావములు, అజ్ఞానము వలనను వర్ణభేదము వలనను కలుగు మత్సరములచే, నీ దేశంబున నప్పుడు మఱింత విస్తార మయ్యెను. అట్టి స్థితిగతుల యందు దురదృష్టమునకును,దుష్పరిపాలనకును అనేకు లంతరంబెఱుఁగ నందున, మనస్పర్ధలు, అంతఃకలహములు కలుగుట సహజమే. నిజామాలీ యీ వైషమ్యముల లాభ ఫలంబుల ననుభవించుటకు వానిని గూర్చి పూర్తిగ నెఱుంగఁడు. ఒకవేళ వర్తమానము నతఁడు విని యున్నను, గోదావరీ నదీ తీరమున తోకా గ్రామమున నున్న దేవాలయములను నాశనము చేయుట యతని దుష్కృత్యములలో మొదటిదైనందువలననే కక్షవారును అతనిఁ జేరరాను. అయినను మహ్మాదీయులు దానిని విజయ లక్షణంబుగా పరిగణించిరి. నిజామాలీ పూనాకు దోసికొని వచ్చుచుండెను కాని మోగలు సేనలో చాల కాలమునుండి యున్న రామచంద్ర జాధవుఁడును, మఱికొందఱు మహారాష్ట్ర ముఖ్యులును, తమ మతమునకుఁ జూప బడిన యగౌరవమున కసహ్యమును పొందినవారై పీష్వా పక్షమునకు తిరిగిపోయి నిజాముల ముల్కుయొక్క కడపటి పుత్రుఁడైన మీరుమోగలును తమతో తీసికొని పూనాకు వచ్చిరి.

మోగలులు దండువెడలి ఇంకను ముందుకువచ్చుచున్నను విస్ఫురదుత్సాహంబుతో నెదిరింపఁబడుచుండిరి. పూనాకు 14 మైళ్ల దూరమునకు వచ్చిన పిమ్మట నిజామాలీ రాయభారములకు చెవియొగ్గ వలసినవాఁడై బాలాజీరావుచే జయింపఁబడిన దేశమంతయు నడుగు గొప్పకోరికను విడువవలసినవాడయ్యెను. రఘునాధరావు ఆసంధికి మూల్యముగ ఔరంగబాదు బీడయలనుండి 27 లక్షల

సంవత్సరపు రివిన్యూ నతని కిచ్చివేసెను. బొంబాయినుండి యూరోపియనుల సహాయ మక్కరలేక పోవుటవలన నా రాయభారము లంత ముగిసెను.

ఈసంధిజరిగిన పిమ్మట కుమార పీష్వా, స్వర్గీయ సదాశివరావుయొక్క మేనమామయగు త్రింబకురావుమామాతోఁగూడ దక్షిణదేశమున రివిన్యూ వసూలుచేయుటకు పంపఁబడెను. నిజామాలీ బీడరునకు తిరిగిపోయి యచ్చట మనోబలహీనుండగు తనసోదరుని సాలబజ్జంగును జూలై నెలలో ఖైదు చేయించి యటుతరువాత నతని పదునేను మాసముల పిమ్మట చంపించి
1762
రాజ్యమును పూర్ణముగ నాక్రమించుకొనెను.

మాధవరావు పూనాకుతిరిగివచ్చిన కొద్దికాలములోనే యతఁడు పరిపాలనాధికారమందు కొంత నిర్వాహణము నవలంబింప కోరికఁజూపినందున, నతనికిని పినతండ్రికిని వివాదములు సంభవమయ్యెను. ఈబాలుని యహంకారమునుఁ జూచి, రఘునాథరావును, శుకారాం బాపూయును, ఇంక ననేకమంత్రులును లాఘవముగ నెంచుకొని మనసు నొచ్చుకొనిరి. తమరులేక, రాజకార్యములు నడువఁజాలవని వారెంచి యుద్యోగములకు రాజీనామాలనిచ్చిరి. కాని శుకారాంబాపూ మాత్రము రెండుపక్షముల వారితోడను నిష్టుఁడుగనుండుటకుఁగాను తానువిధిలేక యట్లు చేయవలసి వచ్చినట్లును, ఏదోయొకవిధమున సమాధాన మార్గమును తెలిచి యుంచుకొని యున్నట్లును నటించుచుండెను. మాధవరావు కాలవిళంబనము లేకుండ, తత్క్షణమే త్రింబకురావు మామాను దివానుగ నుండుమనికోరెను. అతఁడును మెరిచి జాగీరుదారగు గోపాలురావు గోవిందపట్వర్ధనుయొక్క సాయముతో దివానుపనిని నిర్వహించెను. ఇంత చిన్నవయసుననే మాధవరావుయొక్క బుద్ధి సూక్ష్మత, యతఁడు తనకు స్వంతకార్యానులుగ ముందు ప్రసిద్ధికిరాఁబోవు బాలాజీ జనార్దనభానూ (నానాఫడ్నవీసు) ను, హరిపంతు ఫడ్కేను ఎన్నుకొనుటయందు కానంబడుచున్నది.

త్రింబకురావు మామా దివాను ఉద్యోగమును స్వీకరించుట శుకరాం బాపూ కీర్ష్యాజనకమును, రఘునాథరావున కసహ్యాజనకము నయ్యెను. ఇఁక పరువ

హృదయూర్ధ్వాలగు రఘునాధరావు భార్య * యానందబాయికిని, తోడికోడలును మాధవరావు తల్లియునగు గోపికాబాయినికి జనించిన కయ్యాట ముఖము కత్తుల వారి మనస్పర్థలను బహిరంగ కలహంబులలోనికి పెంచెను. రఘునాధరావు నాసికకు వెడలి యచ్చటనుండి ఔరంగబాదునకు పోయి యాపట్టణ గవర్నరగు మురాదుఖానుచే మిక్కిలి యాదరింపఁబడి, మొదట మోగలు సైన్యముల సాహాయ్యమును పొంది తరువాత ననేక మహారాష్ట్రులచే కలిసికొనఁ బడెను. ఇట్లు సైన్యసమేతుఁడై యతఁడు పూనాకు బయలుదేరి పూనాకును అహమ్మదు నగరమునకును మధ్యస్థన యున్న కుమారుని సైన్యము నోడించెను. నిజామాలీ రఘునాధరావుయొక్క సాయమునకు వచ్చుచుండెను. జానోజీ భాంస్లే తన యభిప్రాయము లేమియుఁ దెలియనియ్యక బేరారునుండి దగ్గఱకుఁ జేరుచుండెను. పూనా పరిపాలనలో గొప్పవిప్లవము సంభవించు చిహ్నములు నలుదిక్కులఁ గానుపించెను. అట్టియెడ మాధవరావు సుప్రసిద్ధ దూరదృష్టి మనోనిశ్చయంబులతో తత్క్షణమే తనపినతండ్రిని శరణుఁ జొచ్చుటయే రాష్ట్రములో సంపూర్ణభేదంబు కలుగకుండ నాపుట కుపాయంబని మనసునందు తీర్మానము చేసికొనెను. తన మిత్రులందఱును ఎవరి క్షేమమును వారు చూచుకొన నాజ్ఞాపించి, మాధవరావు తానుమాత్రము పినతండ్రి సముఖంబున కేగినవాఁడై యర్హావిధంబున తానధికారమును సమర్పించుటకు కారణము లుగ్గడించెను. పినతండ్రి యతనిని నిర్బంధమునం దుంచినను, అతనికి రఘునాధరావు తన యత్యున్నత దశయందుఁగూడ నాకర్షింపఁజాలని గౌరవమును చూపింపవలసిన వాఁడయ్యెను. మోగలుసఖ్యమునకు మూల్యముగ రఘునాధరావు నిజామాలీకి దౌలతాబాదు, శివనేరి, అసీరుఘరు అహమ్మదునగరము ఇంకను 1760 లో నతనినుండి దీసికొనిన దేశములో 51 లక్షల రివిన్యూవచ్చుదేశమును తిరిగి యిచ్చుటకు వాగ్దానముచేసెను. నిజామాలీ సంధిజరిగిన దని చాలసంతోషమును నటించెను. భీమ నదీతీరమున పాయిగ్రామునొద్ద పరస్పర సముచిత గౌరవ లాంఛనములు

*ఆనందబాయి రఘునాధరావునకు రెండవపెండ్లిభార్య. అందుచేత నతఁడామెయం దెక్కువ గారాబమును చూపుచుండెడివాఁడు.

జరిగెను. వాగ్దానము చేయఁబడిన దేశమియ్యఁబడుటకుత్తరువులు వెడలెను. కాని యీయుత్తరువులు ముందు చెప్పఁబడఁబోవు కారణముల వలన నిలిపివేయఁబడెను. ఒక్కడౌలతాబాదు తప్ప తక్కినకోట లెవ్వియు నియ్యఁబడలేదు.

రఘునాధరావు ఇప్పుడు నిరంకుశాధికార సమన్వితుఁడై శుకారాంబాపూను, నీలకంఠమహాదేవు పురంధరేను తనప్రధానమంత్రులుగా నియమించుకొని,వీరిలో మొదటివానికి తొమ్మిదిలక్షల రివిన్యూ వచ్చు జాగీరునిచ్చి, రెండవవానికి బాలాజీ విశ్వనాధుని కాలమునుండియు పీష్వాలకుటుంబముయొక్క వశములో జాగ్రత్తగ నుంచఁబడిన పురంధరే దుర్గముయొక్క యాధిపత్యము నిచ్చి, సంతృప్తులం జేసెను. రఘునాధరావు యొక్క తరువాతచర్య యింతకంటె సవివేకముగ నుండెను. ప్రతినిధియగు జగజీవనుడు స్వర్గస్థుఁడైన పిమ్మట యతని యన్నకుమారుఁడగు భవానీరావు అని పూర్వముసామాన్యముగ పిలువఁబడు, శ్రీనివాస గంగాధరుఁడు అతనిస్థానమునకు వారసుగావచ్చెను. కాని రఘునాధరావు వానిని ఉద్యోగమునుండి తప్పించి శైశవమునందున్న తన పుత్రుఁడగు భాస్కరరావును ప్రతినిధినిచేసి, ఢిల్లీకోటలో కావలి సైన్యమునకు నాయకుఁడుగ కొంతకాల మిదివఱ కున్నట్లుగఁ జెప్పిన నారూశంకరు (రాజబహాద్దర్) ను ముతలికుగా నియమించెను. మొగలుపక్షమునుండి వెనుకటి సంవత్సరము తిరిగిపోయిన రామచంద్రజాధవుని,యతనిముత్తాత సుప్రసిద్ధుఁడగు ధనాజీ జాధవునిచే వహింపఁబడిన, సేనాపతిత్వమున కభిషేకించెను. అతఁడును సేనాపతిగ గుజరాతురాజ్యము నియ్యఁబడునని చేయఁబడిన వాగ్దానమును చెల్లింపఁబడ నందున, భగ్నమనోరథుఁడై నిజామాలీతో యొదవిన ప్రథమసమయమునందే సంధిచేసికొని మరల వెడలిపోయెను. కనోజీ మొహితీ సర్ లష్కరుగా చేయఁబడెను. విఠలశివదేవుఁడు (వించూర్కారు) సాహూ పరిపాలనకాలములో నేర్పఱుపఁబడిన రాజుక్రింద యధికారమును వహించు పంతురాజన్య అను ఉద్యోగమునకు నియమింపఁబడెను. బాలాజీ విశ్వనాధుని కాలమునుండియు భానూవంశమునందుంచఁబడిన ఫద్నీసుపనిని మెరోబా బాబూరావునుండితప్పించి చింతూవిఠలు కియ్యఁబడెను.



రగోబా.



ರಗೋಬಾ. 482

ఈమార్గములు విస్తారమసంతుష్టికి కారణమయ్యెను. కాని రఘునాధరావు
1763 త్రింబకురావు మామాకు సాహాయ్యముగ నియమింపఁబడిన గోపాలరావు
పట్వర్ధనుపై పగఁదీర్చుకొనుటకు, మెరిచికోటనుముట్టడించి పట్టుకొని
నపుడు, ఇదివఱకు అతనిఅన్నకుమారుని చిన్నతనమందు, అతనియధికారము
నకుఁ దోడ్పడ నాలోచించుచుండిన యనేకుల కతఁడు విరోధియయ్యెను. ఇతని
యేర్పాటులచే నష్టపడిన గోపాలరావును, మఱికొందఱును, నిజామాలీయొక్క
మంత్రియగు విఠలసుందరునిబోధలకు శీఘ్రముగ చెవియొగ్గి యాపక్షమునకుఁ
దిరిగిపోయిరి. ఈనిజాము మంత్రి యజుర్వేదశాఖబ్రాహ్మణుఁడు. నిజామాలీ
తనసోదరుని కారాగారబద్ధునిచేసినపుడు రాజాప్రతాపవంతుఁడను బిరుదనా
మముతో నితఁడు ప్రధానమంత్రిగాఁ జేయఁబడెను. విఠలసుందరుఁడు, రఘు
నాధరావు మురాదుఖానుతోఁ జేసికొనిన సంధిచేనీర్ష్యాకలితుఁడై, మహారాష్ట్రు
లను పూర్ణముగ లోఁబఱుచుకొను సమయ మిప్పు డొదవెనని నిజామాలీని
ప్రోత్సాహపెట్టెను. కొంకణబ్రాహ్మణుల పరిపాలనను తలక్రిందుచేసి, (సతారా
రాజు పరిపాలన కసమర్థుఁడైనందున) తారాబాయి చనిపోయినతరువాత జానో
జీయే న్యాయమైన రక్షణకర్తయయ్యెనని ప్రకటించుటయే యోగ్యమైన
రాజనీతియని యతఁ డుద్ఘాటించెను. ఈ పద్ధతికి జానోజీ వైళ మా
మోదించెను. కపటవర్తనుఁడగు నిజామాలీ, తనప్రధానమంత్రి యాప్ర
కారము రాజతంత్రములనలుపుచుండ, తాను రహస్యముగ కొల్లాపురపు
రాజుతో నుత్తరప్రత్యుత్తరములు జరిగించుచు, ఒకవేళ జానోజీయొక్క
హక్కులు నిష్ఫలములైనయెడల మూలబలముగ కడపటి కింకొక వైరిని వెనుక
నూరుచుకొన నుద్దేశించెను. అంతేయు జయప్రద మగునట్లుఁ గానిపించెను. మీరు
మొగలు, రఘునాధరావుచే ననాదరముగఁ జూడఁబడి యన్నగారిదగ్గఱకు తిరిగి
వచ్చిచేరెను. మోరోబాఫడ్నవీసు, సదాశివ రామచంద్రుఁడు (రామచంద్ర
శెన్వియొక్క కుమారుఁడు) భవానీరావు (తొలగింపఁబడిన ప్రతినిధి), గోపాల
రావు పట్వర్ధనుఁడు, మఱియనేకులు మొగలులపక్షముచేరిరి. వెనుక పాయి
ర్గాముయొద్దజరిగిన సంధిప్రకారము జిల్లా లింకను ఇచ్చివేయఁబడక పూర్వమే

కలహములు మరల ప్రారంభమాయెను. ఈ వ్యవహారమునకు రఘునాధరావు సంసిద్ధుఁడు కాలేదు. కాని ఈ యాపత్సమయమున మాధవరావింకను నిర్బంధమునందున్నను తనయుపదేశ యధికారిబలములచే సాయమొనర్చెను. మల్హారిరావు హోల్కారును, దమ్మాజీ గాయక్వాడును రఘునాధరావుతో నప్పుడుండిరి. కాని నిజామాలీయొక్క సమీకృతసైన్యములతో, పోరాడ చాలినంత స్థితిలో వారిసైన్యముండలేదు. కాని గుడారపుసామానుల భారములేకుండుటచే శత్రువుకంటె నెక్కువ యనుకూలములుకలిగియున్నదని హోల్కారుతలంచెను. వారు యుద్ధమును సలుపవచ్చినటుల నటించుచు ముందుకు తరలివచ్చి, యుద్ధమునుసలుపక, మొగలుసైన్యము నతిక్రమించిపోయి, ఔరంగబాదునకునడచి దాని లగ్గలపట్ట యత్నించి సాధ్యముకాక యింకను ప్రయాణమయిపోయిరి. నిజామాలీ వచ్చుచున్నాఁడని తెలిసి, వారు బీరారునకుపోయి జానోజీభాంస్లే యొక్క దేశములోఁజొచ్చి మామూలుప్రకారము కొల్లఁబెట్ట మొదలుపెట్టిరి. మల్కాపురమునుండి వారు 60,000 రూపాయిలను సుంకముకొని యచటనుండి తఱుమఁబడి తిరిగివచ్చి మంగపట్టణముచేరిరి. అచటనుండి ఆగ్నేయమార్గమున తిరిగి మొగలురాజ్యమును చాల నాశనముఁజేసిరి. నిజామాలీ వారిని వెంటనంటి కొంతకాలమరిగి, వారిని కలిసికొనుట యసాధ్యమనితలఁచి యతఁడు సూటిగ పూనాకుపోయి దానికొల్లఁబెట్ట నిశ్చయించెను. రఘునాధరావు అందుకు ప్రతిక్రియగ హైదరాబాదునకై దాడివెడలెను.

మొగలు సైన్యము పూనా వచ్చుచున్నదని తెలియఁగనే, యచటి ప్రజలు తమయాస్తిని సాధ్యమైనంతవఱకు వెంటఁదీసికొని, కొందఱు కొండకోటలకును కొందఱు కొంకణమునకును పాఱిపోయిరి. పీష్వాయొక్క కుటుంబమును, రాష్ట్రపు కాగితములును, సింహగడకు పంపఁబడెను. కాని జానోజీభాంస్లే యుద్యోగస్థులలో నొకఁడగు బాపూ కరంధియా త్వరితగతి నరుదెంచి పాఱిపోవు వారియొక్క కొంతయాస్తిని పట్టుకొనెను. సింహగడ క్రిందనున్న యొక గ్రామము తగులబెట్టఁబడెను. మహారాష్ట్రచరిత్రను శైలియఁజేయు కొన్ని వ్రాఁతప్రతులును, రాష్ట్రపు పత్రములును పూర్ణముగ నాశనము చేయఁబడెను.